Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 270 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ ఆదివారం 26-10-2025 పేజీలు : 12 వెల : 2/-

## అమరవీరుల కుటుంబాలకు కవిత క్షమాపణ



**-జనం బాట కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ**

**-గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు**

**-అమరవీరుల కుటుంబాలకు తలా రూ. కోటి ఇవ్వాలని డిమాండ్**

హైదరాబాద్ అమరవీరుల కుటుంబాలకు బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో న్యాయం చేయలేని కారణంగా వారికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణ చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమరవీరుల కోసం తాను మరింత పోరాటం చేయాల్సి ఉండే అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ హయాంలో అమరవీరులకు న్యాయం చేయలేకపోయాం..**

తెలంగాణ జాగృతి జనం బాటలో భాగంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి మాజీ ఎమ్మెల్సీ కవిత నివాళులు అర్పించారు. అమరుల ఆశయ సాధనలో ఎంత వరకు ముందుకొచ్చామని

## కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ



**-బైక్‌ను బస్సు ఢీకొట్టలేదని తేలిన వైనం**

అమరావతి కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం వెనుక ఉన్న మిస్టరీ వీడింది. తొలుత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, బైక్‌ను నేరుగా ఢీకొట్టడం వల్లే మంటలు చెలరేగాయని భావించగా, పోలీసుల దర్యాప్తులో అది తప్పని తేలింది. బైక్‌పై వెనుక కూర్చుని ప్రయాణిస్తూ స్వల్ప గాయాలతో బయటపడిన ఎర్రిస్వామిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఇద్దరూ బైక్‌పై లక్ష్మీపురం నుంచి రాత్రి 2 గంటలకు బయలుదేరారు. ఎర్రిస్వామిని

మిగతా 2లో

### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక..

# రేవంత్ పాలనకు పరీక్ష

**-గెలిస్తే పార్టీ క్రెడిట్ మొత్తం హైకమాండ్ సొంతం**

**-ఓడిపోతే బాధ్యత మాత్రం రేవంత్‌పైనేనా.?**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేదు. ఇక ఆక్రమణల తొలగింపునకు రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా విశ్వనగరంలో వివాదాస్పదమైంది. ఇలాంటి పరస్థితుల్లో వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సీఎం రేవంత్‌రెడ్డికి ఒక అగ్ని పరీక్షలా మారాయి. అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనకు పార్టీ స్వేచ్ఛ తక్కువగా ఉన్న ఈ పరిస్థితుల్లో విజయం సాధించడం అంత ఈజీ కాదు. ఫలితం ఏదైనా, దాని రాజకీయ ప్రభావం నేరుగా రేవంత్‌పైనే పడుతుందని విశ్లేషకులు, పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గెలిస్తే పార్టీ క్రెడిట్ మొత్తం హైకమాండ్ సొంతం అవుతుంది. ఓడిపోతే బాధ్యత మాత్రం రేవంత్‌పైనే వేస్తారనేది స్పష్టంగా కనిపిస్తోంది.



**హైకమాండ్ వ్యూహం**

రేవంత్ రెడ్డి చురుకుదనమే తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి

మిగతా 2లో



## ప్రతి చొరబాటుదారుడిని గుర్తిస్తాం

**-దేశం నుంచి పంపిస్తామన్న అమిత్ షా**

పాట్నా బిహార్‌లో ఉన్న ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వస్థలాలకు తిరిగి పంపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. చొరబాటుదారులను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తుంటే వారిని రక్షించేందుకు రాహుల్ గాంధీ యాత్ర చేపట్టారని విమర్శించారు. బిహార్‌లోని ఖగారియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అమిత్ షా ఆర్జేడీ, కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ, సీఎం నీతీశ్ కుమార్‌లు బిహార్ అభివృద్ధికై పనిచేస్తుంటే, లాలూ తన కుటుంబం బాగు కోసం అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని అమిత్ షా విమర్శించారు. ఎన్డీఏ హయాంలో బిహార్‌లో నేరాలు తగ్గాయని చెప్పారు.

**హోరాహోరీగా ప్రచారం**

బిహార్లో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతూ ముందుకు సాగుతున్నాయి. సభలు, సమావేశాల్లో నాయకులంతా బిజీ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ఓ సభలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై విరుచుకుపడ్డారు. విపక్ష ఇండియా కూటమి ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకించిందంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**మోదీ హయాంలో నేరాలు తగ్గాయ్**

"బిహార్లో 2005 నుంచి 2025 వరకు నేరాలు గణనీయంగా తగ్గాయి. గత 10 సంవత్సరాల్లో మారణహోమం

మిగతా 2లో



## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

**సెల్ ఫోన్ దొంగలపై కాల్పులు జరిపిన డీసీపీ చైతన్య**

హైదరాబాద్ నగరంలో కాల్పుల కలకలం రేగింది. శనివారం సాయంత్రం చాదర్‌ఘాట్ ప్రాంతంలో ఇద్దరు సెల్ ఫోన్ దొంగలపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సాయి చైతన్య స్వయంగా కాల్పులు జరిపారు. తనపై కత్తితో దాడికి యత్నించడంతో ఆయన ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు దొంగలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, డీసీపీ సాయి చైతన్య శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం ముగించుకుని తిరిగి తన కార్యాలయానికి వస్తుండగా

మిగతా 2లో

## మొంథా' తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి




**- సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

**-'మొంథా' తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్ జారీ**

**-అధికారులతో సీఎం చంద్రబాబు అత్యవసర టెలీకాన్ఫరెన్స్**

**-గంటకు 110 కి.మీ వేగంతో పెనుగాలులు వీచే అవకాశం**

**-ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం**




## మునిసిపాలిటీలకు భారీగా నిధుల విడుదల

**తక్షణమే పనులు ప్రారంభించాలని రేవంత్ ఆదేశం**

## అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం

**-హరీశ్‌కు అడ్లూరి సవాల్**



2లో

## హైదరాబాదులో రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసు



2లో

## మా లొంగుబాటు ద్రోహం కాదు, బస్వరాజ్ తీసుకున్న నిర్ణయమే

**మావోయిస్టు పార్టీ ఆరోపణలను ఖండించిన ఆశన్న**



# జూబ్లిహిల్స్ ఉపఎన్నిక.. రేవంత్ పాలనకు పరీక్ష

ప్రధాన కారణం. అయినప్పటికీ, ఆయన వేగం అధికమైతే మరొక మైనస్ అవుతారన్న భయంతో హైకమాండ్ నిరంతరం నియంత్రణ విధానం అనుసరిస్తోంది. కేబినెట్‌లో రేవంత్ సిఫారసులను పట్టించుకోవడం లేదు. కీలక నిర్ణయాలలో ఇతర నేతలకు ప్రాధాన్యత ఇచ్చి సమతుల్యం సాధించాలని చూస్తున్నారు. హైకమాండ్ మద్దతు ఉన్న నేతలు సీఎం అధికార పరిధిలోకి రాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రేవంత్ ప్రభుత్వంలో స్పష్టమైన విభజన వాతావరణం ఏర్పడిందని పరిశీలకుల అభిప్రాయం.

**సమన్వయం తక్కువ.. వివాదాలు ఎక్కువ**

నవీన్ యాదవ్ అభ్యర్థిగా ఉన్న జూబ్లిహిల్స్ ఉపఎన్నికలో ప్రచారానికి మించిన అంతర్గత విభేదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రాంతీయ స్థాయిలో ఆయనకు మద్దతు ఉన్నప్పటికీ, రాష్ట్ర నేతలు పరస్పర విభేదాలతో ప్రచారాన్ని గందరగోళంగా మార్చారు. ఒకరిని మరొకరు దెబ్బతీయడమే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నట్లు కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి నేరుగా ప్రచారంలోకి దిగుతారా అన్నది ఇంకా అనిశ్చితమే.

**విజయమా.? ఓటమా.?**

రేవంత్ స్వయంగా ప్రచారంలోకి దిగుతారని హైకమాండ్ సంకేతాలు ఇస్తోంది. దీంతో గెలిస్తే రేవంత్‌కు అధిష్టానం వద్ద మరింత గుర్తింపు లభిస్తుంది. పట్టు దొరుకుతుంది. ఓడితే మాత్రం ఆయనపై విమర్శలు తప్పవు. సొంత పార్టీలోని వ్యతిరేకులు, మంత్రి పదవి ఆవించి భంగపడిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటి నాయకులతో ఇబ్బందులు తప్పవు. అంటే ఈ ఉపఎన్నిక రేవంత్‌కు చావో రేవో అన్న పరిస్థితిని సృష్టించింది. నాయకత్వపరంగా ఆయన స్థానాన్ని బలపరచడం కాకుండా, మరింత అప్రమత్తతతో వ్యవహరించే పరిస్థితి నెలకొంది. రేవంత్ ఈ ఉపఎన్నికను తన ప్రతిష్ఠాత్మక పోరుగా మార్చుకోవడం తప్ప మరో మార్గం లేదు. గెలుపు ఆయన రాష్ట్రస్థాయి ఆధిపత్యాన్ని నిలబెట్టగలిగే మార్గం అవుతుంది.

కానీ అంతర్గత శక్తులు, హైకమాండ్ గణాంకాల పాలిటిక్స్ ఆయన భవిష్యత్ కూడదారిని నిర్ణయించవచ్చు. ఈ పోరాటం రేవంత్ రెడ్డి రాజకీయ బలహీనతా లేక బలమా తేల్చేదిగా నిలుస్తుంది.

# ప్రతి చొరబాటుదారుడిని గుర్తిస్తాం

జరగలేదు. 11 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మోదీ భారతదేశంలో గణనీయమైన మార్పును తీసుకువచ్చారు. అయోధ్యలో రామ్ లల్లా ఆలయానికి పునాది రాయి వేసి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. రాహుల్, మమత, లాలూ అంతా రాముడి ఆలయాన్ని వ్యతిరేకించారు. కాగా మా మోదీ హయాంలోనే బిహార్ వారసత్వాన్ని చాటే నలంద విశ్వవిద్యాలయాన్ని పునర్నిర్మించాం" అని అమిత్ షా అన్నారు.

**బిహార్ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం**

మరోవైపు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే తాము ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అన్నారు. మహాగత్బంధన్ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామని తెలిపారు. అలాగే 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడియాలోని గోగ్రిలో నిర్వహించిన ప్రచార సభలో తేజస్వీ ఈ మేరకు హామీ ఇచ్చారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

# మొంథా' తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

**- సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**
**-'మొంథా' తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్ జారీ**
**-అధికారులతో సీఎం చంద్రబాబు అత్యవసర టెలీకాన్ఫరెన్స్**
**-గంటకు 110 కి.మీ వేగంతో పెనుగాలులు వీచే అవకాశం**
**-ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం**

అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై 'మొంథా' తుపాను విరుచుకుపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యూఏఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలెర్ట్‌ను ప్రస్తావిస్తూ, ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంటుందని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో 'మొంథా' తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. దీని ప్రభావం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఉంటుందని, 80 నుంచి 100 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

"ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ప్రతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి. తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. తీరప్రాంత ప్రజలకు తుఫాన్ తీవ్రతపై అవగాహన కల్పించి, వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకే అప్పగించారు. అన్ని ప్రధాన, మధ్య తరహా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి విడుదలను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి, సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచాలన్నారు. కాకినాడలో 'హాస్పిటల్ ఆన్ వీల్స్' సేవలను అందుబాటులో ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు.

ఆర్ అండ్ బీ, విద్యుత్, నీటిపారుదల, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, మొబైల్ టవర్స్, నిత్యావసరాల పంపిణీ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాలకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జి అధికారులను నియమించి, క్షేత్రస్థాయిలో నష్ట నివారణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

# అమరవీరుల కుటుంబాలకు కవిత క్షమాపణ

ఆలోచించుకోవాలి. తెలంగాణ రాష్ట్రం రావడానికి పేగులు తెగేదాక ఉద్యమకారులు ఎంత పోరాడారో గుర్తుచేసుకోవాలి. అమరుల ఆశయ సాధన కోసం మనమంతా పోరాడదాం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1200 మంది ప్రాణాలర్పించి అమరులయ్యారు. అమరవీరుల కుటుంబాలకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వలేకపోయాం. ప్రతి అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల రూపాయలు, ఓ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చాం. కానీ 1200 మంది అమరులు అని పలు సందర్భాలలో చెప్పిన మనమే కేవలం 580 మందికి మాత్రమే రూ.10 లక్షలు, ఉద్యోగం ఇచ్చాం. మిగతా అమరవీరులకు న్యాయం చేయలేకపోయాం.

**అమరవీరుల కుటుంబాలకు క్షమాపణ**

కొందరు అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు కొన్ని పోస్టులు వచ్చాయి. కొందరికి ఎన్నికల్లో పోటీకి అవకాశం లభించింది. నేటికి తమకు న్యాయం జరగలేదని అమరవీరుల కుటుంబాలతో పాటు ఉద్యమకారులు ప్రతి మండలంలో పోరాటం చేస్తున్నారు. 10 సంవత్సరాలు బీఆర్ఎస్ లో తాను మంత్రిగా లేకపోయినా ఎంపీగా, ఎమ్మెల్సీగా కొనసాగాను. మిగతా అమరవీరులకు ఆర్థికసాయం చేయాలని అంతర్గత వేదికల్లో పలుమార్లు ప్రస్తావించా. వారికి న్యాయం చేయలేనందుకు చేతులెత్తి క్షమాపణ కోరుతున్నాను. మీకోసం గట్టిగా అడిగా. కానీ సాధించుకునేంత వరకు పోరాటం చేయలేకపోయా. రాష్ట్రం బాగుండాలని ఉద్యమం చేశాం.

**అమరవీరుల కుటుంబాలకు రూ.1 కోటి ఇవ్వాలని డిమాండ్**

మీకు న్యాయం చేస్తామని అమరవీరుల స్థూపం వద్ద ప్రమాణం చేస్తున్న. ప్రతి అమరవీరుడి కుటుంబానికి రూ.1 కోటి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న. ఈ ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. లేకపోతే కొత్త ప్రభుత్వం వచ్చాకైనా వారికి న్యాయం జరిగేలా చేస్తా. అమరవీరులు, ఉద్యమకారుల జాబితాను మనమే ప్రజా దర్బార్ పెట్టుకుని జిల్లాలవారీగా పోరాటం చేస్తాం. 33 జిల్లాలు 119 నియోజకవర్గాల వారిగా ఉద్యమకారులకు పిలుపునిస్తున్న. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు 200 గజాల జాగా ఇస్తామని చెప్పింది. దాని అమలు కోసం కలిసి పోరాటం చేద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోకుండా పోరాటం చేద్దామని' కవిత పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ జాగృతి జనంబాట యాత్రలో భాగంగా నిజామాబాద్ పర్యటనకు కవిత బయలు దేరి వెళ్లారు.

**అన్ని సామాజికవర్గాలకు అవకాశాలు**

యువత, మహిళలు, బీసీలు, మైనారిటీలు, హరిజనులు, గిరిజనులు అన్ని వర్గాలు బాగుండాలని తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. కానీ అది జరగలేదని తెలంగాణలో వినిపిస్తుంది. సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేస్తాం. బీసీలకు రిజర్వేషన్ల కోసం పోరాటం చేసి సాధిస్తాం. ఎస్సీలు, మైనారిటీల కోసం తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుంది. ఆర్యవైశ్యులు రాజకీయాల్లో కనిపిస్తలేరు. వారితో పాటు అగ్రవర్ణాల పేదలకు రాజకీయ, సామాజిక అవకాశాలు కల్పించినప్పుడే రంగురంగుల బతుకమ్మలా రాష్ట్రం ఉంటుంది. తెలంగాణలో మేధావులను కలిసి పరిస్థితి తెలుసుకుని ముందుకు వెళ్తాం.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆగం చేస్తుంది. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను సైతం రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. తెలంగాణ పండుగల్ని గౌరవించుకునేలా, అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకునేలా పోరాటం చేద్దాం. స్థానికేతరులకు ఉద్యోగాలు రాకుండా చూసేలా ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ సైతం తెచ్చుకున్నాం. కానీ నేడు హర్యానా వాళ్లకు సైతం ఉద్యోగాలు వస్తున్నాయి. నీళ్లు కొన్ని ప్రాంతాలకే వచ్చాయి. ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి జరగాలని, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు న్యాయం జరగాలి. వారికి న్యాయం జరగనందుకు తెలంగాణ జాగృతి తరపున క్షమాపణ చెబుతున్నాను. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నుంచి అనిల్ కుమార్, అంజిరెడ్డి సహా పలువురు తెలంగాణ జాగృతితో కలిసి పనిచేస్తామని ముందుకు రావడం సంతోషం' అన్నారు.

# మా లొంగుబాటు ద్రోహం కాదు, బస్వరాజ్ తీసుకున్న నిర్ణయమే

హైదరాబాద్ తమ లొంగుబాటుపై మావోయిస్టు పార్టీ చేస్తున్న ఆరోపణలపై మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న (రూపేశ్) సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము కోవర్టులుగా పనిచేసి పార్టీకి ద్రోహం చేశామన్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. సాయుధ పోరాటాన్ని విరమించాలనే నిర్ణయం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు (బస్వరాజ్) బతికుండగానే ఆయన నాయకత్వంలో తీసుకున్నదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు లొంగిపోయిన ఇతర మావోయిస్టులతో కలిసి ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. "మావోయిస్టు పార్టీ నుంచి ఎవరు బయటకు వచ్చినా ద్రోహులు అనడం పరిపాటి. అందుకే మొదట స్పందించవద్దని అనుకున్నాం. కానీ, పార్టీకి జరిగిన నష్టానికి మేమే కారణమని, కోవర్టులుగా పనిచేశామని ఆరోపించడంతో సమాధానం చెప్పాలని ఈ వీడియో చేస్తున్నాం" అని ఆశన్న తెలిపారు. అడవి మార్గాన్ని వీడే క్రమంలో సాయుధ పోరాట విరమణ, శాంతి చర్చలు అనే రెండు అంశాలపై చర్చ జరిగిందని, చివరికి సాయుధ పోరాట విరమణకే మొగ్గు చూపినట్లు వివరించారు. ఈ చర్చలన్నీ ఏప్రిల్-మే నెలల్లో బస్వరాజ్ నాయకత్వంలోనే జరిగాయని, ఇప్పుడు ఆయన చనిపోయారు కాబట్టి తిరిగి వచ్చి చెప్పలేరనే ధైర్యంతో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆశన్న విమర్శించారు.

సాయుధ పోరాట విరమణ విషయంలో బస్వరాజ్ రాసిన చివరి లేఖను పార్టీలోని కొందరు కీలక నేతలు దాచిపెట్టారని ఆశన్న సంచలన ఆరోపణలు చేశారు. "మే 18న బస్వరాజ్ తన చివరి లేఖ పంపిన తర్వాతే ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఆ తర్వాత నేను కొందరు కేంద్ర కమిటీ సభ్యులను కలిసి ఆ లేఖను చూపించాను. మనం ఎలాంటి తప్పు నిర్ణయం తీసుకోలేదని, పార్టీని కాపాడుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని బస్వరాజ్ ఆ లేఖలో స్పష్టంగా రాశారు. అయితే మే 13న ఆయన కేంద్ర కమిటీ సభ్యులందరికీ రాసిన లేఖను మాత్రం ఒకరిద్దరు చదివి, మిగతావారికి ఇవ్వకుండా దాచిపెట్టారు. ఆ లేఖ బయటకు వస్తే వాస్తవాలు తెలుస్తాయనే భయంతోనే ఇలా చేస్తున్నారు" అని ఆశన్న ఆరోపించారు. ఈ విషయంలో పౌరహక్కుల సంఘాల నేతలు, ప్రజాస్వామ్యవాదులు తమ పరిధి దాటి మాట్లాడుతున్నారని ఆశన్న మండిపడ్డారు. "హైదరాబాద్‌లో కూర్చుని ఆయుధాలే ముఖ్యమంటున్నారు. మా శవాలు వస్తే ఎర్రజెండాలు పట్టుకుని ఊరేగింపులు చేద్దామనుకుంటున్నారా? దారులన్నీ మూసుకుపోయినప్పుడు ఏ లక్ష్యం కోసం ప్రాణత్యాగం చేయాలి?" అని ఆయన ప్రశ్నించారు. పౌరహక్కుల సంఘాల నేతలు రెండు వైపులా వాదనలు వినకుండా ఏకపక్షంగా ఎలా నిర్ధారణకు వస్తారని నిలదీశారు. తాము అందుబాటులోనే ఉన్నామని, వాస్తవాలు తెలుసుకోవాలంటే తమను సంప్రదించవచ్చని సూచించారు.

తమలో ఇంకా విప్లవతత్వం ఉందని, ఎలాంటి స్వార్థ ప్రయోజనాల కోసం తాము లొంగిపోలేదని ఆశన్న స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజల మధ్య ఉండి ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని తెలిపారు. త్వరలోనే అందరి సలహాలు తీసుకుని తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన... ఐదు రోజుల పాటు అలర్ట్

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని, కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే సూచనలున్నాయని తెలిపింది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయి.అక్టోబర్ 27 నుంచి వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. 'అక్టోబర్ 28, 29 తేదీల్లో పెద్దపల్లి, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు పలు ఉమ్మడి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈదురు గాలులతో కూడిన వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో నమోదవుతాయని పేర్కొంది.

## కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ

ఇంటి వద్ద దించేందుకు శివశంకర్ తుగ్గలి బయల్దేరాడు. మార్గమధ్యంలో కియా షోరూం వద్ద ఓ పెట్రోల్ బంకులో ఇంధనం నింపుకున్నారు. రోడ్డుపైకి వచ్చిన కొద్దిసేపటికే వారి బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. వేగంగా కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన ఎర్రిస్వామి, రోడ్డుపై ఎగిరిపడిన తన స్నేహితుడిని, రోడ్డు మధ్యలో ఉన్న బైక్ ను పక్కకి తీయాలని అనుకున్నాడు.

శివశంకర్‌ను రోడ్డు పక్కకు లాగేందుకు ఎర్రిస్వామి ప్రయత్నిస్తున్న సమయంలోనే, ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చింది. రోడ్డు మధ్యలో పడి ఉన్న వారి బైక్‌ను చాలాదూరం ఈడ్చుకెళ్లింది. దాంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు మంటల్లో చిక్కుకోవడం చూసిన ఎర్రిస్వామి భయపడి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లిపోయాడు. కాగా, ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైనట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత నిన్న ప్రకటించిన విషయం విదితమే. మొదట ఇది రోడ్డు ప్రమాదంగా భావించినా, ఎర్రిస్వామి వాంగ్మూలంతో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత వచ్చింది.

## మునిసిపాలిటీలకు భారీగా నిధుల విడుదల

హైదరాబాద్ తెలంగాణలోని పురపాలక సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 138 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ. 2,780 కోట్లను విడుదల చేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో మొత్తం 2,432 పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో, మంజూరైన పనులకు సంబంధించి తక్షణమే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, సమీప గ్రామాలను విలీనం చేసుకున్న పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టమైన సూచనలు చేశారు. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2027'లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర పట్టణాలను కూడా 'గ్రోత్ హబ్'లుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ నిధుల కేటాయింపు జరిగిందని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు మరింత ఊపందుకోనున్నాయి.

## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

ఈ ఘటన చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఒకరి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోవడాన్ని ఆయన గమనించారు. వెంటనే అప్రమత్తమైన డీసీపీ, తన గన్‌మెన్‌తో కలిసి వారిని పట్టుకునేందుకు వెంబడించారు. ఈ క్రమంలో దొంగల్లో ఒకరు డీసీపీపై కత్తితో దాడికి ప్రయత్నించాడు.ఈ క్రమంలో జరిగిన తోపులాటలో డీసీపీ కిందపడిపోయారు. అనంతరం ఇద్దరు దొంగలు పారిపోయేందుకు ప్రయత్నించగా డీసీపీ, గన్ మెన్ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దాంతో దొంగలు గాయపడి, పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. స్వల్పంగా గాయపడిన డీసీసీ సాయి చైతన్యకు మలక్ పేట ఆసుపత్రిలో చికిత్స అందించారు. పట్టుబడిన నిందితుడి నేర చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విధి నిర్వహణలో డీసీపీ సాయి చైతన్య చూపిన చొరవ, ధైర్యాన్ని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం

హైదరాబాద్ రాష్ట్ర కేబినెట్ సమావేశంపై మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన 'దండుపాళ్యం బ్యాచ్' వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ హరీశ్ రావుకు ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు తాము వస్తామని, చర్చకు మీరు వస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేటలో మీడియాతో మాట్లాడిన అడ్లూరి లక్ష్మణ్, హరీశ్ రావు వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయన్నారు. "ఒక ఉద్యమ నాయకుడు అయి ఉండి కేబినెట్‌ను అలా సంబోధించడం సిగ్గుచేటు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో హరీశ్ రావు మంత్రిగా పనిచేశారు, ఆ విషయం ఆయన మరవొద్దు. మా కేబినెట్ మీటింగ్ ప్రజల అవసరాల కోసమే అంతే తప్ప, దండుపాళ్యంలా దోచుకోవడానికి కాదు" అని ఆయన స్పష్టం చేశారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడటం దారుణమన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేతో, తన భజన మండలితో తనను తిట్టించడం ఎంతవరకు సమంజసమని హరీశ్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు కూడా కాకముందే ఇంతగా టార్గెట్ చేయడం సరికాదన్నారు. దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం లాంటి హామీలను బీఆర్ఎస్ నెరవేర్చిందా? అని నిలదీశారు. పదేళ్లలో ఒక్కరికైనా నియామక పత్రం ఇచ్చారా? అని అడిగారు. "ముఖ్యమంత్రిని, మంత్రులను ఏకవచనంతో మాట్లాడటం సరికాదు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూనే మేము సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారు" అని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను కేంద్రం ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు ఆస్తులు, ఫామ్ హౌస్‌ల కన్నా దళితుల ఆత్మగౌరవమే ముఖ్యమని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్, గ్రామస్థాయి ఎన్నికల్లో ప్రజలు ఎవరికి మద్దతిస్తారో చూద్దామని అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## హైదరాబాదులో రూ.4.9 కోట్ల బ్యాంకు ఫ్రాడ్ కేసు

**-ఏడుగురికి జైలు శిక్ష**

హైదరాబాద్ 20 ఏళ్ల తర్వాత తీర్పు సీబీఐ కోర్టులో విచారణ ఏడుగురు దోషులుగా నిర్ధారణ హైదరాబాద్‌లోని కార్పొరేషన్ బ్యాంకులో సుమారు రూ.4.9 కోట్ల మోసానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. బ్యాంకు మాజీ సీనియర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని సీబీఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే కార్పొరేషన్ బ్యాంక్ బంజారాహిల్స్ బ్రాంచ్‌లో అప్పటి సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన టి. చంద్రకాంత్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించారు. ఈ కేసులో రుణాలు పొందిన ప్రైవేటు వ్యక్తులైన వి.ఎన్.ఎస్.సి. బోస్, వి. రాజశ్రీ, కొండా శేఖర్ రెడ్డి, ఎన్.వి.పి. నంద కిశోర్, హెచ్. రాజశేఖర్ రెడ్డిలకు ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.55,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నకిలీ, కల్పిత పత్రాల ఆధారంగా రూ.4.9 కోట్ల విలువైన గృహ రుణాలను మంజూరు చేసి బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై సీబీఐ 2004 సెప్టెంబర్ 29న చంద్రకాంత్‌తో సహా 16 మందిపై కేసు నమోదు చేసింది. లోతైన విచారణ జరిపిన సీబీఐ, 2007 మార్చి 30న చంద్రకాంత్‌తో పాటు మరో 11 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిందితులందరూ కుమ్మక్కై, బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు పత్రాలతో రుణాలు పొంది బ్యాంకుకు నష్టం కలిగించారని విచారణలో తేలింది. రెండు దశాబ్దాలకు పైగా సాగిన సుదీర్ఘ విచారణ అనంతరం, హైదరాబాద్‌లోని సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి 2025 అక్టోబర్ 24న తీర్పు వెలువరించి ఏడుగురిని దోషులుగా తేల్చారు. ఇదిలా ఉండగా, ఘజియాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా అక్టోబర్ 18న మరో బ్యాంకు మోసం కేసులో తీర్పు ఇచ్చింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నోయిడా ఎస్ఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధించింది. 2007-09 మధ్యకాలంలో తన పదవిని దుర్వినియోగం చేసి బ్యాంకుకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 2010లో ఆయనపై కేసు నమోదైంది.

సత్యమేవ జయతే

ఆదివారం 26 అక్టోబర్ 2025

## కల్తీ కల్లు దుకాణం పై చర్యలు తీసుకోండి

## మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు

## కాసాల విట్టల్

సత్యమేవ జయతే/హత్నూర: మండలంలోని బోరుపట్ల గ్రామంలో అక్రమంగా ఏర్పాటుచేసిన కల్తీ కళ్ళు దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ జిల్లా సూపర్డెంట్ కు మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు విట్టల్ మాట్లాడుతూ గ్రామంలో ఒకే కళ్ళు దుకాణానికి పర్మిషన్ ఉండగా ఏటువంటి పర్మిషన్ లేకుండా కళ్ళు దుకాణం నడపడంతో పాటు కల్తీకల్లు తయారు చేసి అమ్ముతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇల్లీగల్ షాపుకు వత్తాసు పలుకుతున్న సీఐ సాగర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. గ్రామాలలో ఇల్లీగల్ షాపులను ప్రోత్సహిస్తూ అక్రమ వసూళ్లకు సీఐ తెరలేపారని ఆయన ఆరోపించారు. కల్తీ కల్లు వల్ల ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నాయని, బోరుపట్ల లో రోడ్డు పక్కన ఎటువంటి పర్మిషన్ లేకుండా ఏర్పాటు చేసిన కల్లు దుకాణం వల్ల ప్రజలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే ఇల్లీగల్ షాపును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

### శవాన్ని రోడ్డుపై పెట్టి మైకోడ్ గ్రామస్తుల ఆందోళన

### రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావిని పుడ్చాలని 10 గ్రామాల ప్రజలు

### మొరపెట్టుకున్న పట్టించుకోని అధికారులు

### అధికారుల నిర్లక్ష్యంతో దత్తు అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

### శవాన్ని రోడ్డుపై పెట్టి మైకోడ్ గ్రామస్తుల ఆందోళన

### బావిలో పడి మృతి చెందిన దత్తు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

### కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలి

### ప్రమాదకరంగా రోడ్డు పక్కన ఉన్న బావిని వెంటనే పుడ్చాలి

### రైతుకు ప్రభుత్వమే ఉచితంగా బోరు వెయ్యాలి





సత్య మేవ జయతే. మనూర్సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గం లోనిమనూరు మండలం మాయికోడ్ గ్రామానికి చెందిన గొల్ల దత్తు అని యువకుడు హైదరాబాద్ పనికి నిమిత్తం తెల్లవారుజామున వెళ్తుండగా మనూర్ శివారులోని రోడ్డు పక్కన ఉన్న బావిలో బైకు స్కిడ్ అయి పడి మృతి చెందినడు. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావిని కూర్చోవాలని ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోలేదని దత్తు శవాన్ని రోడ్డుపై పెట్టి ప్రజల పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.. మనూర్ మండల కేంద్రం కావడంతో మ2ట్కకోడ్, రాణాపూర్, తుమ్మూరు, మొగ్దుంపూర్, బోరంచ జిన్నారం, రాయిపల్లి దుదిగొండ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ప్రజలు ఈ రోడ్డు మార్గాన్ని ప్రయాణం చేయవలసి వస్తుంది. ప్రముఖ బోరంచ నల్లపోచమ్మ దేవస్థానం ఉండడంతో వేలాదిమంది భక్తులు ఈ రోడ్డు మార్గాన్ని ప్రయాణిస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని భావి ఉండడంతో భయం భయం తో అరిచేతులో ప్రాణాలు పెట్టుకుని ప్రజల ప్రయాణం చేస్తున్నారు వింత ప్రమాదకరమైన భావిని పూడ్చాలని అనేకమార్లు ప్రజలు అధికారులు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదు..

అధికారుల నిర్లక్ష్యంతోనే దత్తు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినాని సిపిఎం గ్రామ శాఖ భావిస్తుంది.

దత్తు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే బావిని పూడ్చాలని, రోడ్డు పనులు ప్రారంభించాలని, బావిని పూడ్చితే నష్టపోయే రైతును ప్రభుత్వమే ఉచితంగా బోరు వేసి మోటర్ బిగించాలని డిమాండ్ చేశారు..

గత 20 సంవత్సరాల క్రితం సిసి రోడ్ వేశారు ఇప్పటివరకు రోడ్డు వెయ్యలేదని, అధికారులు ఎన్నిసార్లు విన్నవించిన, చాలామందికి ప్రమాదాలు జరిగిన, పత్రికలలో కథనాలు రాసిన అధికారులు పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, దానివల్లనే ఒక ప్రాణం బలిగున్నదని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం మనూరు మండల శాఖ డిమాండ్ చేస్తుంది. రోడ్డు వేయడంలో ప్రభుత్వం అధికారులు కుమ్మక్కయ్యారని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బివిఆర్ఐటిని సందర్శించిన ప్రొఫెసర్ డాక్టర్ జి మాధవి లత











సత్యమేవ జయతే/నర్సాపూర్:నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి వి ఆర్ ఐ టి కళాశాలను శనివారం దేశంలోని ప్రఖ్యాతిగాంచిన సివిల్ ఇంజనీరింగ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరులో ప్రొఫెసర్ గా పని చేస్తున్న, జమ్మూ కాశ్మీర్ లోని చెనాబ్ రూపకర్త డాక్టర్ జి మాధవి లత సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కళాశాలలోని వివిధ ప్రయోగశాల లను, సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విష్ణు విద్యాసంస్థల చైర్మన్ విష్ణు రాజును ,వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ లను మర్యాదపూర్వకంగా కలిసి విద్యా పరిశోధన, సాంకేతిక అభివృద్ధి అంశాలపై చర్చించారు. కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులతో కలసి ఆధునిక నిర్మాణ సాంకే తికతలపై విశ్లేషణాత్మక చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, సివిల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ కృష్ణారావు, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్ కుమార్, మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి



సత్యమేవ జయతే/హత్నూర: రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కాసాల,హత్నూర, లింగాపూర్, పన్యాల, కొన్యాల తదితర గ్రామాల్లో మండలంలో తదితర ఐకేపీ, హత్నూర, కాసాల సొసైటీ ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యానికి కావాలసిన సంచులను రైతులకు అందించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. అలాగే తూకంలో ఎటువంటి పొరపాట్లు ఉండరాదని రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్వీన్ షేక్, ఏపీవో రాజశేఖర్, ఏవో శ్రీనివాసరావు, మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, పిఎసిఎస్ చైర్మన్లు దుర్గారెడ్డి, దామోదర్ రెడ్డి, డైరెక్టర్ రావులకోరి వెంకటేష్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రామచంద్రారెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పటేల్ శేఖర్ గౌడ్,అమ్రాది జగదీష్, అజ్మత్ అలీ అజ్జు కాసాల మాజీ సర్పంచ్ రాణి రామచంద్ర రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి వెంకటేశం గుప్తా, వైస్ చైర్మన్ మనోహర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కృష్ణ, అర్జున్, మాజీ యూత్ ప్రెసిడెంట్ మధు, గౌండ్ల రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిధిలా వస్తా భవన కూల్చివేత ను ఆకస్మిక తనిఖీ





### విద్యార్థులను ఎలుక కరిచిన విషయాన్ని

### స్పందించి బాలికల గిరిజన గురుకులాను

### సందర్శించిన న్యాయమూర్తి

### ఎం. హేమలత

### జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్

### సర్వీస్ కమిటీ నర్సాపూర్



సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్

మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యూనిట్ వన్ లో ఇటీవల శిథిలావస్థలో ఉన్నటువంటి గదులలో గదులు లేక చిన్నపిల్లలకు పాఠాల బోధన జరుగుతున్నటువంటి ఉదాంతం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ దృష్టికి రావడంతో, ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొన్నందున శిథిలావస్థలో ఉన్న ప్రమాదకర గదుల పాఠశాల ను ఇబ్బంది పడుతున్న విద్యార్థుల ఫిర్యాదుతో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల తరగతి గదులను నూతన మంజూరి కొరకు సంబంధింత అధికారుల చేత తొలగించుటకు ఆదేశించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైనందున నూతన భవనాన్ని ప్రారంభించి విద్యార్థులను ప్రమాదం నుండి కాపాడడం కోసం పనులు పరిశీలించుటకు తేదీ 25 అక్టోబర్ శనివారం రోజున మరోసారి పాఠశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగింది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ నర్సాపూర్ పక్షంలో విద్యార్థులకు ఆటంకం జరగకుండా ప్రమాదకర గదుల నుండి సురక్షిత గదులలో పాటలు బోధించాలని పనులు త్వరగా కొనసాగుటకు సమంత శాఖలతో మాట్లాడి సాంక్షన్ అయిన నూతన భవనాన్ని ప్రభుత్వ అనుమతులతో నిర్మాణం కొనసాగించాలని మండల విద్యాధికారి తారా సింగ్ కు ఆదేశించడం జరిగింది.

అనంతరం నారాయణపూర్ ప్రభుత్వ బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎలుక ఎలుక కర్చి ఇబ్బందులు పడుతున్నారని శీర్షిక పలు పత్రికల్లో ప్రచురణ అయినందున మండల్ ఈగల్ సర్వీస్ కమిటీ ద్వారా న్యాయమూర్తి స్పందించి గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి ఎలుక కరిచినందున వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని విద్యార్థులను పరామర్శిస్తూ విద్యార్థులకు మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగింది, అనంతరం గురుకులంలో విద్యార్థుల కోసం వండిన భోజనాలను ప్రత్యక్షంగా పరిశీలన చేసి, విద్యార్థులను వారికున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది, అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థులకు చట్టపరమైనటువంటి ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు తగు న్యాయ సహాయం కోసం మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయించవచ్చు అన్నారు.కార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూప రాణి, అధ్యాపకులు, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

### కోస్గి ఎంపీడీఓగా కుర్వ క్రాంతి..!

### %-% తాండూరు యువకుడికి పోస్టింగ్

### %-% మంత్రి సీతక్క చేతుల మీదుగా సర్టిఫికెట్..



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా :తాండూరు, : గ్రూప్ %-% 1లో ఉద్యోగం సాధించిన తాండూరు యువకుడు కుర్వ క్రాంతి ఎంపీడీఓగా పోస్టింగ్ ఖరారయ్యింది. నారాయణపేట జిల్లా కోస్గి మండల అభివృద్ధి అధికారిగా నియామకం అయ్యారు.తాండూరు ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది కె.గోపాల్, ఉపాధ్యాయురాలు బాలమణిల కుమారుడు కుర్వ క్రాంతి గ్రూప్-1 సత్తాచాటి ఎంపీడీఓగా ఉద్యోగం సాధించిన సంగతి తెలిసిందే. గత 15 రోజుల నుంచి రాజేంద్రనగర్ లోని తెలంగాణ ఇన్సిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, శాఖ డైరెక్టర్ సృజనల ద్వారా కుర్వ క్రాంతి సర్టిఫికెట్ ను పొందారు.

శిక్షణ పూర్తి చేసుకున్న కుర్వ క్రాంతికు నారాయణపేట జిల్లా కోస్గి మండల అభివృద్ధి అధికారిగా నియమించారు. సోమవారం మొదటి సారి కుర్వ క్రాంతి ఎం పీడీఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కె.గోపాల్, బాలమణిలు సంతోషం వ్యక్తం చేశారు. కష్టాలను దాటి.. సామాన్య కుటుంబం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పలువురు కుర్వ క్రాంతికు అభినందనలు తెలిపారు..

### వీర జవాన్ వెంకట్రాంరెడ్డికి కన్నీటి వీడ్కోలు

### సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

### వట్టిమినపల్లిలో శోకసంద్రం..

### "జై జవాన్" నినాదాలతో మార్మోగిన గ్రామం







సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 25 :లి దేశ సేవలో తన జీవితాన్ని అంకితం చేసిన వికారాబాద్ జిల్లా బిడ్డ, వీర జవాన్ వెంకట్రాంరెడ్డికి ఆయన స్వగ్రామం కన్నీటి వీడ్కోలు పలికింది. నవాబుపేట్ మండలం వట్టిమినపల్లి గ్రామానికి చెందిన మోముల వెంకట్రాంరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. శనివారం ఆయన పార్థివ దేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి, సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

శోకసంద్రంలో వట్టిమినపల్లి:

వెంకట్రాంరెడ్డి మరణ వార్త తెలియగానే వట్టిమినపల్లి గ్రామం శోకసంద్రంగా మారింది. ఉదయం మైతబ్ ఖాన్ గూడా నుండి వట్టిమినపల్లి వరకు ఆయన పార్థివ దేహాన్ని భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. ఈ అంతిమయాత్రలో వట్టిమినపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు, బంధుమిత్రులు, యువకులు, రాజకీయ నాయకులు వేలాదిగా తరలివచ్చారు. దారి పొడవునా ప్రజలు కన్నీటి కళ్లతో తమ ప్రియతమ జవాన్‌కు వీడ్కోలు పలికారు.

సైనిక గౌరవంతో వీడ్కోలు:

"జై జవాన్" అనే నినాదాలతో గ్రామం మార్మోగిపోయింది. సైనిక దళాల ప్రతినిధులు హాజరై, లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించారు. ప్రజల కన్నీటి పర్యంతంగా అంత్యక్రియలు పూర్తయ్యాయి.

కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు:

అనారోగ్యంతో మరణించిన వెంకట్రాంరెడ్డి కుటుంబ సభ్యుల రోదనలు అక్కడ ఉన్న వారందరి మనసులను ద్రవించాయి. గుండెలవిసేలా విలపిస్తున్న వారిని ఓదార్చడం ఎవరికీ సాధ్యపడలేదు. వీర జవాన్ అంత్యక్రియల సందర్భంగా చోటుచేసుకున్న ఈ హృదయ విదారక దృశ్యాలు అందరినీ కన్నీటి పర్యంతం చేశాయి.

నివాళులర్పించిన ప్రముఖులు:

చేవెళ్ల ఎమ్మెల్యే శ్రీ కోలే యాదయ్య అంత్యక్రియలకు హాజరై, వీర జవాన్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సేవలో అంకితభావంతో ఉన్న వెంకట్రాంరెడ్డిని కోల్పోవడం తీరని లోటని ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సైనిక దళాల ప్రతినిధులు హాజరై గౌరవ వందనం సమర్పించారు.

ఈ సందర్భంగా టీపీసీసీ రంగారెడ్డి జిల్లా ఈ.ఎస్.ఎం అధ్యక్షుడు పెండా రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఈ. యాదయ్య, టీ. అంజయ్యులు, బ్రహ్మానంద రెడ్డి, లింగమయ్య, హరి గోపాల్ (సి.ఆర్.పి.ఎఫ్) తదితరులు సైతం జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సాంత్వన తెలిపారు.

# ఈ నెల 30 లోపు రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను అందజేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా : వికారాబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లు అక్టోబర్ 30 లోపు బ్యాంకు గ్యారంటీలను అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు.

శనివారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో బ్యాంకు గ్యారంటీలు, అగ్రిమెంట్లు, ఖరీఫ్ కు సంబంధించిన సీఎంఆర్ తదితర అంశాలపై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు అందరూ 100 శాతం బ్యాంకు గ్యారంటీ లతో పాటు అగ్రిమెంట్లను అందజేయాలన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ ను నవంబర్ 12 లోపు పూర్తి చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో లక్ష 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యము వస్తుందని అంచనాలతో మిల్లర్లు సిద్ధంగా ఉండాలని అందుకు అనుగుణంగా ఏర్పాటు సమకూర్చుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్



జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలేశ్వర్ గుప్త, శ్రీధర్ రెడ్డి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ లు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

# రాత్రివేళ ఊళ్లపై వాలిన డ్రోన్లు..!

### -బేంబేలెత్తిన పల్లె జనాలు.

### - రహస్యమేంటో తేల్చని అధికారులు.

### - ఇంకా టెన్షన్ వీడని ప్రజలు..

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా :తాండూరు, : అవి మామూలు ఊళ్లు. అప్పుడే జనాలు భోజనాలు చేసి.. పనులు అన్ని ముగించుకుని కునుకు తీసేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అర్ధరాత్రికి ముందు ఆ ఊళ్లపై సుడిగాలిలా శబ్దాలు చేస్తూ వింత యంత్రాలు వాలిపోయాయి.

శబ్దాలు విన్న జనాలు బయటకు పరుగులు తీశారు. సెల్ ఫోన్లలో యంత్రాలను చిత్రీకరించారు. తీరా అవి డ్రోన్లుగా గుర్తించారు. ఈ సంఘటన పెద్దేముల్ మండలంలో తీవ్ర ఉత్కంఠతతో పాటు ఆందోళనకు గురిచేసింది. శుక్రవారం రాత్రి మండలంలోని నర్సాపూర్, ఆత్కూర్, రుద్రారం, ఇందూరు, పెద్దేముల్ తాండా గ్రామాల్లో రాత్రి వేళ డ్రోన్లు చక్కర్లు కొట్టాయి. గబ్బిలాల మాదిరిగా డ్రోన్లు వాలిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోయారు. బయటకు వచ్చి.. డ్రోన్లు ఎందుకు తిరుగుతున్నాయో అంటూ అయోమయానికి గురయ్యారు.



సెల్ ఫోన్లలో చీకట్లలో కనిపించని డ్రోన్లను చిత్రీకరించారు. వెంటనే పెద్దేముల్ పోలీసులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు డ్రోన్ల విహారంపై పెద్దేముల్ మండలంలో చర్చలు జరిగాయి. అర్ధరాత్రి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించినప్పటికి ఎలాంటి విషయాలు బహిర్గతం కాలేదు. డ్రోన్లు ఎందుకు తిరిగాయని రహస్యాలను కనిపెట్టలేకపోయారు. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి గాని, పరిశ్రమల నుంచి గాని ఎలాంటి సమాచారం అందలేదని చెప్పుకొచ్చారు. రక్షణ శాఖకు ఏమైనా సంబంధించినవా అనే దానిపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. కాని ఆయా గ్రామాల ప్రజలు మాత్రం డ్రోన్లు తిరగడం పట్ల భయాందోళనను వీడడం లేదు..

# వందేళ్ళ అవ్వకు కొడుకే సర్వస్వం..... దట్టమైన అభయారణ్యంలో తల్లి కొడుకుల ఒంటరి జీవితం!

సత్యమేవ జయతే మంచిర్యాల: చుట్టూ దట్టమైన అడవి... నిత్యం క్రూర మృగాల సంచారం... కనీసం సరైన దారి లేని ప్రాంతం అలాంటి ఆ ప్రాంతంలో ఏడు శతాబ్దాలుగా జీవనం సాగిస్తున్నది ఓ అవ్వ.ఉండేందుకు సరైన ఇళ్లు కూడా లేకపోయినా, ఆ పూరి గుడిసెలోనే కాలం వెళ్లదీస్తోంది. అలా అని ఆ అవ్వకు ఎవరు లేరనికాదు. ఐదుగురు కొడుకులు ఐదుగురు కూతుళ్లు. వాళ్లకు మరో 25 మంది వారసులు. ఆ వారసులకు మరో 30 మంది సంతానం.. జగమంత కుటుంబం ఉన్నా.. ఉన్న ఊరును భర్త కట్టించిన గూడును వదిలి వెళ్లలేక అడవే ప్రాణంగా బ్రతుకు సాగిస్తోంది. ఎన్ని కష్టాలున్నా కట్టె కాలే వరకు ఈ అడవే నా ఇళ్లు అంటోంది. సర్కార్ దయ తలచి కరెంట్, నీళ్ల కష్టాలు తీరిస్తే, అదే పది వేలు అంటోంది ఆ గిరిజన తల్లి. చిన్న కొడుకు సాయంతో కాలం వెళ్లదీస్తున్న అడవిలో అవ్వ కథ తెలుసుకోవాలంటే ఊరు పేరు తప్ప ఊరే లేని ఊరి స్టోరీ చదవాల్సిందే..!

ఊరంటే.. గుడి, బడి, పాడి పంటలు, పొలాలు, ఆత్మీయంగా పలకరించే ఇరుగుపొరుగు, చుట్టాలు, బంధువులు. కానీ అక్కడ అవేమి కనిపించవు.. అసలు చెప్పాలంటే అక్కడ ఊరే లేదు. సరిగ్గా 70 ఏళ్ల క్రితం 250 పైగా గడపలతో చుట్టు దట్టమైన అడవితో ఒక స్వచ్ఛమైన గూడెం ఇక్కడ ఉండేది. కాల గమనంలో ఆ ఊరు మాయమైంది. కానీ వందేళ్లు దాటిన ఓ అవ్వ మాత్రం ఆ ఉరే ప్రాణంగా.. ఆ అడవే పంచ ప్రాణంగా జీవనం సాగిస్తుంది. ఆమె కుర్సింగ రాంబాయి. వయసు అక్షరాల నూట ఒక్కటి. సెంచరీ దాటి ఠీవిగా నూటొక్క ఏళ్లతో పచ్చని అడవిలో జీవనం సాగిస్తోంది. ఒంటరిగా ఉంటుందా అంటే కాదు.. కొడుకు కుర్సింగ అనంతితో కలిసి పూరింట్లో జీవనం సాగిస్తోంది. కొడుకు అనంతి వయసు 56 ఏళ్లు.అసలు రాంబాయి ఉండే ఊరు ఎక్కడా అనే కదా..! అక్కడికే వస్తున్నా.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం బలరావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మారు మూల గ్రామం జువ్విగూడ. కానీ ఇప్పుడు ఆ ఊరు పేరు తప్ప అక్కడ ఊరు లేదు. స్వాతంత్ర్యానికి ముందు ఇక్కడ 250కి పైగా కుటుంబాలతో ఈ పల్లె కళకళలాడింది. కాల గమనంలో ఈ గ్రామంలోని జనమంతా వలస వెళ్లిపోయింది. కానీ కుర్సింగ రాంబాయి ఆమె కుమారుడు అనంతుతో కలిసి ఇక్కడే ఉండి పోయింది. జువ్విగూడ గ్రామంలో మిగిలి ఉన్న ఏకైక నివాసం కూడా వీరిదే.

1950 లో కుర్సింగ దాము కొడుకు ఇస్రు తో రాంబాయి వివాహం జరిగింది. ఇస్రు %-% రాంబాయిలకు ఐదుగురు మగ పిల్లలు, ఐదుగురు ఆడపిల్లలు జన్మించారు. రాంబాయి పెళ్లైన ఆరేళ్లకు అత్తమామలు చనిపోయారు. భర్త ఇస్రు పిల్లలతో కలిసి అటవీ ఉత్పత్తుల విక్రయంతో పాటు వ్యవసాయం చేస్తూ ఇక్కడే జీవితాన్ని




కొనసాగించింది రాంబాయి. కాలగమనంలో సరైన వసతులు లేవంటూ రాంబాయి ముగ్గురు కుమారులు వలస వెళ్లిపోయారు. ఐదుగురు కూతుర్లలలో ముగ్గురు చనిపోగా మిగిలిన ఇద్దరు పెళ్లిలు కావడంతో వారు ఇటు వైపే రావడం మానేశారు. వృద్ధాప్యం కారణంగా రాంబాయి భర్త ఇస్రు 20 ఏళ్ల కిందటే మరణించారు. చివరకు అందరూ దూరమైనా చిన్న కొడుకు అనంతు మాత్రం తల్లి రాంబాయి కోసం ఇక్కడే ఆగిపోయాడు.

కొడుకు కుర్సింగ అనంతుకు ముప్పై ఏళ్ల క్రితమే వివాహం అవగా.. భార్య పెళ్లైన కొన్ని ఏళ్లకు అనారోగ్యంతో చనిపోయింది. అనంతుకు ఇద్దరు సంతానం కాగా వివాహం చేసుకుని వలస వెళ్లిపోయారు. భార్య చనిపోవడం పిల్లలు దూరమవడంతో కుంగిపోయిన అనంతు.. తల్లి రాంబాయి తో కలిసి ఉన్న ఊరిలోనే ఉండిపోయాడు.

జువ్విగూడ ఇప్పుడు ఒకే ఒక్క ఇళ్లుతో కనిపిస్తుండగా.. ఆ ఊరికి చేరేందుకు సరైన దారి కూడా లేదు. చుట్టు కవ్వాల్ అభయారణ్యం ఉండగా నిత్యం ఈ ప్రాంతంలో క్రూరమృగాల సంచారం కొనసాగుతోంది. రాంబాయి ఉంటున్న ఇంటికి నీటి సౌకర్యంకూడా లేదు. కనీసం కరెంటు సౌకర్యం కూడా లేదు. అయినా ఈ ఊరిలోనే ఎందుకు ఉంటున్నారని ప్రశ్నిస్తే మాత్రం కంటి నిండా దుఃఖంతో ఉన్న ఊరును ఎలా వదిలి పెడ్తాం అంటూ గోండి బాషలో సమాదానం ఇచ్చింది 101 ఏళ్ల రాంబాయి. 'కన్నతల్లి లాంటి ఈ ఊరు మీద ఉన్న మమకారంతోనే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇక్కడే నివాసం ఉంటున్నాం' అని తెలిపాడు రాంబాయి కొడుకు అనంతు. అయిన వారు ఉన్నా ఎవరు పట్టించుకోరని.. కనీసం మా ఇంటి వైపు కన్నెత్తి చూడరని.. చిన్న తనంలో ఈ గూడెం నిండుగా కలకలాడేదని.. ఇప్పుడిలా ఒంటరి పక్షిలా మారిందంటాడు అనంతు. మా ఇద్దరిని సర్కార్ వాళ్లు కనీసం మనుషులుగా కూడా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూరిగుడిసెలో కాలం వెళ్లదీస్తున్న తమ ఇంటికి కనీసం కరెంట్ సరఫరా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అయితే ఈ అడవిలో ఉండబట్టే ఆరోగ్యంగా ఉన్నానని.. వందేళ్లు దాటినా ఇంకా తన పని తానే చేసుకుంటున్నానంటూ చెప్పుకొచ్చింది. పోయేలోగా నా వాళ్లను అందరిని ఒక్కసారి చూడాలని.. ఈ ఇంటికి కరెంట్ వస్తే అదే పది వేళని.. నేను పోతే నాకొడుకు అనంతు ఒంటరి వాడవుతాడేమో అన్న ఆవేదన తప్ప మరే భయం లేదంటోంది నిండు నూరేళ్ల రాంబాయి. తల్లి కోసం కొడుకు.. కొడుకు కోసం తల్లి.. ఉన్న ఊరిని కన్న తల్లిని విడవని ఈ ఇద్దరి జీవనం ఈ ఆధునిక సమాజానికి ఒక మంచి పాఠం. చల్లంగా ఉండు అనంతు.. అడవి నీడలో అవ్వ సాక్షిగా..!

## ఎర్రగడ్డలో ఇంటింటి ప్రచారం చేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి





జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా ఎర్రగడ డివిజన్ లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి గారితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గారి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గుర్తించాలని కోరిన, నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు స్థానిక నాయకులు నారాయణఖేడ్ నాయకులు బూత్ ఇన్చార్జీలు తదితరులు.బాణపూర్ సర్పంచ్ చెన్ బసప్ప. వారితో సీనియర్ నాయకులు పాలొగొన్నారు

## కరూర్ తొక్కిసలాట- బాధిత కుటుంబాలను కలవనున్న విజయ్



: కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలను టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కలవనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సోమవారం (అక్టోబర్ 27) చెన్నై సమీపంలోని రిసార్టులో వారిని పరామర్శించనున్నారు. అందుకోసం టీవీకే పార్టీ రిసార్టులో 50 గదులను బుక్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విజయ్ ఒక్కో బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా కలిసి సంతాపం తెలియజేస్తారని తెలుస్తోంది. వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించేందుకు ప్రభుత్వం అనుమతించకపోవడంతో ఈ ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా తాము విజయ్‌ను కలవడానికి వెళుతున్నామని, అందుకు బస్ కూడా బుక్ చేశారని బాధిత కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి తెలిపారు.టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తొక్కిసలాట దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది.కాగా ఈ ఘటనపై తమిళనాడు అసెంబ్లీలో కూడా చర్చ జరిగింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీవీకే పార్టీతో పాటు విజయ్‌ను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ర్యాలీకి విజయ్ ఆలస్యంగా రావడమే తొక్కిసలాటకు ప్రధాన కారణమని అన్నారు. కరూర్ తొక్కిసలాట ఘటన తమిళనాడు మొత్తాన్ని కలచివేసిందన్నారు. టీవీకే షెడ్యూల్ తప్పిదాలే ఘటనకు కారణమన్నారు. ర్యాలీకి విజయ్ మధ్యాహ్నం వస్తారంటూ పార్టీ పేర్కొనగా, ఆయన ఏడు గంటల తర్వాత వచ్చారని వెల్లడించారు. అప్పటికే పెద్ద ఎత్తున జనం గుమిగూడారన్నారు. ప్రచార వాహనం జనంలోకి వెళ్తుండగా గందరగోళం నెలకొనడంతో తొక్కిసలాట జరిగిందన్నారు. దీనితో చాలా మంది ఊపిరాడక మరణించారన్నారు. ఈ క్రమంలో కొందరు జనరేటర్ ఉన్న గదిలోకి ప్రవేశించి దాన్ని నిలిపివేశారన్నారు. తాగునీటితో సహా ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో టీవీకే విఫలమైందని విమర్శించారు.మరోవైపు ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్ ఇదివరకే ఆదేశాలిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ టీవీకే వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు పోలీసులు మాత్రమే ఉన్న సిట్‌పై నమ్మకంలేదని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడంతో పాటు పర్యవేక్షణకు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేయాలని టీవీకే కోరింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు బాధ్యతను సీబీఐకి మారుస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ దర్యాప్తును పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించింది.

కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణకు సుప్రీం ఆదేశం

# ఎల్లకొండ పార్వతి పరమేశ్వరుడిని దర్శించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య, కలెక్టర్ ప్రతీక్ జైన్







### చారిత్రక జైన విగ్రహాల పరిశీలన - అధికారులతో చర్చ

సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 25 : మండలం పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో వెలసిన చారిత్రక శ్రీ పార్వతి పరమేశ్వర స్వామి దేవస్థానాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య , వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్ శనివారం నాడు దర్శించారు.

ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం, ఇద్దరూ ప్రత్యేక పూజలు నిర్వహించి, శివపార్వతుల ఆశీస్సులు పొందారు. తరువాత గ్రామంలోని జైన్ మతానికి చెందిన పురాతన విగ్రహాలను పరిశీలించి, వాటి చారిత్రక ప్రాధాన్యం, సంరక్షణ చర్యలపై అధికారులతో సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ బుచ్చయ్య, ఆలయ చైర్మన్ పటోళ్ళ భరత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు మరియు భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ పర్యటనతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తులు వారిని ఆత్మీయంగా ఆహ్వానించి, ఆలయ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను తెలియజేశారు

# రాష్ట్రపతి వెళ్లే మార్గంలో బైక్ స్టంట్- ఆకతాయిలకు పోలీస్ స్టైల్‌లో ట్రీట్‌మెంట్!

: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెళ్లే మార్గంలో బైక్‌తో స్టంట్స్ చేసిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకున్నారు కేరళ పోలీసులు. ఆ తరువాత ఆ ఘటనకు సంబంధించిన వీడియోను తమ సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ఈ వీడియో ఇప్పుడు ఫుల్ వైరల్ అవుతోంది.

ఇంతకీ ఏం జరిగిందంటే?

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవలే కేరళ పర్యటనకు వెళ్లారు. ఆమె పాల ప్రాంతంలోని ఓ మార్గంలో ప్రయాణించాల్సి ఉండడంతో అధికారులు ఆ రూట్‌లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అయితే ముగ్గురు ఆకతాయి యువకులు నిబంధనలు ఉల్లంఘించి మరీ ఆ జోన్‌లోకి ప్రవేశించారు. అక్కడే విధుల్లో ఉన్న ఓ పోలీస్ అధికారి వారిని అపేందుకు ప్రయత్నం చేశారు. కానీ వారు బైక్‌ను ఆపకుండా అక్కడి నుంచి జారుకున్నారు. కానీ వేరొక ప్రాంతంలో ఆ యువకులను గుర్తించిన పోలీసులు, ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారు నడిపిన బైక్‌ను సీజ్ చేశారు.ఆకతాయిలకు తగిన బుద్ధి చెప్పారు!

రోడ్డు భద్రత, వీఐపీ ప్రొటోకాల్‌పై అవగాహన



కల్పించేందుకు కేరళ పోలీసులు ఈ ఘటనను ఉపయోగించుకున్నారు. యువకులు బైక్ స్టంట్స్ చేయడం దగ్గర నుంచి వారిని తాము అదుపులోకి తీసుకున్నంత వరకు జరిగినదంతా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ విధంగా వీఐపీ ప్రోటోకాల్స్‌ను, రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. అయితే ఈ మధ్య రోడ్లపై ఇలాంటి ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పోలీసులు తీసుకున్న చర్యపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిలకు తగిన బుద్ధి చెప్పారంటూ అభినందిస్తున్నారు.

# సరిహద్దుల్లో భారత ఆర్మీ యుద్ధ విన్యాసాలు- నోటమ్ జారీ చేసిన పాకిస్థాన్

సరిహద్దుల్లో భారత సైనిక విన్యాసాలకు పాకిస్థాన్ వణుకుతోంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లాలో థార్ శక్తి పేరిట భారత ఆర్మీ ముమ్మరంగా యుద్ధ విన్యాసాలు చేపట్టింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. థార్ ఎడారిలో యుద్ధ సన్నద్ధతను భారత సైన్యం ప్రదర్శించింది. ఎడారి భూభాగంలో అధునాతన పోరాట నైపుణ్యాలను, సమగ్ర యుద్ధ సామర్థ్యాలను వందలాది భారత సైనికులు ప్రదర్శించారు. ఈ డ్రిల్‌లో రోబోటిక్ మ్యూల్స్, డ్రోన్‌లు, రోబోట్ డాగ్‌లు, అటోర్ %చీ%1200 వాహనాలు, ట్యాంకులు, హెలికాప్టర్‌లు వంటి ఆధునిక యుద్ధ పరికరాలు పాల్గొన్నాయి. భవిష్యత్తు యుద్ధాల్లో సాంకేతికతదే పెద్దపీట కావడంతో అధునిక టెక్నాలజీకి భారత సైన్యం పెద్దపీట వేస్తోంది.

మరోవైపు అక్టోబరు 30 నుంచి నవంబరు 10 వరకు పాక్ సరిహద్దులోని సర్‌క్రీక్ ప్రాంతంలో భారత త్రివిధ దళాలు పెద్ద ఎత్తున విన్యాసాలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. త్రిశూల్ పేరిట ఈ విన్యాసాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ అప్రమత్తమైంది. తమ గగనతలంలో ఆంక్షలు విధిస్తూ విమానయాన సంస్థలకు నోటమ్ జారీ చేసింది. 28వేల అడుగుల ఎత్తు వరకు భారత త్రివిధ దళాలు విన్యాసాలు చేసేందుకు గగనతలాన్ని రిజర్వ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత త్రివిధ దళాలు కలిసి ఉమ్మడిగా ఇంత పెద్ద కసరత్తు నిర్వహించడం గమనార్హం. ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాలు, స్వావలంబనను ప్రదర్శించడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది.



సర్‌క్రీక్ ప్రాంతంలో పాకిస్థాన్ వక్రబుద్ధి చూపిస్తే దాని ఫలితం తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. సర్‌క్రీక్ అనేది గుజరాత్ తీరం వెంబడి ఉన్న సున్నితమైన వ్యూహాత్మక ప్రాంతం. ఇది రెండు దేశాల మధ్య వివాదాస్పదమైన ప్రాంతం కూడా. ఈ ప్రాంతంలో పాక్ తన సైనిక మౌలిక సదుపాయాలను ముమ్మరం చేసిందనే నిఘా నివేదికలు వెలువడిన తర్వాత రాజ్‌నాథ్ నుంచి హెచ్చరికలు వచ్చాయి. పాక్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో భారత్ భారీ విన్యాసాలు చేయాలనుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అంతకుముందు అక్టోబర్ 14న భారత సైన్యానికి చెందిన నార్తన్ కమాండ్ విభాగం విద్యుత్ విధ్వంస్ పేరుతో యుద్ధ విన్యాసాలు చేపట్టింది. ఇందులో భాగంగా భారత నెట్‌వర్క్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సాగిన యుద్ధ విన్యాసాలను లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ పర్యవేక్షించారు. నెట్‌వర్క్–కేంద్రీకృత కార్యాచరణ సామర్థ్యాలను ప్రదర్శించే అత్యాధునిక సామర్థ్యాలను ఈ విన్యాసాలలో సైన్యం చేపట్టింది. భవిష్యత్తులో యుద్ధాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని సైనిక అధికారులు తెలిపారు. కేవలం ఆయుధాలతో కాకుండా సైబర్ వార్, సాంకేతికత, మానవరహిత వైమానిక వాహనాలు, ఉపగ్రహ ఆధారిత నిఘా, ఆర్థికవ్యవస్థ, దౌత్యం వంటి పలు అంశాలను ఆయుధాలుగా ఉపయోగిస్తారని చెప్పారు. అందువల్లే భారత సైన్యం బహుళ–డొమైన్ కార్యకలాపాలపై దృష్టిసారించిందని, అంతరిక్షం, సైబర్ వంటి వాటిని ఆధారంగా చేసుకొని ఆధునిక యుద్ధాలను ఎదుర్కొనేందుకు మన సైన్యం సంసిద్ధమవుతోందని వివరించారు.

సత్యమేవ జయతే



# దుక్కులు దున్నడం అవసరమా?
# దీనివల్ల పంట పొలాలకు కలిగే లాభమేంటి?

**వరుసగా వానకాలం, యాసంగి రెండు పంటలు సాగుచేసిన తర్వాత భూమిలో సారం తగ్గుతుంది. ఆ తర్వాత మరో పంట సాగుచేస్తే దిగుబడి తక్కువగా వస్తుంది. దీని నివారణకు రైతులు వానకాలం పంట వేసే ముందు వేసవిలో దుక్కులు దున్నుకుంటే బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. : వరుసగా వానకాలం, యాసంగి రెండు పంటలు సాగుచేసిన తర్వాత భూమిలో సారం తగ్గుతుంది. ఆ తర్వాత మరో పంట సాగుచేస్తే దిగుబడి తక్కువగా వస్తుంది. దీని నివారణకు రైతులు వానకాలం పంట వేసే ముందు వేసవిలో దుక్కులు దున్నుకుంటే బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం చాలామంది రైతులు ట్రాక్టర్లు, ఎడ్లతో తమ పొలాలను దుక్కులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుత ఎండల తీవ్రతకు భూమి బాగా కాగుతున్నది. దీంతో లోపలి క్రిములు నశించిపోతాయి. పంటలు వేసినప్పుడు క్రిమి కీటకాలు బెడద ఉండదు. మందుల పిచికారీ చేయాల్సి ఉంటుంది. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలిస్తే కలుపు మొక్కలు బాగా పెరుగుతాయి.**





అవి భూమిలో నీటిని, పోషక పదార్థాలు గ్రహిస్తాయి. దీంతో భూమి లోపలి పొరల నుంచి నీరు ఆవిరై పోతుంది. తద్వారా భూసారం తగ్గుతుంది. దీంతో ఆ తర్వాత పంటలకు అవసరమైన పోషకాలు లభించక ఆశించిన దిగుబడులు రావు. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, మేలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకొని భూమిని 25–30 సెంటీమీటర్ల లోతులో దుక్కిని చేసుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

**దున్నకపోతే నష్టాలే..**

యాసంగి పంటల కోతల తర్వాత చాలామంది రైతులు భూమిని అలాగే వదిలేస్తారు. దీంతో ఖాళీ భూముల్లో కలుపు మొక్కలు, ఇతర గడ్డిజాతి మొక్కలు పెరుగుతాయి. ఇవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేసి, భూసారాన్ని తగ్గిస్తాయి. భూమిలోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది.

వేసవి దుక్కులు లేకుంటే తొలకరి వాననీరు భూమిలోకి ఇంకకుండా పోతుంది. వర్షాలతో భూమి కోతకు గురవుతుంది. ఖాళీ భూముల్లో చీడపురుగులు భారీగా వృద్ధి చెందుతాయి. ఫలితంగా రాబోయే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

**అనేక లాభాలు**

వేసవిలోనే భూమిని లోతుగా దున్నడంతో వర్షాకాలంలో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా చేస్తుంది. భూమిని లోతుగా దున్నడంతో భూమిపై పొరలు కిందికి, కిందికి ఉన్న పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. భూమిలో తేమశాతం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది.

పురుగులు, తెగుళ్ల, కలుపు నివారణ చేసుకోవచ్చు. దుక్కులు దున్నేముందు పొలంలో గొర్రెలు, మేకలు, పశువుల మందలు తోలడం చేయించాలి.

పొలంలో వాటి విసర్జన పదార్థాలు భూమిలో ఇంకి భూసార వృద్ధికి దోహదపడతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంటపోగు, కంపోస్టు ఎరువులు, చెరువులోని పూడిక మట్టిని వేయడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

పంటలు చేతికి వచ్చే ముందు ఎండు ఆకులు, చెత్త చెదారాన్ని కాల్చివేయకుండా వాటిని పొలంలోనే ఉంచి లోతుగా దుక్కులు చేయడంతో నేల పొరల్లో కలిసిపోయి ఎరువుగా మారుతుంది. తద్వారా భూసారం పెరిగి పంట కు కావాల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి.

వేసవిలో లోతుగా దున్నడంతో భూమిలో ఉన్న చీడపురుగుల గుడ్లు, లార్వాలను పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తుంటాయి. భూమిలో ఉండే శిలీంధ్ర బీజాలు మట్టిపైకి రావడంతో అధిక ఉష్ణోగ్రతతో వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోయి పంటలకు తెగుళ్లు సోకుకండా దోహదపడుతుంది. పంట లు లేని సమయంలో కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీరు, పోషక పదార్థాలను గ్రహిస్తాయి.

కలుపు మొక్కలు పంటల దిగుబడిని తగ్గిస్తుంటాయి. లోతుగా దున్నడంతో కలుపు మొక్కలు నేలపైకి వచ్చి అధిక ఉష్ణోగ్రతలతో నశిస్తాయి. ఫలితంగా తదుపరి పంటల సాగులో కలుపు మొక్కల తాకిడి బెడద తక్కువగా ఉంటుంది.

**వేసవి దుక్కులతో రైతులకు మేలు**

వానకాలం, యాసంగి సీజన్‌లలో పంటలు కోసిన తర్వాత తప్పనిసరిగా పొలాన్ని దున్నాలి. వేసవిలో పొలాన్ని దున్నడంతో పంటల దిగుబడికి ఎంతో ఉపయోగపడుతుంది. పంటలకు నాశనం చేసే పురుగులు నాశనమవుతాయి. దుక్కులు చేసే ముందు పశువుల పెంటపోగు, సేంద్రియ ఎరువులను వేస్తే పొలానికి మరింత బలం వస్తుంది. ఫలితంగా పంటల అధిక దిగుబడికి దోహదపడుతుంది. రైతులు తప్పనిసరిగా వేసవి దుక్కులు చేపట్టాలి.

# అప్పుడు అడ్డకూలీలుగా వెళ్లారు.. ఇప్పుడు ఆకుకూరలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు



**పల్లెల్లో బతుకు బరువు. ఉపాధి కరువు. మనసు చంపుకొని, బంధాలను తెంచుకొని నగరాలబాట పడతారు. అక్కడ, చేతినిండా పనున్నా గుండెనిండా వెలితే. సాయంత్రానికి కూలీ డబ్బులొస్తాయి. అయినా, ఎక్కడో అసంతృప్తి. రేపటి గురించి ఆలోచించాల్సిన భయం లేకుండా.. ఉన్న ఊళ్లోనే ఏదైనా పని దొరికితే.. బతుకు పండుగే కదా! అనిపిస్తుంది. పల్లెల్లో బతుకు బరువు. ఉపాధి కరువు. మనసు చంపుకొని, బంధాలను తెంచుకొని నగరాలబాట పడతారు. అక్కడ, చేతినిండా పనున్నా గుండెనిండా వెలితే. సాయంత్రానికి కూలీ డబ్బులొస్తాయి. అయినా, ఎక్కడో అసంతృప్తి. రేపటి గురించి ఆలోచించాల్సిన భయం లేకుండా.. ఉన్న ఊళ్లోనే ఏదైనా పని దొరికితే.. బతుకు పండుగే కదా! అనిపిస్తుంది. అనిపించడం ఏమిటి.. నిజం చేశారు రాఘవాపురం గ్రామస్థులు.ఆ ఊళ్లో విటమిన్లు తారసపడతాయి. ప్రొటీన్లు పలకరిస్తాయి.**

మెగ్నీషియం ముచ్చట్లు పెడుతుంది. అంటే, వీటన్నిటికీ మూలమైన ఆకుకూరలు పుష్కలంగా పండుతాయి. తోటకూర, పుంటికూర, పాలకూర, బచ్చలికూర, మెంతికూర, చుక్కకూర, పుదీన, కొత్తిమీర, గంగ వాయిలికూర.. ఇలా ప్రతి పెరట్లో పచ్చదనమే. ప్రతి జేబులో పచ్చ'ధనమే'! ఈ ఆకుకూరల విప్లవం వెనుక ఓ కథ ఉంది. ఒకప్పుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతానగర్ మండలంలోని రాఘవాపురం కూడా అన్ని పల్లెల లాంటిదే. కష్టాలూ కరువులూ ఉక్కిరిబిక్కిరి చేసేవి. వలసలకు వెళ్లాల్సి వచ్చిన ప్రతిసారీ కడుపులు సలసలా మండేవి. కానీ, పొలిమేర దాటాల్సిన అనివార్య పరిస్థితులు. ఇలాంటి స్థితిలో రాఘవాపురం ప్రజలు ఎక్కడికో వెళ్లి అడ్డాకూలీగా మారడం కంటే.. ఉన్న ఊళ్లోనే కూలిపనులు చేసుకుంటే చాలనీ, అదే పదివేలనీ అనుకున్నారు. ఆకుకూరల సాగులో తమ సమస్యకు పరిష్కారం వెతుక్కున్నారు. ఐదొందల గడపలున్న గ్రామంలో దాదాపు రెండొందల కుటుంబాలు పెరటి కూరల పెంపకాన్నే ఎంచుకున్నాయి. పోటీపడి పండిస్తూ.. మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఆకుకూరల పెంపకంలో మేటిగా నిలుస్తున్నారు. మిగిలినవాళ్లు కూడా ఆ పెరళ్లలోనే కూలిపనులు చేసుకుంటారు. జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో ఆకుకూరలు పండిస్తున్న గ్రామం ఇదే. ప్రతి పెరటికి ఓ సాగునీటి మోటారు ఉండి తీరుతుంది.

**అందమైన లోగిళ్లు**

తాతల కాలంనాటి జీవనాధారాన్ని రాఘవాపురం ప్రజలు ఇప్పటికీ వదిలిపెట్టలేదు. పెద్దల బాటలో ఆకుకూరల సాగునే అక్కున చేర్చుకున్నారు. ప్రతి ఇల్లూ ఓ పచ్చని లోగిలే. కట్టలు కడుతూనో, కలుపులు తీస్తూనో.. ఇంటిల్లిపాదీ దర్శనమిస్తారు. విక్రయాల బాధ్యత మాత్రం పురుషులదే. ఆలస్యమైతే పచ్చికూర వాడిపోతుంది. కాబట్టే, తెల్లవారుజామున నాలుగు గంటలకే ద్విచక్ర వాహనం మీద సరుకు వేసుకుని చుట్టుపక్కలున్న కొత్తగూడెం, చంద్రుగొండ, జూలూరుపాడు, ఇల్లందు, సత్తుపల్లి, అన్నపురెడ్డిపల్లి, రేగళ్ల, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, రుద్రంపూర్, పాల్వంచ, పెద్దమ్మగుడి, జగన్నాథపురం.. తదితర గ్రామాలకు వెళ్తారు. రోజూ వెయ్యి రూపాయల వ్యాపారమైనా జరగాల్సిందే. పెద్ద రైతుల రాబడి ఇంకొంత ఎక్కువే.

**పచ్చని బ్రాండ్**

'ఈ వ్యాపారం తాతల నాటిది. ప్రతి ఇంట్లో ఆకుకూరల సాగు జరుగుతుంది. మైళ్లకు మైళ్లు ప్రయాణించి పొలాలకు వెళ్లాల్సిన పన్లేదు. నడినెత్తిన ఎండ సమస్య లేదు. అతివృష్టి, అనావృష్టి ఇబ్బందుల్లేవు. దళారీ వ్యవస్థ లేదు. గిట్టుబాటు ధర లభిస్తుందో లేదో అన్న భయమూ అవసరం లేదు. నీడపట్టు సేద్యం. కూలితో పోలిస్తే ఎక్కువ ఆదాయమే వస్తుంది. దీనివల్ల వలసల బాధ తప్పింది. ఇంకెవరికిందో పనిచేయాల్సిన తలనొప్పి కూడా లేదు' అంటారు ఇమ్మడి రామారావు అనే రైతు. రాఘవాపురానికి ఆకుకూరలు ఓ బ్రాండ్ వ్యాల్యూ తీసుకొచ్చాయి. కష్టమర్లలో విశ్వసనీయత కూడా పెరిగింది. దీంతో రోజూ రాఘవాపురం రైతుల దగ్గరే కొనడానికి ఇష్టపడతారు. ఇంట్లో పనిచేసేవాళ్లు పెరిగేకొద్దీ లాభాలు పెరుగుతాయి. దీంతో ఆ ఊళ్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కూడా బలంగా ఉంది. ప్రతీ ఇంట్లో భార్యాభర్తలు, కొడుకులు కోడళ్లు కలిసి ఉంటారు, కలిసి తింటారు, కలిసే పనిచేస్తారు. దీంతో బంధాలూ బలంగా ఉంటున్నాయి. పొద్దున్నే మనం కొత్తగూడెం కూరగాయల మార్కెట్‌కు వెళ్తే.. రాఘవాపురం రైతులే ఎక్కువగా ఉంటారు. ఊరిపేరు అడిగితే మీసం మెలేస్తూ చెబుతారు. పుట్టినగడ్డ మీద ప్రేమ అది. ఆకుకూరల సాగులో తమకు సాటిలేదన్న ఆత్మవిశ్వాసం అది.

ఏడాదికి ఒక పంట, రెండు పంటలు అనే పరిమితి కూడా లేదు. తీసేకొద్దీ పంటే. వేసేకొద్దీ డబ్బే. పెద్దగా పెట్టుబడీ అవసరం లేదు. దీంతో సంసారం హాయిగా సాగిపోతుంది. ఆకుకూరల సేద్యానికి ఇంకో వెసులుబాటు ఉంది. చీడపీడల ఇబ్బంది తక్కువ. నిత్యావసరం కాబట్టి, జనం కొనితీరతారు.

# బుగ్గ సేంద్రియ పాలు.!



చీనీ చెట్లకు వచ్చే వ్యాధుల నివారణకు పురుగు మందులతో అలసిపోయి పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించడానికి ఒక దేశీ ఆవుతో మొదల్కె గేదెలతో సహా రోజుకు 200 లీటర్ల పాలను ఉత్పత్తి చేసి సేంద్రీయ పరంగా విక్రయిస్తున్న బుగ్గ సుబ్బారెడ్డి. ఇతని పూర్తి పేరు సంసాని సుబ్బారెడ్డి. ఊరు కడప మండలం వెంకట గారి పల్లి. కడపలో బీటెక్ పూర్తి చేసి వ్యవసాయము మీద ఆసక్తితో తన దగ్గర ఉన్న 20 ఎకరాలలో చీనీ తోటను ప్రారంభించాడు.సుబ్బారెడ్డిది వ్యవసాయ నేపథ్యం, ఉన్నత చదువులు చదివిన తరువాత ఎలాంటి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా వ్యవసాయం మీద ఉన్న మక్కువతో వ్యవసాయరంగంలోనే స్థిరపడ్డాడు. 20 ఎకరాలలో బత్తాయి సాగు ఉంది. 2005వ సంవత్సరములో బత్తాయి మొక్కలు నాటి 2010 వరకు రసాయనాలు కూడా ఉపయోగించి 2010 నుంచి రసాయనాలను పూర్తిగా మానివేసి సేంద్రియ పద్ధతులు మొదలుపెట్టాడు.సేంద్రియ సాగు చేయాలంటే పాడి పశువులు తప్పనిసరి అని గ్రహించి 2015వ సంవత్సరం నుండి పాడి పశువులను కొనుగోలు చేస్తూ వస్తున్నాడు. ప్రస్తుతానికి 50 గేదెలు, 10 నాటు ఆవులు ఉన్నాయి. వీటి మేత కొరకు 10 ఎకరాలలో సూపర్ నేపియర్, 4 ఎకరాలలో కో–4 గ్రాసాన్ని పెంచుతున్నాడు. పశువులకు మేత కోసం సూపర్ నేపియర్, కో–4 గ్రాసంతోపాటు వేరుశనగ చెక్క, వరిగడ్డి, అలసంద పొట్టు, శనగచెత్త, అలసంద మొక్కలు, తవుడు అందిస్తున్నాడు. పశువులకు ఆహారం కొరకు బయట నుంచి ఏమీ కొనుగోలు చేయడం లేదు. ప్రతిరోజు సగటున 200 లీటర్ల గేదె పాలు, లీటరు 70/–ల చొప్పున 20 లీటర్ల ఆవుపాలు పొందుతూ లీటరు 80/–ల చొప్పున అమ్మకం చేస్తున్నాడు. పాల దిగుబడి తగ్గకుండా చూసుకుంటూ అవసరమయితే పాడి పశువుల కొనుగోలు చేసుకుంటూ వస్తున్నాడు.

చీనీ తోటలో కాయలు వచ్చే సమయానికి మరియు వచ్చిన తరువాత 3 ఏళ్ల వరకు వ్యాధుల నివారణకు అతను చెట్లకు కొట్టని పురుగు మందు లేదు. వచ్చే దిగుబడి కన్నా పురుగుమందులకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంది. ఆ సమయంలో పాలేకర్ సూచించిన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి మారడం జరిగినది. దీనికి ముఖ్యముగా దేశీ ఆవు పేడ అత్యవసరం. ఎందుకంటే ప్రకృతి కషయాలు తయారు చేయాలంటే దేశీ ఆవు పేడ తప్పనిసరి. ఈ గోఆదారిత వ్యవసాయములో దిగుబడి కోసం సమయం వెచ్చించిన సుబ్బారెడ్డి తరువాతి మూడు ఎండ్లలో రెట్టింపు దిగుబడి మరియు రుచికరమయిన కాయలతో విజయవంతముగా పురుగు మందులు లేని చీనీ కాయలు సాధించాడు. అదే మూడు సంవత్సరాలలో మరో వైపు సేంద్రియ పాలను కుడా ఉత్పత్తి చేసాడు.

ఈ ప్రకృతి వ్యవసాయం కోసం మంచి ఒంగోలు దేశీ ఆవు కోసం మమ్మల్ని సంప్రదించడం జరిగినది. దేశీ ఆవు ను కొనుగోలు చేసిన తర్వాత ఆవు ద్వారా వచ్చే పాలను ఇంటి వద్దనే విక్రయించడం మొదలుపెట్టాడు. అతని దగ్గర అంతకు మునుపు ఉన్న గేదెలతో ఇంటి దగ్గరకు వచ్చి గేదె పాలు వేపించుకునే ప్రైవేటు డ్కెరీ వారు వెన్న శాతం ప్రకారం లీటరుకు 40 రూపాయలు మాత్రమె వచ్చేవి.

వ్యవసాయములోనే గాక పాలలో కూడా ఎటువంటి కల్తీ లేకుండా సేంద్రియ పాలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ పశువులకు సరి కొత్తగా పశు వుల పాక ఏర్పాటు చేసి సేంద్రియ పద్దతిలో ఎటువంటి మందులు మరియు రసాయనాలు వాడని గడ్డిని మేతగా ఇవ్వడం ప్రారంభించాడు. ఈ విధమయిన దేశీ పాల యొక్క ప్రాముఖ్యత తెలిసిన వాళ్ళు తన ఊరిలో కూడా సేంద్రియ పాలకు మంచి డిమాండు ఏర్పడి మొదటగా లీటరు 50 రూపాయలకు విక్రయించాడు. అంతేగాక తన వద్ద ఉన్న మూడు నాటు గేదెలకు వచ్చే పాలను కూడా లీటరు రూ.50లకు విక్రయించేవాడు. తద్వారా ఎక్కువ డిమాండ్ రావడంతో కడపలో బుగ్గ సేంద్రియ పాలు అని షాపు ప్రారంభించాడు. అదే క్రమములో ఎక్కువ దేశీ ఆవు పాలు ఇచ్చే గిర్ జాతి ఆవులను మరియు ఇంకా కొన్ని గ్రేడేడ్ ముర్రా జాతి గేదెలను కొనుగోలు చేసాడు.

ప్రస్తుతం రోజుకు ఈ దేశీ ఆవులు మరియు గేదెల నుండి 200 లీటర్లకు పైగా సేంద్రియ ఆవు మరియు గేదె పాలను ఉత్పత్తి చేసి లీటరు గేదె పాలు 70 /– లకు, దేశీ ఆవు పాలు అయితే లీటరు 80/– లకు విక్రయిస్తూ సేంద్రియ ఆవు పాలకు మార్కెట్ చేయడం జరిగినది. ఇతనిని ఆదర్శముగా మరి కొందరు అదే ల్కెన్లో చాల వరకు సేంద్రియ ఆవు పాలు మరియు పల్లె పాలు అని పేర్లతో అవుట్ లెట్లు ప్రారంభించారు. మాములుగా అయితే మన రైతు పేరు సంసాని సుబ్బారెడ్డి. ఈ సేంద్రియ పాలు ప్రారంభించిన తరువాత అతని ఇంటి పేరు బుగ్గ సుబ్బారెడ్డిగా మారిపోయింది. ఈ విధముగా యువరైతు తన ఆలోచన పరిధిని మార్చుకోవడం వలన మిగతా పాడి రైతులకు ఆదర్శంగా నిలిచాడు.

# విడిపోయిన జంట

గురుదత్తునికి, పద్మినికి అటువంటి ఒక కోయపల్లెలో ఆతిథ్యం దొరికింది. అక్కడే ఒక పాకవేసుకుని వాళ్లిద్దరూ జీవించసాగారు. ఆ కోయవారికి కలిగిన నైపుణ్యాలలో.. అడవిలో దొరికే ఆకులతో చాపలు, బుట్టతట్టలు అల్లడం కూడా ఒకటి. పద్మిని, గురుదత్తుడు ఆ పనులు నేర్చుకున్నారు. వాటితోపాటు అడవిలో దొరికే నారలతో విచిత్రమైన తివాసీలను తయారుచేయడం మొదలుపెట్టారు. ఆ వస్తువులను సమీప గ్రామాలలో అమ్ముకుని రావడం వల్ల కోయవారికి ఎంతో ధనం లభించేది. ఆ డబ్బును పద్మిని, గురుదత్తుడు ఆశించేవారు కాదు. వారి సేవలను మాత్రమే అంగీకరించేవారు.

వాళ్లకు ఆ అరణ్యమే ఉద్యానంలా, కొండలే క్రీడాస్థలాలుగా అనిపించసాగాయి. అలా కాలం గడుస్తుండగా.. కొంతకాలానికి పద్మిని గర్భిణి అయింది. ఒకనాడు గురుదత్తుని ఒడిలో తలపెట్టుకుని.. "స్వామీ! నా వల్లనే కదా మీరిన్ని కష్టాలు పడాల్సి వచ్చింది" అని కన్నీరు కార్చసాగింది పద్మిని. అప్పుడు గురుదత్తుడు ఆమె తల నిమురుతూ.. "నీ కష్టంతో పోలిస్తే నా కష్టం ఏ పాటిది? అయినా కాలం ఎప్పుడూ ఒకే రీతిగా ఉండదు. హరిశ్చంద్రాదులు, ఇంద్రాది దేవతలు సహా కర్మసూత్రాన్ని దాటిన వారు ఎవరూ లేరు. దైవం ఎటు వంచితే అటు వంగి నడవాల్సిందే కానీ, ముక్కుసూటిగా పోవడానికి మనకేమీ స్వతంత్రం లేదు. మనకూ ఒకనాటికి మంచి రోజులు వస్తాయి" అని ఓదార్చాడు.

పద్మినికి క్రమంగా నెలలు నిండాయి. ఆమెకు రేపో మరునాడో ప్రసవం కావాల్సి ఉన్నది. అటువంటి సమయంలో గురుదత్తుడు ఒక వింతైన తివాసీ అల్లడానికి పూనుకున్నాడు. దానికోసం మృదువైన పిట్టరెక్కలు కావాల్సి వచ్చాయి. అందువల్ల వనచరులతో కలిసి గుట్టల మీదికి వెళ్లాడు గురుదత్తుడు. అక్కడ పిట్టరెక్కల కోసం వెతుకుతుండగా.. ఒక పాము గదాధరుణ్ని కరిచి పారిపోయింది. దాని విషశక్తి ఎంతటిదో కానీ, కాటువేసిన నిమిషంలోనే అతనికి తెలివి తప్పింది. అతని తోటివారు మందుచెక్కల కోసం గూడేనికి పరుగులు పెట్టారు.

వారిలో ఒకడు.. "అయ్యవారిని పురుగు కుట్టిందమ్మా! తెలివి తప్పింది" అంటూ పద్మినికి చెప్పేశాడు. అప్పుడు ఆమె గుండెలు బాదుకుంటూ వారి వెంట బయల్దేరింది. ఒకచోట చిన్న మెట్ట ఎక్కుతుండగా ఆమెకు ప్రసవ వేదన మొదలైంది. తోడుగా వచ్చినవారిలో ఒకడు పల్లె స్త్రీలను తీసుకురావడం కోసం వెళ్లగా, మిగిలినవారు గురుదత్తుని కోసం వెళ్లారు.

ఆ ఒంటరివేళలో ఆమెకు చక్కని కుమారుడు పుట్టాడు. కష్టమైన కానుపు కావడంతో ఆమెకు పూర్తిగా తెలివి తప్పింది. కొంతసేపటికి అక్కడికి వచ్చిన వాళ్లకు.. ఆమె ఒక్కతే కనిపించింది. పుట్టిన పిల్లవాడు లేడు. కిరాత స్త్రీలు పద్మినికి తగిన ఉపచారాలు చేసి, ఎత్తుకుని పల్లెకు మోసుకుపోయారు.

సాయంత్ర సమయానికి పద్మినికి స్పృహ వచ్చింది.

"నా కొడుకెక్కడ?" అని అడిగితే.. "నీకు కానుపు అయ్యింది కానీ, నీ కొడుకు ఏమయ్యాడో కనిపించలేదమ్మా!" అని సమాధానం చెప్పారు వాళ్లు.

పద్మిని పంటిబిగువున కన్నీరు కార్చింది.

"ఆయనకు ఎలా ఉంది?" అని అడిగింది. "అయ్యవారు కూడా కనిపించలేదమ్మా" అని బిక్కుబిక్కుమంటూ చెప్పారు వాళ్లు. "మేం వెళ్లేసరికి ఆయనక్కడ లేరు. అడవి ఏనుగు అడుగుల గుర్తులు కనిపించాయి. దానికోసం అడవంతా గాలించాం! ఎక్కడా అయ్యవారు లేరు కానీ, ఒక అడవి ఏనుగు చచ్చిపడి ఉంది" అని వివరించారు. పద్మినికి గుండె బద్దలైపోయింది. పుట్టిన వెంటనే కన్నకొడుకుని, అదే రోజున కట్టుకున్న మొగుణ్నీ కోల్పోవడంతో.. ఆమెకు ఒక్కసారిగా లోకం చీకటైపోయింది. భర్త తిరిగి వస్తాడన్న ఆశతో ఆమె ప్రాణాలు నిలబెట్టుకుంది. ఆమెపై అభిమానంతో పల్లెవాసులే ఆమెను పోషించసాగారు. కానీ, రోజులు గడిచేకొద్దీ పద్మిని వెర్రిదానిలా మారిపోయింది. ఆమె మంచిచీర ధరించి ఎరుగదు. ఎవరైనా ఇచ్చిన పండ్లు ఫలాలు తోచినప్పుడు తినడమే కానీ, స్వయంగా వండుకుని తిని ఎరుగదు. నాలుగైదేళ్ల కాలం గడిచేసరికి ఆమెను పూర్తిగా నిరాశ ఆవరించింది. కోయగూడెం వదిలి, అరణ్యమార్గంలో తోచిన దిక్కుకు నడుస్తూ పోయింది. చాలా కష్టాలు పడుతూ, ఒంటరిగా అలా ఎంతకాలం నడిచిందో కానీ, చివరికి ఒక పట్టణం చేరుకుంది. అక్కడో వీధిలో రత్నాంగి అనే భోగకాంత.. తన ఇంటిముందు నిలబడి నీళ్లు తెచ్చే పనికత్తె కోసం ఎదురు చూస్తున్నది. పద్మిని పిచ్చివాటాన్ని కనిపెట్టి, దగ్గరికి పిలిచింది. మలినమైన దుస్తులలో కూడా స్పష్టంగా ఉట్టిపడుతున్న ఆమె తేజస్సును చూసి అచ్చెరువొందుతూ.. "అమ్మీ! ఎవరు నువ్వు?! నాకో ఉపకారం చేసి పెడతావా? తప్పుగా అనుకోకు సుమా! ఈ కడవతో ఆ చెరువునుంచి నీళ్లు తెచ్చిపెట్టగలవా?" అన్నది.



పద్మిని మారుమాట్లాడకుండా కడవ పుచ్చుకుని చెరువుకు వెళ్లింది. శుభ్రంగా స్నానం చేసి నీళ్లు తెచ్చింది. ఆ లోపుగా రత్నాంగి కొన్ని బిందెలు ఖాళీ చేసి ఉంచింది. వరుసగా పది కడవల నీళ్లు తెచ్చి పోసింది పద్మిని.

ఆమెకు కొంత ఆహారం తెచ్చిపెట్టింది రత్నాంగి.

"అమ్మీ! నువ్వు నా దగ్గర ఉండిపో. నీకు నీచపు పనులు చెప్పను. రోజూ నీళు తెచ్చిపెడితే చాలు. అన్నం పెడతాను. చీరలిస్తాను" అన్నది.

పద్మిని మౌనంగా తలాడించింది. ఆనాటినుంచి ఆ ఇంటిలోనే ఉండిపోయింది. ఆ తరువాత ఏడెనిమిది సంవత్సరాలు కాలగతిలో కలిసిపోయాయి.

పద్మిని, గురుదత్తుడు నివసించిన కోయపల్లెకు నాలుగు క్రోసుల దూరంలో మరో కొండపల్లె ఉంది. ఆ పల్లెలో కోయలు, చెంచులు, బోయలు నివసిస్తుండేవారు. వాళ్లు కూడా చాపలు, తట్టబుట్టలు అల్లుతుండేవారు. కానీ, తాము అల్లిన వాటికంటే పద్మిని, గురుదత్తులు అల్లిన వింత చాపలకు, తివాసీలకు అధిక ధరలు పలుకుతుండటంతో.. వాటిని తెచ్చుకుని ఎదురుగా పెట్టుకుని, ఆ విద్య తామూ నేర్చుకోవాలని వాళ్లెంతగానో ప్రయత్నించారు. కానీ, ఎందుకో వారికి ఆ విద్య అబ్బలేదు. చివరికి ఆ పల్లెలోని చిరుతపులి అనే బాలునికి ఆ విద్య ఒంటపట్టింది. పదమూడేళ్ల వయసు వచ్చేసరికి.. పాతవాటికంటే ఇంకా అందమైన తివాసీలు అల్లడం మొదలుపెట్టాడు వాడు. వాటికి చుట్టుపక్కల గ్రామాల్లో అధిక ధరలు పలికేవి. కాలక్రమంలో వాడు ఆ విద్యలో రాటు తేలాడు. ఒకసారి వాడు.. పిట్టరెక్కలతోనూ, మేకబొచ్చుతోనూ, మృదువైన ఆకులతోనూ అందమైన కొన్ని తివాసీలు అల్లాడు. తండ్రి వద్దకు వెళ్లి.. "వీటిని పల్లెల్లో కాకుండా, పట్నానికి తీసుకుపోతే ఇంకా మంచి డబ్బొస్తుందయ్యా! ఈసారి మనవాళ్లతోపాటు నేను కూడా వెళ్తాను. నన్ను పంపించవూ" అని చెప్పి ఒప్పించాడు.

కొంతమంది స్నేహితులతో కలిసి, ఉదయార్కుడు అనే మహారాజు పాలిస్తున్న ఆర్యమపురం అనే నగరానికి వెళ్లాడు చిరుతపులి. ఏ వస్తువుకు ఎంత వెల చెప్పాలో తెలియక, తక్కువ ధరలే చెప్పడంతో తెచ్చిన వస్తువులన్నీ వెంటవెంటనే అమ్ముడుపోయాయి.

ఒక పెద్ద తివాసీ మాత్రం మిగిలింది. వింత తివాసీలు అమ్మకానికి వచ్చాయని తెలుసుకున్న రత్నాంగి, పరిచారికతో కబురు చేసింది.

చిరుతపులి ఆమె ఇంటికి వెళ్లాడు. రత్నాంగి నవ్వుతూ ఎదురొచ్చి, లోనికి తీసుకుపోయింది. తన ఇంటిలోని వింతలన్నీ చూపెట్టింది. వాడు బిత్తరపోయి చూస్తుండగా బుగ్గలమీద వేళ్లు విరిచి.. "అబ్బో! గట్టి మనసువాడివే! లేకపోతే నా వేళ్లు చప్పుడు కాకుండా ఉంటాయా?" అన్నది కళ్లు గిరగిరా తిప్పి, కిలకిలా నవ్వుతూ. చిరుతపులికి ఒళ్లు ఝల్లుమంది. పులకలు పుట్టాయి. అయోమయంగానే తివాసీ పరిచాడు. "బాలుడా! దీని వెల ఎంత చెప్పావ్?!" అని అడిగింది బుగ్గపై వేలు రాస్తూ.

"అందరికీ నూరుమాడలు చెప్పాను. నీకైతే.." అంటూ నీళ్లు నమిలాడు వాడు.

"నేను అంతకంటే ఎక్కువిస్తాను. నీకేం కావాలంటే అదే ఇచ్చేస్తాను" అన్నది రత్నాంగి తన కులవృత్తిని ప్రదర్శిస్తూ.

ఆ చేష్టలతో ఆ అమాయక బాలుడికి మతిపోయింది. చివరికి.. 'నాకు నువ్వే కావాలి' అని వాడిచేత అనిపించుకుని.. "చీకటి పడగానే వచ్చెయ్. నీకోసం సిద్ధంగా ఉంటాను!" అన్నది రత్నాంగి. తివాసీని అక్కడే వదిలేసి, మొలక మీసాలను దువ్వుకుంటూ వెళ్లిపోయాడు వాడు. చిరుతపులి వెళ్లిన క్షణం నుంచి రత్నాంగికి జ్వరం వచ్చినట్లు అనిపించసాగింది. సాయంత్రం కావస్తుండగా.. 'అయ్యయ్యో! ఆ పిల్లాణ్ని రాత్రికి రమ్మన్నాను. వాడి కోరిక తీర్చకపోతే, ఆ తివాసీ పట్టుకుపోయినా పోతాడు. ఏమిటి చేయడం!?' అని దీర్ఘంగా ఆలోచించింది. చివరికి ఒక నిశ్చయానికి వచ్చి పద్మిని వద్దకు వెళ్లింది.

"అమ్మీ! ఈవేళ ఒక కోయపిల్లవాడు చక్కటి తివాసీ ఒకటి అమ్మకానికి తెచ్చాడు. ఎంత గొప్పగా ఉందనుకున్నావు.. రా చూద్దాం" అని తీసుకుపోయింది.

ఆ తివాసీ చూడగానే పద్మినికి గతమంతా కండ్ల ముందు కదలాడింది. 'ఇటువంటి తివాసీని నేను, గురుదత్తుడు తప్ప మరెవ్వరూ అల్లలేరు. ఈ పిల్లవాడు ఎవరై ఉంటాడు?' అని ఆలోచించ సాగింది.

పద్మిని బుగ్గలు పుణుకుతూ.. "ఒసే అమ్మీ! దీన్ని అమ్మడానికి వచ్చిన పిల్లాడు రాత్రికి పడకకు వస్తానని చెప్పి పోయాడు. వాణ్ని సంతోషపెట్టకపోతే ఇంత చక్కని తివాసీ చెయ్యిజారి పోతుంది. ఇంతకాలం నుంచి నిన్ను సాకుతున్నా, ఇలాంటి పనులకు నిన్నెప్పుడూ నియోగించలేదు. ఈ ఒక్కసారికీ నీకు తప్పదు. అదుగో ఆ చీర కట్టుకో! ఆ నగలు పెట్టుకో! నీకు అట్టే కష్టం ఉండదు. ఉత్త చంటిపిల్లాడు వాడు. మాటలతో పొద్దుపుచ్చినా సరిపోతుంది" అన్నది బతిమాలుతూ.

మరో సందర్భంలో అయితే పద్మిని ఏమని సమాధానం చెప్పేదో కానీ, ఆ వచ్చిన పిల్లవాడు ఎవరో తెలుసుకోవాలనే ఉద్దేశంతో 'సరే!' అన్నది. కానీ, ఆమె చెప్పినట్లుగా చీర, నగలు మాత్రం ధరించలేదు.

మాసిన చీరతోనే గదిలో ఓ మూల కూర్చుని నిరీక్షించసాగింది. అనుకున్న సమయానికి చిరుతపులి రానేవచ్చాడు.

అతణ్ని చూడగానే పద్మినికి పాలు చేపునకు వచ్చాయి.

విద్యలకు సరస్వతి అయిన పద్మినిని.. విద్యాధికుడైన గురుదత్తుడు వివాహం చేసుకున్నాడు. అయితే దుర్గానగరం అధిపతి సురూపుడు అక్రమంగా పద్మినిని వాంఛించాడు. ఆమె కుటుంబాన్ని కష్టాలపాలు చేస్తానని బెదిరించాడు. దాంతో పద్మిని, ఆ రాజును వధించింది. పద్మిని, గురుదత్తుడు ఆ నగరం నుంచి పారిపోయారు. తెల్లవారేసరికి కూతురు, అల్లుడు కనిపించక పోయేసరికి.. కుముదాంగదుడు నెత్తిన పిడుగుపడ్డట్లు నిశ్చేష్టుడయ్యాడు. అటువైపు సురూపుడు కనిపించక రాచనగరులో అలజడి చెలరేగింది. రాజుకోసం భటులు నలుమూలలా గాలించారు. చివరికి కుముదాంగదుడి ఇంటి సమీపంలోని పెంటకుప్ప మీద సర్వాభరణ విభూషితుడైన సురూపుని శవం కనిపించింది. 'పీడ విరగడైంది'.. అనుకున్నవారే కానీ, 'అయ్యోపాపం!'.. అన్నవారు లేరు. సురూపునికి వారసులు లేకపోవడం వల్ల అతని మరణవార్త వెంటనే చక్రవర్తి అయిన గజేంద్రవాహనునికి తెలియజేశారు. మంత్రులనే అధికారులుగా నియమిస్తూ ఆజ్ఞలు వెలువరించాడు చక్రవర్తి. సురూపుణ్ని గురుదత్తుడు, పద్మినియే చంపి ఉంటారనే అనుమానంతో.. 'వాళ్లెక్కడకు వెళ్లారు?' అని.. కుముదాంగదుడిని వేధించసాగారు అధికారులు. 'నాకేం తెలియదు బాబోయ్!' అని ఎన్నిసార్లు చెప్పినా నిపించుకోకుండా.. అతనికి గృహనిర్బంధ శిక్ష విధించారు. పదిరోజుల తరువాత గదాధరుడు వచ్చాడు. కుముదాంగదుణ్ని ఓదార్చి, తనకోసం గురుదత్తుడువదిలివెళ్లిన ఉత్తరాన్ని చదువుకున్నాడు. అందులో ఇలా ఉంది.. 'నలుడు, రాముడు, పాండవులు కూడా అనేక కష్టాలపాలు కాలేదా?! వాటిని పోగొట్టుకోవడానికి వారు ఏ మార్గంలో నడిచారో, మేమూ ఆ మార్గాన్నే ఆశ్రయిస్తున్నాం'.. ఆ ఉత్తరాన్ని చదివిన గదాధరుడు.. "దీని ప్రకారం మనవాళ్లిద్దరూ అడవిబాట పట్టినట్లు అర్థమవుతున్నది. నేను వారిని వెతికి వస్తాను. మీరు జాగ్రత్తగా ఉండండి!" అని చెప్పి వెళ్లిపోయాడు. దుర్గానగరానికి ఉత్తరాన దుర్గమారణ్యాలు ఉన్నాయి. వలయాకారంలోని పర్వతాలే పెట్టని కోటలుగా.. ఆ అడవిలో అనేక కోయపల్లెలు ఉన్నాయి. ఆ అడవుల గురించి పూర్తిగా తెలిసినవారికే కానీ ఇతరులకు, అక్కడ పల్లెలు ఉంటాయని తెలియనే తెలియదు.

## చున్నీ దాచిపెట్టి అప్సరసను లగ్గం చేసుకుంటే.. నిజం తెలిసి మొగులు మీదికి ఎగిరిపోయింది!



ఎన్కట ఒక ఊర్లె ఒక పిలగాడు ఉండెటోడు. ఆని పేరు జగను. ఆనికి అయినోల్లంట ఎవ్వలు లేరు. పని దొరికితే శేసుకునుడు, దినుడు. దొరకన్నాడు శెర్ల నీళు దాగి పండుడు. గంతే! అప్పుడప్పుడు అంట జేసుకొని దింటుండె. ఒకపారి అంట జేసుకుందామని పొయ్యికాడికి వొయ్యేటాల్లకు పొయ్యిల కట్టెలు మాయమైనయి. కట్టెలు దెచ్చుకుందమని గొడ్డలి వట్టుకొని జంగల్‌కు వోయిండు. ఆ యాళ్ల కొన్ని కట్టెలు ఎక్వ గొట్టుకున్నడు. జరంత ఆల్యమైంది. మోపెత్తుకొని వోతుంటె.. ఆగుకాడ నీళ్లల్ల ఆడుకుంటున్న అచ్చరసలు కనిపిచ్చిండ్లు. మెల్లగ వోయి అండ్ల ఒకామె ఓనిని తీసుకొని మోపుల దాశివెట్టిండు. అంతట్లకే పొద్దుగుంకె వరకు ఆల్లు జల్దిజల్ది ఆల్ల లోకంలకు వోయెతందుకు తయారు గావట్టిండ్లు. ఈడు ఒక ఓని దాశివెట్టె గదా! అందరు వోయిండ్లు గని.. ఆఖరామెకు ఓని లేకపోవుట్ల మొగులుమీదికి ఎగురరాలే! ఆమె అటీటు జూత్తుంటె.. ఈడు మందలిచ్చి, ముచ్చట అర్సుకొని ఇంటికి దోల్కవోయిండు. కొన్నొద్దులకు ఆల్లిద్దరు లగ్గం సుత జేసుకున్నరు. ఒకపారి సాయిమాను సదుర్తుంటె అచ్చరసకు ఆమె ఓని గనిపిచ్చింది. ముచ్చటంత ఎరికైంది. జగను రాంగనే.. ఇయ్యరమయ్యర తిట్టి, మొగులు మీదికి ఎగిరిపేయింది. ఏడ్శిఏడ్శి జగను పిసోడైండు. ఆని గోస సూడలేక.. "ఎయ్యి మంచి పనులు జేత్తె.. మా లోకంలకు దోల్కవోత!" అంట జెప్పింది అచ్చరస. ఆడు గట్లనే జేసిండు. ఈమె గూడ ఆన్ని ఆల్ల లోకంలకు దోల్కవోయింది. ఆల్ల లోకంల దోసకాయ దింటె అరదలత్తయి. అది దెల్వక మనోడు దూపై దోసకాయ దిన్నడు. ఎంబటే.. అరదలచ్చి అందరు నపరోదిక్కు కొట్టుకవోయిండ్లు. అట్ల ఈల్లిద్దరు శెరోదిక్కు వోయిండ్లు. మనకు మొగులు మీద గనిపిచ్చే 'ఛాయాపథం' సుక్కలు ఈల్లిద్దరేనుల్లా!

## కమెడియన్లు పట్టుకునే హార్మోనియం ఏంది నేర్చుకునేది..

# హీరోయిన్లు మీటే వీణ కదా నాక్కావల్సింది!



నాకు పాడటం నేర్పాలని ఆ సంగీతం మాస్టారు ఎంతో ఓపికగా ప్రయత్నించాడు. నా టోన్ ఒక రఫ్ స్టోన్ అని గ్రహించి.. గాత్ర సంగీతం కాకుండా, వాద్య సంగీతం నేర్చుకుంటే మంచిదని నిర్ణయించాడు. నాన్నతో చెప్పి హార్మోనియం కొనుక్కోమని సలహా ఇచ్చాడు. నాదైన పద్ధతిలో ఆ ప్రయత్నాలు మొదలుపెట్టాను. నాకెందుకో ఆ హార్మోనియమే నచ్చదు. సినిమాల్లో హార్మోనియం వాయించే వాళ్లు పాన్ నములుతూ, గిరజాల జుట్టుతో ఉండేవారు. ఎక్కువగా హాస్యనటులు పోషించిన పాత్ర అది! 'వీణ ఎంత అందంగా ఉంటది! వయోలిన్ ఇంకెంత అందంగా ఉంటది! హార్మోనియం ఏంది నేర్చుకునేది?' అని మనసులో అనుకున్నాను.

నా కళ్ల ముందు రాఘవేంద్రరావు సినిమాల్లోలా వెయ్యి బొబ్బిలి వీణలు, రెండువేల తంజావూరు వీణలు కదిలివెళ్తున్నాయి. అందమైన చీరలు కట్టుకుని, తమ నాజూకు చేతుల్తో వీణలు వాయిస్తున్న సినిమా హీరోయిన్లే కనిపించేవారు. కాకపోతే ఆయన.. "అన్ని సంగీత వాద్యాలకు మూలం హార్మోనియం. ముందు హార్మోనియం నేర్చుకుంటే.. తర్వాత అన్నీ వాటంతటవే ఈజీగా వస్తాయి" అని మా నాన్నను కన్విన్స్ చేశాడు. 'సరే! ఏదో ఒకటి ఏడుద్దాం!' అనుకొని.. హార్మోనియం కొనుగోలు కోసం ఖజానా నుంచి నిదులు విడుదల చేయాల్సిందిగా నాన్నను కోరాను. ఆయన దాటవేసే ధోరణిలో ఉండటంతో.. ఇక లాభం లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖలో అమ్మకు టెండర్ పెట్టాను. "నేను మొదలే చెప్పిన కదా! నువ్వ ఇప్పుడు ఈ సంగీతం నేర్చుకోవడం అవసరమా! అన్నీ పనిలేనివి నా నెత్తిమీదికి తెస్తవు. ఇప్పుడు ఆ హార్మోనియం అంటే ఉత్తగొస్తదా?! దానికి బొచ్చెడు పైసలు గావాలె! మన దగ్గర లేవు.. ఒద్దే అంటె ఇన్నవా! ఓ ఆఠాణో రూపాయో ఉంటె దాచుకోవాలె గానీ.. గిట్ల దండుగ జేసుకుంటరా?!" అంటూ అమ్మ తీవ్రంగా ప్రతిఘటించింది. కానీ, నేను అస్సలే వినలేదు. 'ఎలాగైనా సరే.. హార్మోనియం కొనాలి. ఆ సంగీతం అంతు చూడాలి!' అనుకున్నాను. "అమ్మా! కొనవా!?.. అమ్మా! కొనవా!?.. అమ్మా! కొనవా!?.." అంటూ వెంటబడ్డాను. మొత్తానికి అమ్మ ఎట్లా చేసిందో ఏం చేసిందో గానీ, అత్యవసర నిధిలోంచి డబ్బులు తీసి ఇచ్చింది. ఆ మర్నాడే.. ఆయన ఎక్కడిదో డొక్కు సెకండ్ హ్యాండ్ హార్మోనియం తీసుకొచ్చాడు. మళ్లీ పొద్దున్నే ఆయన రావడం.. ఓ చాప వేసుకుని కూర్చోవడం.. హార్మోనియం పెట్టె దాంట్లో పెట్టడం.. నేను తయారై వచ్చి ఆ హార్మోనియం వాయించడం మొదలైంది. నేను వాయిస్తూ ఉంటే ఆ హార్మోనియం మెట్లు ఊడి చేతులోకి రావడం.. ఆయన "అయ్యయ్యో! జాగ్రత్తగా చూసుకోవాలమ్మా!" అంటూ మళ్లీ అమర్చడం జరిగేది. "ఆ హార్మోనియం మీ సంగీత చక్రవర్తిదే ఉన్నట్టుంది. పైసలు అవుసరం ఒచ్చినయి గావొచ్చు.. మీ జాలి గుండె కనిపెట్టిండు. మన దగ్గర ఆరు వందలు తీసుకొని, ఆ డొక్కు హార్మోనియం అంటగట్టిండు" అని నాన్నతో అమ్మ నవ్వుతూ అంటుంటే.. ఏమీ అనలేక నాన్న కూడా నవ్వేవాడు. మొత్తానికి నేను కీర్తనల దాకా వచ్చాను. ఆ హార్మోనియం మీద నేను కొన్ని ప్రయోగాలు కూడా చేశాను. అందులో ఆయన చెప్పని పాటలు కూడా దాని మీద వాయించడం మొదలుపెట్టాను. "ఇదేమిటి? ఇంత బాగా వాయిస్తున్నావ్? ఈ పాట నేను నేర్పలేదే?" అనేవాడు కొంచెం హాశ్చర్యపోయి. "అవును మాష్టారూ! నేనే ట్రై చేసిన!" అనేదాన్ని. ఆయనకు కూడా అంతగా సంగీతం ఏమీ రాదని కొద్దిరోజుల్లోనే నాకర్థం అయింది. నేను.. 'మేష్టారూ!' అని పిలవాలని ఆయన కోరిక! తెలంగాణలో శాస్త్రీయ సంగీతాలే తక్కువ. జానపదాలు ఉగ్రూతలు ఊగుతుంటాయి. ఇక 'మేష్టారూ!'.. అనడం అస్సలు ఉండదు. నాకేమిటో కృత్రిమంగా అనిపించేది గానీ.. పోనీలే ఏదో సరదా పడుతున్నాడని 'మేస్టారూ!' అని పిలిచేదాన్ని.

అయితే ఈ మధ్యకాలంలో చాలా దిగ్భ్రాంతికరమైన నిజాలు తెలిశాయి. అసలు విషయం ఏమిటంటే.. ఈ సంగీత చక్రవర్తి గారు ఫుల్డోస్ మాస్టర్. కాఫీ, టీలు అస్సలు తాగడు. కానీ, వేరే ద్రవాలన్నీ సేవిస్తాడట. ఒక్క మా ఇంటికి వచ్చేటప్పుడు మాత్రం.. అదికూడా ఉదయం పూట తప్ప, ఆయన 24 గంటలు ఏక్ నిషాలోనే ఉంటాడని నాన్నకు తెలిసింది. అమ్మ వెంటనే.. "సంగీతం ఒద్దు, చట్టుబండలు ఒద్దు.. ఆ తాగుబోతు దగ్గర ఈ పిల్ల నేర్చుకోవడం అసలే ఒద్దు!" అని ఆ సంగీతం మానిపిద్దామని పట్టుపట్టింది. ఈలోగా కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు.. ఆయనే రావడం మానేశాడు. ఊరినిండా అప్పులు చేసి ఎగ్గొట్టి.. ఎక్కడికో వెళ్లిపోయాడని అందరూ చెప్పుకొన్నారు. ఆ తరువాత కొన్నాళ్లకు మా ఊర్లోని శ్రీరామ భజన మండలివాళ్లు నాన్నకు మెల్లగా టెండర్ వేసి.. ఆ హార్మోనియం పట్టుకుపోయారు. అలా.. నా సంగీతం చెట్టెక్కింది. అక్క క్లాస్‌మేట్, మా కామన్ క్లోజ్ ఫ్రెండ్ అయిన ఇంద్రాణి (కొండపల్లి నీహారిణి అక్క), నేనూ చాలా జోకులు వేసుకునేవాళ్లం. తనకూ, అక్కకూ, నాకూ.. పాటలంటే చాలా ఇష్టం. కానీ, గాత్రశుద్ధి లేదు. అప్పట్లో 'చక్రవాకం' అనే ఓ సినిమాలో వాణిశ్రీ వీణ వాయిస్తూ .. 'వీణలోనా తీగలోనా ' అంటూ ఓ పాట పాడుతుంది. అందులో.. 'గత జన్మ శ్రుతి చేసుకున్నది.. అది ఈ జన్మ సంగీతమైనది' అని వస్తుంది. మేము ఆ పాటను గుర్తు చేసుకుంటూ.. "మనం గత జన్మలో శ్రుతి చేసుకోలేదు. అందుకే ఈ జన్మలో సంగీతం రాలేదు. అంతే!" అని నవ్వుకునేవాళ్లం.

# జాయ సేనాపతి చారిత్రక కాల్పనిక నవల



కొండయ బృందంతో కలిసి నాటకాలు వేస్తున్న జాయప.. ఒకనాడు కాకతీయ ఆస్థాన నర్తకి నీలాంబ దగ్గర తేలాడు. ఆమె ఆధ్వర్యంలో జరిగే నాట్యోత్సవం కోసం రాచనగరులో అడుగుపెట్టాడు. తమ రాజ్యంపై దాడిచేసి.. తనతండ్రిని ఓడించిన గణపతి దేవుణ్ని తొలిసారి చూడబోతున్నాడు. దాంతో చాలా ఉద్వేగంగా ఉన్నాడు ఆ ద్వీప రాకుమారుడు.

గణపతిదేవుని ప్రవేశంతో భట్రాజులు బృందగానం ప్రారంభించారు

"ఓం శ్రీ శ్రీ నమఃశివాయ.. నమఃరుద్రాయ
సకల గుణాలంకార.. పరనారీదూర
అనుమకొండ పురేశ్వరా సోమలదేవీ నిజేశ్వరా
దోర్బలభీమా రణరంగ రామా
వితరణకర్ణా శౌర్య సౌవర్ణా
పరహితాంజనేయా శౌచగాంగేయా
సత్యరత్నాకరా దుష్ట జనభీకరా
స్వామిద్రోహరగండ శ్రీశ్రీ కాకతి
వంశాబ్ధి కులచంద్రమా
శ్రీశ్రీశ్రీ రాయగజకేసరి బిరుదాంకి
శ్రీశ్రీశ్రీ గణపతిదేవ మహారాజులుంగారు
వేం చేయుచున్నారోహో! వేం చేయుచున్నారోహో..
వేం చేయుచున్నారోహో! వేం చేయుచున్నారోహో.."

భట్రాజుల స్తోత్రపాఠాలకుతోడు రుంజలు, బూరలు, తప్పెట్ల సంగీతహోరు ఆ ప్రాంగణమంతా ప్రతిధ్వనిస్తుండగా, అందరూ విభ్రాంతిగా రెప్పవెయ్యకుండా చూస్తుండగా.. మహా మండలేశ్వరుడు, కాకతీయచక్రవర్తి శ్రీశ్రీశ్రీ గణపతిదేవుడు హుందాగా నడచివచ్చి, తన సింహాసనం వద్ద నిలబడ్డాడు. వెంటవచ్చిన లెంకలు వెనక్కి వెళ్లారు. ఆ హోరు తగ్గాక ఆయన చేతులు జోడించి సభకు నమస్కరించాడు. అప్పుడు ఆయన వంక చూడటం అందరికీ ఎంతో ఉత్తేజంగా, కన్నుల పండువగా ఉంది. తిరుచూర్ణపు అంచున్న వెండిరంగు పట్టుపంచె కట్టి.. పైన బంగారు, ఎరుపు కలనేత కంచుకం ధరించి, వజ్ర వైడూర్యాలు పొదిగిన హారం, పొడుగైన ముత్యాలదండ ఎదపై కదలాడుతుండగా.. నడుముకు ఉత్తరీయం చుట్టి, దానిలో వజ్రాలపిడిగల చురకత్తి దోపాడు. ముఖాన విభూతిరేఖలపై నిలువు ఎర్రెర్రని బొట్టు. తలపై బంగారు రంగు తలపాగా.. నిండైన కోరమీసం. స్థిరపడిన యవ్వనంతో తుళ్లిపడుతున్న ఉత్కృష్టరూపం. రాజ్యభారం ఏమాత్రం కష్టం అనిపించనట్లుగా విశాలమైన నవ్వు.. ఆరడుగుల ఆజానుబాహువై.. స్థితప్రజ్ఞునిలా గోచరిస్తున్నాడు. ఎవరినైనా తనవైపు తిప్పుకోగల బలమైన వ్యక్తిత్వం.. శారీరక దృఢత్వంతో కలగలిసిన మానసిక పటుత్వం.. ముఖంలో తేజరిల్లుతుండగా, అన్నివైపులా తల తిప్పుతూ అందరినీ మధురస్మితంతో పలకరిస్తున్నట్లు చూస్తున్నాడు. 'భలే ఉన్నాడే! తెలివైన పరాక్రమశీలి కావచ్చు.. నాకు నచ్చాడు!!'.. జాయప పెదాలు అస్పష్టంగా కదలాడాయి. గణపతిదేవుణ్ని చూస్తూ కనురెప్పలు కదలిక మరిచాయి. ప్రాంగణ ఉత్తరభాగంలో ఉన్నతవేదిక. దానిపై సమున్నతంగానున్న వజ్ర వైడూర్య ఖచిత బంగారు సింహాసనంపై ఆయన ఉపవిష్టుడయ్యేవరకూ.. ప్రాంగణంలోని పెద్దలంతా నిలబడి చేతులుజోడించి, వినయంగా వంగి ఉన్నారు. ఆయన కూర్చుని చిరునవ్వుతో సైగ చేశాక.. అందరూ కూర్చున్నారు.

ఇది రాచరికపు సంప్రదాయం.

అది సాయంకాల సాంస్కృతిక కార్యకలాపం కాబట్టి కనీసపు రాచమర్యాదలు నిర్వహించారు. అదే ఉదయపు చక్రవర్తుల ప్రధాన సభా సమావేశమైతే పూర్తిస్థాయి రాచరికపు పద్ధతులు ఉంటాయి. ఇవి శివరాత్రి పర్వదిన సంరంభాలు కాబట్టి చక్రవర్తి కొంచెం విశ్రాంతిగా కనిపిస్తున్నారు. ఆయన మంత్రులు, ప్రధానులు, నియోగాధిపతులు.. తదితర అధికారవర్గాలు సాధారణ దుస్తులలో వచ్చి, విశ్రాంతిగా కూర్చుని.. తీరుబడిగా అందరితో ముచ్చట్లు చెబుతున్నారు. నగరులో ఉన్నవారు, రాచకార్యాలులేని ముఖ్యులు, కుటుంబాలతో తరలివచ్చారు. సాధారణ ప్రేక్షకుల్లో ఎక్కువగా రాచనగరు ఉద్యోగులు, వారి కుటుంబాలు ఉన్నాయి. ప్రాంగణం ఎక్కువగా కవులు, సాహితీవేత్తలు, స్థపతులు, శిల్పాచార్యులు, విద్యాప్రకాశకులు, నాట్యాచార్యులు, గాయకులతో కళా సాహితీ సమరాంగణంలా భాసిస్తున్నది. చక్రవర్తి పట్టమహిషితో హాజరుకావడం.. ప్రధాన సభా సమావేశాలతో పోల్చితే తక్కువమంది ఉండటంతో అందరికీ చక్రవర్తి దంపతులను దగ్గరగా చూడటం ఉత్తేజంగా ఉంది. చక్రవర్తి కూడా అందరితో పరిహాసయుక్తంగా, కళాభిజ్ఞతతో మాట్లాడుతుండటం ఆ సాయంవేళ మరింత శోభాయమానంగా ఉన్నది. అక్కడ కొంచెం హడావుడిగా ఉన్నది.. కార్యక్రమ నిర్వాహకుడైన గుండయామాత్యులు మాత్రమే. ఆయన సైగ చేయగా రూకలసంచులు ఉంచిన బంగారు తళియ పట్టుకున్న అడపంధారి.. సింహాసనం పక్కకు వచ్చి వినయంగా నిలబడింది. చక్రవర్తి చూశాడు. నవ్వి..

"ఊ.. గుండయామాత్యులు అన్నీ సిద్ధం చేసినట్లున్నారు. కాస్త విశ్రాంతిగా మీ ఆసనంలో ఆసీనులుకండి!" అన్నాడు హాస్యస్ఫోరకంగా.

"నీలాంబ కంటే ఆయనే నాట్యం చేసేలా ఉన్నాడు ప్రభూ.." అల్లరిగా అన్నాడొక మంత్రి పుంగవుడు.

చక్రవర్తితోపాటు ప్రాంగణమంతా నవ్వులతో పరిమళించింది. గుండయామాత్యుడు నగుమోము తెచ్చిపెట్టుకుని రాజాజ్ఞను గౌరవించినట్లు ఆసనంలో కూర్చుని తిరిగి లేచాడు.

"నిజానికి వారు నాట్యగురువులు. నిర్వహణాధికారం ఇచ్చి వారి నాట్యకౌశలాన్ని మనం కోల్పోయామేమో.." అన్నాడు చక్రవర్తి. మళ్లా మందిరమంతా చిరునవ్వులు. జాయప ఆలోచన తిరిగి అక్కలవైపు మళ్లింది. చూపు అంతఃపుర ప్రాంగణ ద్వారంపైనే ఉన్నది. అప్పుడే అంతఃపుర ద్వారాలు తెరచుకున్నాయి. పట్టపురాణి శ్రీమతి సోమలదేవి అంతఃపుర అధికార మర్యాదలతో, దాసదాసీ పరివారంతో మరోసారి మందిరంలోకి వచ్చింది. ఈసారి ఆమె చేతిలో జ్యేష్ఠపుత్రిక గణపాంబ.

ఉద్విగ్నంగా లేచి వచ్చిన అంతఃపుర స్త్రీలను రెప్పవెయ్యకుండా చూశాడు జాయప. అక్కలు కనిపిస్తే.. వాళ్లను బంధవిముక్తులను చెయ్యమని మోకాళ్లపై వంగి చక్రవర్తిని ప్రార్థించాలని భావించాడు. ప్చ్.. నిరాశే ఎదురయ్యింది. అక్కలు అక్కడ కనిపించలేదు.

పరివారం ఆసనాల వద్ద ఆగిపోగా, సోమలదేవి చక్రవర్తి వద్దకు వచ్చి పక్కనున్న ఉచితాసనంలో కూర్చున్నది. తండ్రిని చూసిన చిన్నారి గణపాంబ తండ్రి వైపు దూకుతున్నది. ఆయన మరింత పుత్రికోత్సాహంతో కూతుర్ని అందుకుని ఒడిలో అదుముకున్నాడు.

జాయప గణపతిదేవుణ్ని, సోమలదేవిని జంటగా చూసి చాలా ఆశ్చర్యపోయాడు. రాజు, రాణి అంటే తన తల్లిదండ్రుల వయసులో ఉంటారని అతని అవ్యక్త అభిప్రాయం. కానీ, కాకతీయ చక్రవర్తి, ఆయన పట్టమహిషి పూర్తిగా చిన్నవాళ్లు. చక్రవర్తి తన బాబాయి కంటే చిన్నవాడు. బహుశా నాగంభట్టు, త్రిపుర వయసు ఉండొచ్చు. సోమలదేవి తన అక్కలకంటే ఎక్కువే పెద్దది. పెద్దక్క నీలాంబ కంటే చిన్నది కావచ్చు. అప్పుడే మరో ఆలోచన కూడా జాయప బుర్రలో మెరిసింది. గణపతిదేవుడు తనకు బావ కాగల వయసు వాడే. ఇలాంటి చక్రవర్తి తన అక్కలను వివాహమాడితే?! అక్కలు కూడా మహారాజు కుమార్తెలే కదా!? తప్పేముంది!! పైగా గణపతిదేవుడు అందగాడు. సోమలదేవి అందవిహీనం కాదుగానీ, మరీ మగరాయుడు. తన అక్కలు అందాల రత్నాలు.. వజ్రాల మెరుపు తీగెలు. బావుంది బావుంది!! ఈ ఆలోచన మనసంతా తేనెలూరించింది.

వెనకనుంచి నీలాంబ అతని వీపుపై తట్టింది.

"ఏమిటి జాయపా.. నవ్వుకుంటున్నావ్?" అన్నది.

అప్పుడొచ్చాడు ఇహ లోకంలోకి. మరోసారి కళాకారులను అందరినీ హెచ్చరించింది నీలాంబ.

అక్కలు కనిపిస్తే..
వాళ్లను బంధవిముక్తులను
చెయ్యమని మోకాళ్లపై వంగి
చక్రవర్తిని ప్రార్థించాలని భావించాడు. ప్చ్.. నిరాశే ఎదురయ్యింది.

గుండయామాత్యుడు లేచి..

"శివరాత్రి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా కాకతీయ ఆస్థాననర్తకి నీలాంబ బృందం ఈరోజు ప్రదర్శించే నృత్య కార్యక్రమం 'ప్రహ్లాద విజయం' ప్రారంభించడానికి అనుమతి ఇవ్వవలసిందిగా మహామండలేశ్వరులవారిని కోరుతున్నాను.." అన్నాడు చేతులు జోడించి వినయంగా.

ఆయన నవ్వుతూ..

"ఊ.. శుభం.. ప్రారంభించండి!" అన్నాడు.

అందరూ చప్పట్లు కొడుతుండగా.. నీలాంబ వయ్యారంగా కదిలి తాంబూలపళ్లెరంతో పరిచారిక వెంటరాగా, వెళ్లి చక్రవర్తి ముందు వినయంగా ఇంచుక ఒయ్యారంగా తాంబూలం తీసి ఆయన చేతికి ఇచ్చింది. పన్నీరుకోర పైకెత్తి ఆయన పైనా, సోమలదేవి పైనా పన్నీరు చిలుకరించింది. చిన్నారి గణపాంబపై మరింత చిలుకరించింది. ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగింది. సంప్రదాయాన్ని గౌరవిస్తున్నట్లు ఇద్దరూ చిరునవ్వు నవ్వారు.

"నీలాంబా.. శివరాత్రి శుభాకాంక్షలు! రాజ్య ప్రజలంతా శివరాత్రి ఉత్సవాలను అంగరంగవైభవంగా జరుపుకొంటున్నారు. మరి రాచనగరులో మేము కూడా ఉత్సవాలు జరుపుకోవాలి కదా. మీ నాట్యమే మా ఉత్సవం.. ప్రారంభించండి!" అన్నాడు గణపతిదేవుడు.

ఆమె మరోమారు చక్రవర్తి దంపతులకు నమస్కరించి దిగి వస్తూ.. ఆమెవైపే చూస్తూ గుటకలు మింగుతున్న కవి గాయక సాహితీమూర్తులకు నమస్కరిస్తూ.. వారి ఆశీర్వాదాలు, కామప్రకంపనలు అందుకుంటూ.. నాట్యమండపానికి చేరింది. అనంతరం వాద్యఘటిక మోగింది. అప్పుడే సమయాన్ని తెలిపే ఝాముల ఘటిక కూడా సమాంతరంగా మోగింది. చక్రవర్తి తృప్తిగా తలపంకించాడు. నిర్దేశించిన సమయానికి కార్యకలాపం ప్రారంభమవడంతో గుండయామాత్యుడు, సోమలదేవి హాయిగా నిట్టూర్పు వదిలారు. రంగస్థలంపై మృదంగధ్వని.. దానితో నట్టువాంగ చిడుతలధ్వని కలిసి మనోహరంగా ప్రారంభం కావడంతో ప్రేక్షకులంతా రంగస్థలంపై దృష్టి నిలిపారు. లోపల రంగదేవతా పూజనం చేశారు నీలాంబ బృందం.

'శుక్లాంబర ధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్
సర్వ విఘ్నోప శాంతయే..
ఆంగికం భువనం యస్య వాచకం సర్వ వ్మాయం!
ఆహార్యం చంద్ర తారాది తం వందే సాత్వికం శివం!!'

రంగదేవతా పూజనం అయ్యాక తెర తొలగింది. మృదంగ దరువుతో రాగరంజితంగా ప్రారంభమైంది ప్రదర్శన. నీలాంబ గొప్పనర్తకి. తన కార్యకలాపాలన్నీ రాజనగరులో.. ముఖ్యంగా చక్రవర్తి సమక్షంలో ఉంటాయి. కాబట్టి అత్యుత్తమ స్థాయి కళాకారులనే ఆమె తన బృందంలోకి ఆహ్వానిస్తుంది. వారికి ప్రఖ్యాతులైన గురువులతో నిరంతరం నాట్యాభ్యాసం నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఆమె దాదాపు పది నాట్య ప్రదర్శన అంశాలను సిద్ధం చేసుకుని ఉన్నది. హఠాత్తుగా ఒక నటుడు అదృశ్యం కావడం కంగారుపెట్టినా.. అనుకోకుండా జాయప లభించడం ఆమె బృందానికి అదనపు బలం.. అదనపు ఆకర్షణ కూడా!

ప్రహ్లాదుడుగా జాయప! పూర్తి ఆహార్యంతో ఉన్న జాయప నిజమైన ప్రహ్లాదుడిలా కళ్లు తిప్పుకోలేనంత అద్భుతంగా గోచరించాడు నీలాంబకు, తోటి నర్తకీ బృందానికి. అతని ముఖంలో అక్కలు కనిపించలేదన్న విషాదవీచికలు.. కనిపించీ కనిపించని ఏదో అసంతృప్తి! తప్పక వస్తారేమోనన్న ఆశ కలిగిస్తున్న సన్నని వెలుగు.. కలగలిసిన సహజ చాతుర్యంతో అందరినీ తనవైపు తిప్పుకొంటున్నాడు జాయప.

నాటకం సనకసనందనాది మునుల విష్ణుమూర్తి ప్రార్థనతో ప్రారంభమై.. రెండవ అంకం తెర తొలగగానే ప్రవేశించాడు ప్రహ్లాదుడు.. జాయప!!

"నారాయణ మంత్రం..
శ్రీమన్నారాయణ భజనం"..

నాట్యమండపమంతా దిగ్భ్రమతో మూగబోయింది..

ప్రహ్లాదుడు అనేవాడు ఇలాగే ఉంటాడేమో!? ఆ మహాభక్తుడే నిజంగా కాకతీయ నాట్యమందిరానికి వచ్చాడేమో!? ఆ ముఖంలో భక్తిభావం.. తన తండ్రిలోని రాక్షసత్వం తెలిసినప్పటి బాధ.. కలగలిసిన ముఖంతో ఆ పసివాడు.. రక్షించాల్సిందిగా నారాయణున్నే చూస్తున్నట్లు తనవైపే చూడటం.. గణపతిదేవుడు గుర్తించాడు.

# లీకు వీర లేవరా..

పంద్రాగస్టుకు వర్షం అడ్డొచ్చేది కనుక.. మా బళ్లో జనవరి 26 వేడుకలు గొప్పగా చేసేవారు. తరువాతి రోజుల్లో స్కూల్ డేనూ బాగా జరిపేవారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటల పోటీలు.. వారంరోజుల ముందునుంచీ జరిగేవి. ఆటల పోటీలు కూడా అంతే! రెండు వారాల ముందునుంచే హడావుడి మొదలయ్యేది. మాబడిలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో.. మెయిన్ బిల్డింగ్ సరిపోయేది కాదు. ఊరివాళ్ల సహకారంతో నిర్మించిన ఓ పొడవాటి గుడిసెలో ఎనిమిదో తరగతి రెండు సెక్షన్లు జరిగేవి. బయటి ప్రపంచం కనిపించేది గనుక మాకూ ఆ గుడిసే అద్భుతంగా ఉండేది. ఓ పొడవైన గుడిసెలో ఇండోర్ పోటీలు జరిగేవి. పోటీలు అయ్యేటప్పుడు మాకు మధ్యాహ్నం క్లాసులు ఉండేవి కావు. లంచ్ అవగానే.. ఆటలు మొదలు పెట్టేవారు. పోటీల విషయానికొస్తే ఒక్క పాటల్లో తప్ప.. నేను అన్నిట్లో పేరు ఇచ్చేదాన్ని. ఇలా అనేకంటే.. ముందు మా టీచర్లే నాపేరు రాసేవారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో నాకే ఫస్ట్ ప్రైజ్ వచ్చేది. పోటీలున్న రోజుల్లో క్లాసులు పెద్దగా జరిగేవి కావు గనుక, లంచ్ అవర్లో ఇంటికి వచ్చి మరికొంత సేపు బిందాస్‌గా గడిపేవాళ్లం.

ఓసారి ఇలాగే ఇంటికి వచ్చాం. అక్క తొమ్మిది, నేను ఎనిమిదో తరగతిలో ఉన్నాం. అక్క స్నేహితులందరూ ఇంటికొచ్చారు. అమ్మ పెట్టిన కిచిడీ తిని.. ఇంటి వెనుక పెరట్లోకి దౌడు తీశాం. నేను నా సహజ లక్షణం ప్రకారం జామచెట్టు ఎక్కాను. ఆ చెట్టు ఏడాది పొడవునా విరగకాసేది. అక్క ఫ్రెండ్స్ అందరికీ పండ్లు తెంపి కిందికి విసిరేశాను. అందరూ కబుర్లు చెప్పుకొంటూ దూరంగా ఉండగా.. ఒక్క రోజారాణి అనే పక్కూరి అమ్మాయి మాత్రం ఆ చెట్టు కిందినుంచి కదల్లేదు. "రమా! నువ్వు చెట్టు దిగేదాన్క ఇక్కడ్నే ఉంట తియ్యి" అని నన్ను సంతోషపెడదామని చూసింది. నేనేం ఉబ్బిపోలేదు. "ఏంగాదు తియ్యి. నేను ఈ చెట్టు రోజుకు పదిసార్లు ఎక్కుత, దిగుత. కావాల్నంటే నువ్వు కూడా పో అక్కా!" అన్నాను. అక్క ఫ్రెండ్స్‌ను మనం కూడా 'అక్కా!' అనుట ధర్మమే కదా! ఆమె వదల్లేదు. అవీ ఇవీ మాట్లాడి చివరికి "రమా ఇవ్వాళ ఉపన్యాస పోటీల ఏం మాట్లాడుతవోయ్!" అని అడిగింది. అలాంటి విషయాల్లో నా సోయిలో నేనుండను. అడిగింది కదా.. అని నేను ప్రిపేర్ అయిన మ్యాటర్ అంతా నోటికి చెప్పేశాను. ఆ తరువాత చూడమని నా నోట్‌బుక్ కూడా ఆమెకు ఇచ్చాను. "అబ్బ! మంచిగ ప్రిపేర్ అయినవు గదబ్బా! నీకే ఒస్తది ఫస్ట్‌ప్రైజ్!" అని నన్ను మెచ్చుకున్నది. ఆ తర్వాత స్కూల్‌కి వెళ్లాం. మధ్యాహ్నం ఒంటిగంటకు వక్తృత్వ పోటీ మొదలైంది. అంశం.. 'స్వాతంత్ర్యోద్యమంలో నా అభిమాన దేశ నాయకుడు' అనుకుంటా. ముందు పదో తరగతి వాళ్లు, తరువాత తొమ్మిదో తరగతి వాళ్లు, ఆ తరువాత మా వంతు.. అంటే ఎనిమిదో తరగతి. కొందరు కాగానే.. 'రోజారాణి, నైన్త్ ఏ' అని పిలిచారు. వెంటనే మన సోదరి నడుచుకుంటూ వెళ్లి, మొత్తం నా పాయింట్స్ అన్నీ.. వరుసక్రమం కూడా మార్చకుండా చెప్పేసింది. గాంధీ మహాత్ముడు.. దక్షిణాఫ్రికాలో రైలు పెట్టెలోనుంచి బయటికి వెళ్లగొట్టబడటం, స్వదేశానికి రావడం, సహాయ నిరాకరణోద్యమం, దండి మార్చ్, రౌండ్ టేబుల్ సమావేశాలు, సత్యాగ్రహం, సబర్మతి ఆశ్రమం, అహింసే ఆయుధం.. ఇలా చెబుతూ పోతుంటే నేను తెల్లబోయి, ఆశ్చర్యపోయి, దిగ్భ్రాంతి చెంది.. ఎన్ని పర్యాయ పదాలున్నాయో అవన్నీ పొంది.. విభ్రమతో చూస్తూ ఉండిపోయాను. ఈ లోగా మనకూ కొద్దిమంది ద్రోణాచార్యులు ఉంటారు కదా! ఆ ముందు రోజు క్లాస్‌లో నేను చెప్పిందంతా ఆమె మాట్లాడుతుంటే.. 'అరె! రమ స్పీచ్ ఈమె మాట్లాడుతున్నదేంది?!' అనుకున్నారట. గాంధీ గురించి నేను చెబుదామనుకున్నవి ఇంకేమీ మిగల్లేదు. ఇంక నా బొంద.. నేనేం చెబుతాను? చెప్పినా ఆమె చెప్పిన తరువాత అవే చెబితే నాది కాపీ అవుతుంది. నాకు ఒకటే టెన్షన్! నేనేం చెప్పినా మా టీచర్లు.. 'ఇదేనా నువ్వు నేర్చుకున్నది?' అంటారేమోనని. అంత ఇదిలోనూ నాకు రోజారాణి తెలివికీ, జ్ఞాపకశక్తికీ ముచ్చటేసింది. నాకు ఒక్క ఇరవై నిమిషాలే టైం మిగిలింది. ఒక్క వేలు చూపించి బయటికి వచ్చి.. మాదే కాక పై తరగతులవాళ్ల ఉపవాచకాలు (నాన్ డిటైల్డ్ బుక్స్) కూడా తెచ్చుకుని 'ఝాన్సీ లక్ష్మీబాయి' గురించి కొంత సమాచారం సంపాదించాను. నా జన్మనామం ఝాన్సీ మరి! నా పేరు పిలవడానికి కొద్దిగా ముందు వచ్చి కూర్చున్నాను. నా పేరు పిలవగానే వెళ్లి ఝాన్సీ రాణి గురించి మాట్లాడాను. ఆమె పేరు మనూ తంబే అనీ, యుద్ధవిద్యలు నేర్చుకోవడం, భర్త చనిపోవడం, కొడుకును వీపుపై కట్టుకుని యుద్ధానికి వెళ్లడం.. ఇలా అప్పటికప్పుడు నేర్చుకున్నవన్నీ మాట్లాడేశాను. మొత్తానికి ఏదో 'కలిపి కొట్టరా కావేటి రంగా!' అన్నట్టయింది నా పని. చివరికి నాకు సెకండ్ ప్రైజ్ వచ్చింది. ఆ తరువాత మా అభిమాన గురువు వరదారెడ్డి సార్ నిజనిర్ధారణ జరిపి, విషయమంతా తెలుసుకున్నారు. ఆ అమ్మాయిని పిలిచి మందలించారు. పాపం.. ఆమెకు ప్రైజ్ కూడా రాలేదు. నన్ను పిలిచి.. "ఎందుకురా! అడిగినోళ్లకు, అడుగనోళ్లకుఅందరికీ చెప్పుడు? ఇప్పుడు జూడు, ఆ పిల్ల జెయ్యంగ నీకు ఫస్ట్ ప్రైజ్ రాకుండ బాయె! ఇంకొకసారి జెప్పినవంటే చూడు!" అని కోప్పడ్డారు. నేను ఏమాత్రం పశ్చాత్తాపం చెందకుండా.. "మనకు తెల్సింది నలుగురికి చెప్పాల్నని మీరే చెప్పిను గద సార్!" అన్నాను. "నీ ఖర్మ!" అని తల కొట్టుకున్నాడు ఆయన. మా అక్క రోజారాణికి క్లాస్ పీకిందట. 'ఎహె! నేను రమను ఉత్తగనే అడిగిన! నేను కూడ శాన రాసుకొని నేర్చుకున్న!' అన్నదట. "ఎందుకు చెల్లే! నువ్వు నన్ను పిలిస్తె అప్పుడే దాన్ని మాతోపాటు దూరంగ తీసుకొని పోదును!" అని అక్క నన్ను కూడా తగురీతిలో మందలించింది. నేను అలాంటప్పుడు.. 'స్పీచ్ ఈజ్ సిల్వర్, సైలెన్స్ ఈజ్ గోల్డ్!' సూక్తిని పాటిస్తూ, వీలైనంత అమాయకంగా మొహం పెట్టి మాట్లాడకుండా ఉంటాను.



# దెబ్బకు దెబ్బ



మొగులుమీది పల్లెల ముప్పై ఇండ్లు ఉంటయి. అన్ని ఇండ్లకు ఒక్కటే కిరాణ దుకునం ఉంది. ఆయినె ఆడింది ఆట.. పాడింది పాట.. శెప్పింది ధర.. ఇచ్చిందే మాలు! ఆయినెను మాట అనడానికి లేదు. అట్లని సామాను కొనకుంట ఉండలేరు. ఆని ఇకమతులు.. జోకుట్ల గోల్‌మాల్ అన్ని దెలిశినా.. ఒక్కటే దుకునమాయె! ఊరోల్లంత గప్‌చిప్‌గ ఉందురు. కాదంటె ఉప్పుకారం గౌనాల్నన్నా అడివిలకెల్లి ఆరేడు కోసులు నడిశి పోవాలె. ఆ ఊల్లెనే రాయబోసు అనే ఒక ముసలాయినె గూడ ఉంటుండె. ఆయినెకు జెరంత కండ్లు మస్కమస్క గనిపిత్తయి గని.. సర్వం దెల్శినోడు. సర్వం జూశినోడు. రెండు మూడు బర్లున్నయి.

పాలు, పెరుగు అమ్ముకుంట ఆల్ల కుటుంబం బతుకుతాంది. దీలె పండుక్కు పోలెలు జేసుకుందామని కొత్త కోడలు పిల్ల అడిగితే.. బెల్లం దెద్దామని దుకునంకు వోయిండు రాయబోసు. రాయబోసుకు కండ్లు జరంత మస్కగ కనిపిత్తయని దుకునపాయినెకు దెలుసు. కిలో బెల్లం ఇయ్యిమంట రాయబోసు అడుగంగనే.. కండ్లు కనవడయని ముప్పావు కిలో బెల్లం జోకి, కిలో అంట ఇచ్చిండు. రాయబోసు వోతుంటే.. "తాతా! పండుక్కు ఇంట్ల నెయ్యడుగుతాండ్లు! ఓ కిలో అంత నెయ్యి వంపు" అంట జెప్పిండు. "అట్లనే!" అంట రాయబోసు ఇంటికి వోయి.. నెయ్యి జోక్కోని దెచ్చిచ్చిండు. నెయ్యి గిన్నెను కాంటకేశిన దుకునపాయినె.. "అగో! గిది ముప్పావు కిలోనే ఉంది" అనంగనే, "మా ఇంట్ల బాట్లుగీట్లు ఉంటయా బిడ్డా! నువ్విచ్చిన బెల్లానికే మా కోడలు ఎత్తుగట్టి నెయ్యిచ్చింది. బెల్లం కిలంతుంటె నెయ్యి గూడ కిలంతనే ఉంటది" అంట జెప్పిండు. తేలు గుట్టిన దొంగోలె.. నోరు మూస్కోని రాయబోసుకు పైసలిచ్చిడు దుకునపాయినె.

# ప్రపంచీకరణపై సంధించిన కవితాస్త్రం



అనునిత్యం మనిషిని సమ్మోహనపరుస్తూనే ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నఅతిపెద్ద సమస్య అయిపోయింది ప్రపంచీకరణ. జనజీవితమంతా మెల్లమెల్లగా దాని వ్యామోహపు కోరల్లో చిక్కుకొని దాని ఉక్కు పిడికిలిలో బిగుసుకుపోతూవుంది. ఆది చాప కింద నీరులా ప్రపంచ మంతా ఆక్రమించుకుంటూ వుంటే మనిషి దానికి దాసోహమైపోయి తన అస్తిత్వాన్నే కోల్పోతున్నాడు. ప్రపంచీకరణ ఆవాహనతో మన సంపదే మనకు దూరమైపోతూ వుంది. మన హృదయాల్ని స్పృశించే అనుబంధాలు ఆర్థిక బంధాలుగా మారిపోతున్నాయి. ప్రపంచీకరణ ధాటికి కవిత్వమూ నిరసన వెల్లువవుతోంది. అగ్రరాజ్యాల సామ్రాజ్యవాద దాహానికి చిన్నదేశాలు దాసోహమయ్యే వైనాన్ని అది తూర్పారబడుతోంది. ప్రపంచీకరణ నీడలో మనుగడ సాగిస్తున్న మనిషి జీవితం విలువలు కోల్పోవడాన్ని అది ఎత్తిచూపుతోంది. గ్లోబల్కైజేషన్ ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న జనజీవితాల విషాదాన్నీ, పైకి కనిపించే పూల దరహాసం వంటి మోజులో పడి పతనమైపోతున్న సంస్కృతిని చూసి కవిత్వం కన్నీళ్ళ పర్యంతమై పోతోంది. రోజురోజుకూ సహజ సౌందర్యాలను కోల్పోతూ కృత్రిమత్వాన్ని నింపుకుంటున్న మన పల్లెల దీనస్థితిని అది దృశ్యమానం చేస్తూ ప్రపంచీకరణ పట్ల వుండవలసిన అప్రమత్తతను ప్రమాద హెచ్చరికలా గుర్తుచేస్తూ వుంది. 'భారతదేశం అట్లాంటిక్ మహాసముద్రం మీదికి ఒరిగి పోతోంది' అంటూ మూడు వాక్యాల్లో సామ్రాజ్యవాదపు వికటాట్టహాసాన్ని ధ్వనింపజేశాడు కవివరేణ్యుడు అద్దేపల్లి రామమోహనరావు. సామ్రాజ్యవాద దాహానికి అట్లాంటిక్ మహాసముద్రం ప్రతీక అయింది. మనిషికి ముంచుకొచ్చే ప్రమాదానికి సముద్రం సంకేతమైంది.

'ఇలా వుంటుందనుకోలేదు/ఉరితాడు
ఇంత అందంగా వుంటుందనుకోలేదు
ఒకర్నుంచి ఒకరిని వేరుచేసి
ఇంటినిండా శ్మశానం చేస్తుందనుకోలేదు
అందరం ఒకే ఇంటిలో వుంటాం
ప్రక్కప్రక్కనే కూర్చోనున్నా
ఒకరితో ఒకరం మాట్లాడుకోలేం
ఇల్లంతా పరచుకున్న రంగుల్లో
ఊపిరాడక మునకవేస్తుంటాం'
('ఉరితాడు' ఖండిక నుంచి)

అంటూ ఉరితాడై మానవజీవితాన్ని కబళిస్తూ మనిషి అనుభూతుల్నీ, అనుబంధాల్ని పూర్తిగా తన వశం చేసుకుంటున్న ప్రపంచీకరణ పదఘట్టనల ఉధృతాన్ని వర్ణిస్తాడు వర్తమాన కవి ఆశారాజు. ప్రపంచీకరణ విసిరిన అందమైన సాంకేతికత వలలో చిక్కుకుని విలవిలలాడు తోంది మానవ జీవితం. మన శరీరాలు మాత్రం పక్కపక్కనే వున్నా ఆప్యాయంగా మాట్లాడుకోలేని మన మనసులు మాత్రం ఆ సాంకేతికతకు కనెక్టు అయిపోయి వుంటుంది. మన ఆప్యాయతల్నీ, అనుబంధాల్నీ రంగరంగుల చానళ్ల రూపంలో, ఎన్నో హంగుల సోషల్ మీడియా యాప్‌ల రూపంలో హరించివేయడానికి మనమధ్యే పొంచివుంటుంది ప్రపంచీకరణ. అవును%ొా%దానికి ఉరితాడును మించిన ప్రతీక ఏముంటుంది!? అది మనిషి నిండా కృత్రిమత్వాన్ని, యాంత్రికతనూ నింపేస్తూ అతనిలోని అసల్కైన స్పృహను మాయం చేసేస్తూవుంది. ఆ యాంత్రికతలోనే మనిషి కొట్టుమిట్టాడుతూ మనిషితనాన్నే కోల్పోతూ వుంటాడు. అందుకే మనచుట్టూ అన్నీ వున్నా, మనచుట్టూ అందరూ వున్నా ఎవరూ లేనితనంతో మనం తెచ్చిపెట్టుకున్న శ్మశాన వైరాగ్యాన్ని అనుభవిస్తుంటాం. మనల్ని ఆవహించేసిన టెక్నాలజీలో ఊపిరి తీసుకోవడం కూడా కష్టమైపోతోంది.

'చురుకుదారాలను ఒంటికి చుట్టుకొని
పెరటిబావి దగ్గర జలకాలాడిన
జ్ఞాపకాల ఊట ఒకటుండేది
జీవన వ్యాసార్థాలకు అటూ ఇటూ
గంటలమోతలేని రెక్కల విహారం
పక్షుల్ని కర్ణభేరీలకు తగిలించుకొని
లోపలి లోకాన్ని మేల్కొలిపే ప్రభాతగానం
కావిట్లో తెచ్చిన చెరువు చేవ్రాలును
వసారాలో మట్టికుండతో అనుసంధానించే విన్యాసం
ఒకటుండేది ఒకటుండేది ఒకటుండేది'
('చాలా ఒకట్లుండేవి' ఖండిక నుంచి)

ఎన్నెన్నో అందాల్ని పొలికించిన, ఎన్నెన్నో మధురానుబూతుల్ని అందించిన జ్ఞాపకాలు ప్రపంచీకరణ ఉచ్చులో చిక్కుకొని క్రమంగా మాయమైపోతూ పురాజ్ఞాపకాలుగా మిగిలిపోవడాన్ని గుర్తుచేసుకుంటాడు వర్తమాన కవి ఎమ్వీ రామిరెడ్డి. పెరటిబావి, మనసులో రాగాల్ని పలికించే పక్షుల ప్రభాతగానం, మట్టికుండ ద్వారా మన వొంటినిండా ఆరోగ్యాన్నందించే చెరువు చేవ్రాలు%ొా% ఇప్పుడు ఈ పల్లె సౌందర్యాలన్నీ పురాజ్ఞాపకాల్కై పోతున్నాయి. ఆ జ్ఞాపకాల కోసం మనిషి పదేపదే పలవరించే క్షణాలు దాపురించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఆ పల్లెలోని పచ్చని పొలాలు కాలుష్యాన్ని వొంటినిండా నింపుకొనే ఫ్యాక్టరీలుగా మారిపోతున్నాయి. ప్రపంచీకరణ ఒక అదృశ్యశక్తిలా మనిషి నుంచి అందమైన జీవితాన్ని వేరుచేసేస్తూ వుంది. అతడి పలుకుకూ, కులుకుకూ, ఆఖరికి అతడి పూర్తి బతుకుకూ కృత్రిమత్వపు నాజూకుతనాన్ని తొడిగేస్తూవుంది. అతడిలోని అసల్కైన మనిషితనాన్ని కడిగేస్తూవుంది. ఆ దృశ్యాల్ని చూసి కవిత్వం కొండంత ఆవేదనను వెళ్లగక్కుతూ పూలకీ, ప్లాస్టిక్ పూలకీ గల తేడాను విడమరచిచెబుతోంది. అది మనిషి మనుగడను ప్రశ్నిస్తూ ఒక బృహత్తర బాధ్యతతో చైతన్యవాహికై అనేక హెచ్చరికలు చేస్తూనేవుంది.

## డిసెంబ్రిష్టుల స్ఫూర్తిలో

ప్రపంచ చరిత్రలోనే రెండున్నర రోజుల్లోనే విప్లవం విజయవంతం చేసుకున్న ఘనత బొల్షివిక్లది. కానీ రష్యా విప్లవం విజయవంతం కావడానికి ముందు వందేళ్ల చరిత్ర పేజీలను తిరగేస్తే తప్ప ఇది పూర్తిగా అర్థం కాదు. ఆ పుటల్లో బోల్షివిక్‌లకు ముందు నరొడ్నిక్‌లు కనపడతారు. వారికంటే ఇంకా ముందుకెళ్తే డిసెంబ్రిష్టులు కనపడతారు. వారి తిరుగుబాటు, వారు పడ్డ కష్టాలు, ఆ తిరుగుబాటుదారుల భార్యలు చేసిన సాహసోపేతమైన పాత్ర కనపడుతుంది. అలాంటి డిసెంబ్రిష్టుల గురించి సంపూర్ణంగా వివరించిన మొదటి తెలుగు ప్రయోగాత్మక నవల ఈ "డిసెంబ్రిష్టు ఖైదీ". ప్రజల కలను కనడమే విప్లవకారుల నేరం.

ఆ నేరానికి జార్లు వేసే శిక్షలు భరించలేనంత బాధగా వుంటాయి. ఎట్లంటే రైతులు బానిసత్వం నుండి విముక్తి కావాలని సేర్గీ ఆశయంగా పెట్టుకున్నాడు.అందుకు తన పాత్రను క్రియాశీలకంగా పోషించాడు. ఒక గొప్ప తిరుగుబాటు వల్ల తనకు జైలు శిక్ష పడిరది. అంతకుముందే సేర్గీ సైనిక జనరల్ కదా, ఆయనకు పడ్డ శిక్ష మామూలు శిక్ష అనుకుంటే పొరపాటే. ఆయన్ని రష్యాకు చాలా దూరంగా సైబీరియాలో పడేశారు. అప్పటికే ప్రభు వంశ రాకుమారి మరియతో తన పెళ్లి అయ్యి కొడుకు కూడా ఉన్నాడు. ఆ మరియ తన భర్త కోసం వెళ్తూ వేల టన్నుల దుఃఖంతో జ్ఞాపకాలను నెమరేసుకుంటుంది. ఈ వలపోతతోనే నవల మొదలౌతుంది.

మరియ పాడిన సొనటాల వింటూ సేర్గీ మైమరిచాడు. అట్లనే స్పష్టమైన విషయ అవగాహన కలిగిన సేర్గీనీ మరియ ప్రేమించింది.వారి ముచ్చట్లు ప్రధానంగా సాహిత్యం, కళలు, జార్ల నిరంకుశత్వాన్ని గురించి సాగేవి.సేర్గీ ఒక అడుగు ముందుకేసి జార్ల తీరు మారాలంటే ఏం చేయాలో చెప్పేవాడు.అది మరియకు ఆసక్తికరంగానూ,కొన్నిసార్లు భయంగానూ అనిపించేది. అందుకేనేమో భర్త అంటే ఇష్టాన్ని రెట్టింపుగా పెంచుకుంది. ఇంకా భర్త సేర్గీ గురించి చెప్తూ %ొా%సైనిక జనరల్ గా వున్న సేర్గీ అతని మిత్రులు బోరోధిన్ యుద్ధం ముగిశాక కోసాక్కు రైతుల ఇండ్లల్లో బస చేశారు.అప్పుడే ఈ బానిస రైతులను ఆచరణను చూసి చైతన్యమయ్యారు.వారి పోరాటాల వల్లనే రష్యా నెపోలియన్ తో జరిగిన అనేక యుద్ధాల్లో గెలవగలిగిందనీ గుర్తు చేసుకున్నారు.కానీ నేటికీ ఈ రైతులు, పేదలు మాత్రం ఇంకా బానిసత్వంలో మగ్గుతుండడం చూసి చలించి తన మనస్సులో దృఢమైన ఆశయాన్ని ఏర్పరుచుకున్నారు.ఇంకా సైనికుల పట్ల కూడా చిన్నచూపు కలిగిన జార్ల ను వ్యతిరేకించడం పనిగా పెట్టుకున్నారు.

"దేశ ప్రేమికునికేం జరుగునో తేలుతుంది ఇకముందు/ ఎవరి దాడి ఫలించునో శత్రువులపై మునుముందు. నిరంకుశ పాలకుడే లక్ష్యం నా యందు" అని ఓ కవి రాసిన కవిత ను మరియకు తన మార్పుకు కారణంగా వినిపిస్తాడు.సాహిత్యమంటే ఇద్దరికీ ఇష్టం.

ఇంకా సాహిత్యం గురించి చెప్తూ "సాహిత్యం మన జీవితాల్ని విశాలంగా చేస్తుంది,కేవలం స్వార్థ బుద్ధితో జీవించే జనం ఆలోచనల్ని, సాహిత్యం విశాలంగా ఆలోచించడం నేర్పుతుంది" అని చెప్తాడు.

ఇంతటి విశాల దృక్పథం కల్గిన సేర్గీ ఏం చేశాడు. ఆయన ప్రభు వంశ మిత్రులను కలిశాడు,కొందరు రైతు సైనికులను కలిశాడు. వారితో బానిసత్వ రద్దుకు జరిగే తిరుగుబాటులో భాగమవ్వాలని నిర్మాణాలు చేసేవాడు.భిన్నాభిప్రాయాలు తలెత్తిన చోట తన వాగ్ధాటితో పరిష్కరించేవాడు. ఆ విధంగా రక్షణ సంఘం, సంక్షేమ సంఘం గానూ, అది మళ్ళీ ఉత్తరాధి సొసైటీ, దక్షిణాది సొసైటీలు గాను మారి చేసిన కృషిని వివరిస్తాడు.వారిలో తలెత్తిన రాజ్యాంగ రహిత రిపబ్లికనిజం,రాజ్యాంగ సహిత రిపబ్లికనిజం గురించి సిద్ధాంత చర్చ చేసి ఎక తాటిపైకి తేవడంలో,యుక్రెయిన్ లోని విప్లవ సంస్థలను వాటి ఐక్యత కోసం తను, పెస్తేల్ చేసిన కృషిని గురించి చెప్తాడు. నిర్మాణాత్మకంగా ఇంకా బలపడక ముందే,తమ తదుపరి కార్యాచరణపై అందరూ ఒక స్పష్టమైన అవగాహనతో రాకముందే అనుకోని సందర్భంలో ఒక తిరుగుబాటు చేశారు.ఇందులో నాయకత్వం వెనుకడుగు వేసింది.ఐనా తమకు జార్లు పట్ల వున్న వ్యతిరేకతతో కొందరు ముందుకెళ్ళి వీరత్వంతో పోరాడారు.మొట్ట మొదటి సారి గానీ కొద్ది క్షణాల్లో దేశం ప్రజల పరం కాబోతుందనుకునే దశలో కథ అడ్డం తిరిగింది.తిరుగుబాటు విఫలమైంది.జార్ నికోలస్ ఆ సైనికులందరిని సైబీరియా జైల్లో బంధించాడు.ఐదుగురికి అతి దారుణంగా ఉరి శిక్ష విధించాడు.పరిస్థితులు తారుమారయ్యాయి.కట్టు బట్టలతో సేర్గీ అరెస్ట్ అయ్యాడు. జీవిత ఖైదు పడిరది.

ఈ వార్త తెలిసి మరియ తల్లడిల్లింది.తన భర్త ఇక తిరిగిరాడని మరో పెళ్లి చేసుకొమ్మని మరియ నాన్న, కుటుంబీకులు వేధించసాగారు.కానీ వాటిని ఎదురించి మరియ సేర్గీ కోసం బయలుదేరుతుంది.తన కష్టంలోను భాగమవుతానంటుంది. తనకోసం ఐదు వేల మైళ్ళ దూరం దాటి జైల్లో చావు బతుకుల్లో వున్న తన భర్తను చేరింది.మళ్ళీ నూతనంగా తనలో ప్రాణాన్ని నింపింది.బతకాలని ఆశను రగిల్చింది. అందుకే సేర్గీ తన ఆశయాన్ని గుర్తు చేసుకున్నాడు. అందుకు మరియనే కారణమని నిత్యం గుర్తు చేసుకున్నాడు. ఆమె వచ్చిన తర్వాత మరెందరో వారి భర్తల కోసం వచ్చారు.

తమ అస్థిత్వము వదులుకొని భర్తల కోసం అక్కడికి వచ్చిన వారిని కూడగట్టి నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో, సౌకర్యాలను కలిగించడంలో, బట్టలను అందించడంలో, అక్కడి నుండే మాస్కో, సెయింట్ పీటర్స్ బర్గ్‌లో వున్న తమ మిత్రులకు బంధువులకు ఉత్తరాలు రాసి డబ్బును సేకరించి వారి భర్తల అవసరాలను తీర్చేవారు. ఖైదీల హక్కులను కాపాడడం ప్రభుత్వాల బాధ్యత. కానీ అది పట్టించుకోకుండా వారికి ఎలాంటి సౌకర్యాలు ఇవ్వకుండానే ఇనుప గనుల తవ్వకం, వెండి గనుల తవ్వకంలో టార్గెట్లు పెట్టి మరి వేధించే వారు. ఆ సందర్భంలో ఈ డిసెంబ్రిష్టుల భార్యలు అందించిన సేవల వల్లనే వాళ్ళు ప్రాణాలతో బయట పడగలిగారు. ఇది భార్యలు చేసిన పోరాటం. చరిత్ర పేజీల్లో వీరి కృషి గొప్పది.

సేర్గీ మరో రూపం ఇంకా ఆశ్చర్యపరుస్తోంది. ప్రభు వంశ సైనిక జనరల్‌గా, ప్రేమికుడిగా, తిరుగుబాటుదారుడిగా, ఖైదీగా, చివరగా రైతుగా మారిన తీరును చూస్తాం. జైలు జీవితం తర్వాత మళ్ళీ ప్రవాస జీవితం గడపాలని జార్ వేసిన శిక్ష. అందుకు తను యురిక్ గ్రామంలో రైతుగా మారాడు. కూరగాయలను పండిరచడం, బంగాళాదుంపలు, దోస కాయలు, పుచ్చకాయలు, గోధుమ పంటలు పండిరచడమే కాదు. అధిక దిగుబడులను తెచ్చేలా విత్తనాలను తయారుచేశాడు. తన జీవితం చివరాఖరకి చేరుతుండగానే రష్యాలోనే కాదు యావత్ యూరోప్ అంతటా స్వేచ్ఛ, స్వాతంత్ర్య పోరాటాలు మొదలుపెట్టాయి. రష్యాలో కూడా ఆయా వర్గాల జాతుల ఆకాంక్షలతో ఉద్యమాలు పెల్లుబుకాయి. వ్యవసాయ సోషలిజం అంటూ నరోధ్నిక్‌లు వచ్చారు. జార్లను చంపడమే పనిగా పెట్టుకున్న వీరిలో నుండే "భూమి పంపిణీ జరగాలని, ఊహాజనిత సోషలిజం కాదు శాస్త్రీయ సోషలిజం వైపు నడవాలని అది మార్క్సిజంలో వుందని ప్లేహనొవ్ వచ్చాడు. తొలి మార్క్సిస్ట్‌గా పరిచయమై తన భావజాలాన్ని రష్యాలో వ్యాప్తి చేస్తూ నరోధ్నిక్‌ల నుండి రెండో పాయను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో రష్యాలో వర్గాలు ఏర్పడుతాయి. రైతులు, కార్మికులు విప్లవ శక్తులుగా ఏర్పడుతాయి. ఇది గమనించిన లెనిన్ కార్మిక వర్గ విముక్త పోరాట సంఘం పెట్టీ అనేక కార్మిక వర్గ పోరాటాలు నిర్వహిస్తాడు. ఇస్క్రా పత్రికతో ప్రజల,కార్మికుల ఆశయాలను బలంగా వినిపిస్తాడు.తన రచనలతో మార్క్సిజాన్ని విప్లవం దిశగా నడిపిస్తాడు. పెట్టుబడి దారీ వ్యవస్థ యొక్క అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదాన్ని బోల్షివిజంతో ఓడిరచి రష్యాను విప్లవ పథంలో నడిపిస్తాడు.

ఈ పోరాటం వెనుక డిసెంబ్రిష్టుల త్యాగం వున్నదని ఆ వీరుల పోరాటాలను స్మరించుకోవాలని లెనిన్ డిసెంబ్రిష్టుల గురించి మాట్లాడడం మనస్సును చైతన్యపరుస్తుంది. ఈ నవలలో మరి కొన్ని వీరోచిత గాథలు,ఎన్నెన్నో మనస్సును మెలిపెట్టే సంఘటనలు, బంధాలు వున్నాయి. ఈ తరం కూడా రష్యా చరిత్రను సులభంగా అర్థం చేసుకునేలా వుంటుంది. ప్రజల్లోకి చేరిన ఏ ఉద్యమం ఐనా విజయం సాధించక తప్పదు. దానికోసం గత గుణపాఠాలు స్వీకరించడంలో, తగిన ఎత్తుగడలు నిర్మించడంలో నాయకత్వ పటిమ అవసరం. అందుకు సరైన అధ్యయనం అనివార్యం. ఇలాంటి రచనలు ప్రతి తరానికి అవసరం. ఆయా కాలాల్లో అవసరమైన చోట డిసెంబ్రిష్టుల స్ఫూర్తిని కొనసాగించవల్సిందే.

## సాహిత్యం ప్రపంచీకరణ అమానవీయతను




సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ మన జీవితాల్లోకి చొచ్చుకొని వచ్చి మనకు తెలియకుండానే మనల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈనాటి జీవితాలని దాన్ని నడిపిస్తున్న చలన సూత్రాలను అర్థం చేసుకోవడం కష్టం. అర్థం చేసుకుని వీటిని కథలుగా మలచుకోవడం మరీ కష్టం. అందుకని సమాజం గురించే కాకుండా, ఆ సమాజం వెనుక ఉన్న శక్తుల్ని గురించి కూడా తెలుసుకోవడం అవసరం. సామాజిక బాధ్యతను గుర్తించిన రచయితలు మాత్రమే అలాంటి కథలను రాయగలరు. ఇలాంటి రచయితల్తో వివిన మూర్తి ఎప్పుడూ ముందు వరుసలో ఉంటాడు.

ఇతర రాజ్యాల మీదికి దండయాత్ర చేసి వారిని నిర్మూలించి, తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడంతో సరికొత్త నాగరికత వెలిసిందని చరిత్రకారులు నమోదు చేస్తారు. కానీ దాని వెనుక ఉన్న అన్యాయం, అమానుషం, ఘోరమైన హత్యాకాండ కనిపించకుండా పోతుంది. చరిత్ర ఎప్పుడూ విజేతల పక్షానే నిలుస్తుంది. ఎప్పటికప్పుడు కొత్తగా కనిపెట్టిన ఆయుధాలు విజయాన్ని, ఆధిక్యతను తెచ్చి పెడతాయి. నీ ఆయుధమే నాగరికత. నీకు గిట్టని వాళ్ళని అనాగరికులని, దుర్మార్గులని, ప్రజా కంటకులనే పేరుతో తరిమేయవచ్చు. నాశనం చేయొచ్చు. అనాది నుంచి ఇదే కొనసాగుతోంది. ఆర్యుల దండయాత్ర మొదలు మహాభారతంలోని ఖాండవ దహనం వరకు ఎన్నో ఉదాహరణలను చూడొచ్చు. ఆధునిక కాలంలో ప్రపంచంలోనే అజేయ శక్తిగా రూపొందిన అమెరికా రాజ్య స్వభావంలో, వియత్నాం మొదలుకొని ఇరాక్‌పై చేసిన దండయాత్రలలో ఇదే యుద్ధ నీతి కనబడుతుంది. ఒకప్పుడు మతం కోసం జరిగిన యుద్ధాలు ఇప్పుడు వనరుల దోపిడి కోసం జరుగుతున్నాయి. ఇది అందరికీ తెలిసినా తెలియనట్టే నటించడం ఓ విషాదం. ఈ వ్యంగ్య కథనాన్ని 'కృష్ణ స్వప్నం' కథలో చూడవచ్చు. రాజులు పోయినా, నియంతలు మారినా, ప్రజాస్వామ్యం వచ్చినా దోపిడీ నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. బలవంతుడు బలహీనుడిని దోచుకుంటూనే ఉన్నాడు. పాలకులు, పీడితులు అనే స్పష్టమైన విభజనను ఇప్పుడు మనం చూడవచ్చు. మేకలు ప్రజలు. అధికారం, నాయకత్వం ముసుగు వేసుకున్న దోపిడీదారులు పులులు. పులులను, మేకలను ఒకే రేవులో నీరు తాగించడం అసంభవం. కాలం మారుతున్న కొద్దీ, అభివృద్ధి జరుగుతున్న కొద్ది దోపిడీ స్వభావం మారుతుంది. రకరకాల రూపాల్లో దోపిడీదారులు బయలుదేరుతారు. మేకల తరఫున నాయకత్వం వహించిన వాళ్లు పులులతో రాజీ పడతారు. లేదా లోపాయికారీగా కలిసిపోతారు. స్వాతంత్రం రావడం అంటే అధికార మార్పిడి జరగడమే. పీడనకు తెల్లదొరలు పోయి నల్ల దొరలు వచ్చారు. స్వపరిపాలన, అభివృద్ధి, దేశభక్తి పేరిట ప్రజలను ఏమార్చి వాళ్లను దోచుకోవడం మరింత సులభతరమైంది. మేల్కొన్న ప్రజలు వాళ్ళ నాయకులను వాళ్లే తయారు చేసుకుంటాం అనడంతో కొత్త శకం ప్రారంభం అవుతుందనే ఆశావాదంతో 'సమవర్తి' కథ ముగుస్తుంది.

వలసలు, ఆక్రమణలు, యుద్ధాలు చేసి సామ్రాజ్యవాదం విస్తరించింది. ఇప్పుడు ఇతర దేశాలకు వెళ్లి యుద్ధాలు చేసి, ఆ దేశాలను పరిపాలించాల్సిన అవసరం లేదని డబ్బు బలంతో, ఇతర దేశాలను రిమోట్ కంట్రోల్ పద్ధతిలో చాలా సులువుగా పరిపాలించవచ్చని నూతన సామ్రాజ్య వాద దేశాలు తెలుసుకున్నాయి. వాళ్ల పెట్టుబడిదారీ తత్వాన్ని ప్రోత్సహించడానికి, ప్రచారం చేయడానికి అంతర్జాతీయ సంస్థలు ఏర్పడ్డాయి. సామ్రాజ్యవాదం యొక్క తత్వం మారిపోయి ప్రపంచీకరణ పేరుతో ముందుకు వచ్చింది. దీనివల్ల దాదాపు 150 సంవత్సరాలు పోరాడి కార్మికవర్గం సాధించుకున్న అన్ని హక్కులూ పోయాయి. దాదాపు అన్ని ఉత్పత్తి రంగాలూ ప్రైవేటు పెట్టుబడిదారుల చేతుల్లోకి మళ్లాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుకు, కార్మికులకు మధ్య ఉన్న సంబంధాల గురించి 'పాడుకాలం' నవలిక చర్చిస్తుంది. వారిద్దరి మధ్య ఉన్న శత్రు వైరుధ్యాలను వివరిస్తుంది. మీనాంబికా ఇండిస్ట్రీస్‌కు కొత్తగా మేనేజర్‌గా వచ్చిన గంగూలీకి, పాత మేనేజర్ అంబలగన్‌ను కార్మికులు చితకబాదితే, వాడు పారిపోగా ఆ పోస్ట్ తనకిచ్చారని తెలుసు. ముందుగా కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలనుకుంటాడు. ఫోర్‌మెన్లను, ఇన్చార్జీలను పిలిచి కార్మికులను కంట్రోల్ చేయాల్సిన బాధ్యతను గుర్తు చేస్తాడు. పదిమంది సూపర్వైజర్‌లను బాగా చూసుకుంటే వాళ్ళు 1200 మందిని పిండి పనిచేస్తారని అతని నమ్మకం. కార్మికులను మచ్చిక చేసుకోవడానికి ఓటి పద్ధతిని ప్రవేశపెడతాడు. ఓటి మీద యజమాని గంగోలిని ప్రశ్నిస్తే 'కార్మికుడు ఓటీ ఆశతో మామూలు సమయంలో రికార్డు పని చేయించగలిగితే మనకి లాభం కాదా! ప్రపంచంలో ఏం జరుగుతున్నది తెలుసుకునే సమయంలో కూడా రోజుకి 12 గంటలకు పైగా ఫ్యాక్టరీలో ఉంచితే మనకి లాభం కదా. వాళ్లని జీతభత్యాల కోసం మాత్రమే పోరాడేవాళ్లుగా మార్చడంలో ఆధునిక పెట్టుబడిదారుడు ఎంత విజయం సాధించాడో, వాళ్లని ఎన్ని గంటలు కట్టిపడేసి మరమనుషులుగా మార్చడంలోనూ అంత విజయం ఉందని' నచ్చ చెబుతాడు. కార్మికులు డబ్బుల కోసం పడే పాట్లు, తాగుడు లాంటి అలవాట్లతో ఇంటిని సరిగా నడప లేకపోవడం– అప్పులు, చీటీలు, తాగుడు గొడవలు, ఓటీలు, ప్రమోషన్లకై చేసే ప్రయత్నాలను ఇలా కార్మికులకు సంబంధించిన అన్ని విషయాలను ప్రస్తావిస్తూ వివిన మూర్తి ఈ నవలిక రాశారు. సరళీకృత ఆర్థిక విధానాలు కార్మికుల జీవితాల్ని అతలాకుతలం చేశాయి. ప్రైవేటైజేషన్ శరవేగంగా అమలవడంలో పెట్టుబడిదారుల దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మారుతీ కంపెనీ ఉద్యోగస్తులు ప్రైవేటైజేషన్ ప్లాన్స్‌ని వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తుంటారు. దానిపై రామోస్ మోటార్స్ జనరల్ మేనేజర్ గంగూలీ మాట్లాడుతూ... ఎంప్లాయిస్‌కి ఉద్యోగ భద్రత మీద ఆందోళన సహజం. అయితే ప్రైవేటు పరిశ్రమల కింద మాత్రమే బతకతప్పదని వారు గ్రహిస్తారు.

## వాళ్లకి కావాల్సింది అదే..!



ఆదివాసులు అడవులు విడిచి పోవాలి
రైతు భూమి విడిచి పోవాలి
వ్యవసాయం కనుమరుగై పోవాలి
వాళ్లకి కావాల్సింది అదే..!
గ్రామ గ్రామాలు ఖాళీ అయిపోవాలి
కూలీలు వలసలు పోవాలి
చేనేత కార్మికులు చెదిరిపోవాలి
కార్మిక హక్కులు కాల రాయాలి
వాళ్లకి కావాల్సింది అదే..!
కడలి పుత్రులు కనుమరుగై పోవాలి
చేతి వృత్తుల వారు చితికి పోవాలి
చిన్న చిల్లర వ్యాపారస్తులు
నష్టాల ఊబిలో కూరుకు పోవాలి.
వాళ్లకి కావాల్సింది అదే..!
ఉపాధికై వెతుక్కోవాలి
యువత ఉన్న ఊరు వదిలి పోవాలి
నిరుద్యోగం ఆత్మహత్యలు పెరిగి పోవాలి
వాళ్లకి కావాల్సింది అదే..!
విద్యా, వైద్యం, వ్యాపారమై పోవాలి
బాల్యం బందీ అయిపోవాలి
వికాసం క్షీణించిపోవాలి
వాళ్లకి కావాల్సింది అదే..!
అజ్ఞానం, మతత్వం పెరిగిపోవాలి
మనుషుల్లో లౌకికతత్వం తగ్గిపోవాలి
కుల, మత, ప్రాంతీయ తత్వాలు పెరిగిపోవాలి
వాళ్లకి కావాల్సింది అదే..!
ఓటుకు నోటు రాజ్యంలో
అవినీతి, కుంభకోణాలతో
స్విస్ బ్యాంకు ఖాతాలు
డబ్బులతో నిండిపోవాలి
మా ఏలుబడి దశాబ్దాల తరబడి సాగిపోవాలి
కూడు, గూడు, గుడ్డ
విద్య, వైద్యం, ఉపాధి కావాలని నిలదీస్తే..
మా పాలనపై నిందలు వేస్తే.. ఎదిరిస్తే ..ఉద్యమిస్తే ..
ఉద్యమకారులు జైల్లో మగ్గిపోవాలి
వాళ్లకి కావాల్సింది అదే..!
వాళ్లకి కావాల్సింది అదే..!

## సూర్యుడు పూసే కాలం

తొంగి చూడు కిమ్మనక
చూడు చూస్తూ ఉండు చాలాసేపు
ఏదో తీగలా ఏ విశ్వాంతరాళంలోంచి
వచ్చి పడుతుంది మదిలో
అల్లుకుపోతుంది మెల్లిగా నరాల్లో
కాసేపు నాట్యం ఆడి ఒక రూపాన్ని
వెలుగులోకి తెస్తుంది
దాన్ని చేత్తో తాకకు
హదయానికి కిరీటంలా చుట్టు!
పాట పాడు బాటలో వెళ్తూ వెళ్తూ
మధ్యాహ్నాలు ఒకలా రాత్రులు ఒకలా
అన్ని గుమిగూడి వస్తుంటాయి
అవన్నీ నీ లోపలవే నీ లోలోపలివే
ఎవరెవరో నేర్పినవి నూరిపోసినవి!
ఇక ఆగి ఒక మేకపిల్లకు
కొమ్మల లేత ఆకులు తినిపించు
రాలిన పళ్ళను ఏరుకొని
నువ్వూ సేద తీరు
తల కింద కళ్ళు పెట్టుకుని...
మళ్ళీ ఏదో తడుతుంది
ఏదో తగులుతుంది
టక్కున మెదలాడుతుంది
అప్పుడు లేచి సమకూర్చుకుంటావు!
ఆ అల్లికలను నిశితంగా
ఒక్కొక్కటిగా నెమరు వేసుకోవడం
మలచడం ఆకారంగా
వాటి నుంచి ఇంకోదాన్ని
తీసుకురావడం సృజించడం...
ఎన్నో చుట్టూ కనిపించవు
తిరుగాడుతున్నప్పుడుజి
కేవలం చక్షువులకు
గుడ్లు పొదగబెట్టినట్టు



పెట్టాలి వెచ్చగా వాటిని
అవి నారు కావాలి
వాటికి సూర్యుడు పూయాలి!
ఎన్ని గడపలు దాటిపోతావు
ఏ సముద్రాలు ఈదుతావో
కాలాన్ని పయ్యెలా చేసుకుని తిరుగుతూ
స్థలాన్ని కప్పుకుని ధకొడుతూ
సౌరమండల వదనంపై.. కాంతి వేగంతో!!

# కూచిపూడి.. నా మెడిటేషన్!

**పడమటి సంధ్యారాగాన్ని తూర్పు దాకా వినిపించేలా చేసేవీ.. ఇక్కడి మువ్వల సవ్వడిని అక్కడికి ప్రతిధ్వనింపజేసేవీ సంస్కృతి, కళలే. విదేశాల్లో పుట్టి పెరిగినా,తెలుగు పిల్లల్లో మనం భారతీయులమనే భావన తప్పక ఉంటుంది. దాన్ని కొనసాగించేందుకు తనదైన రీతిని ఎంచుకుంది.. మేధా వరేణ్యలక్ష్మి కొణికి. అమెరికాలో అడుగులు నేర్చుకుని, తెలంగాణ గడ్డమీద అరంగేట్రం చేసిన ఈ తెలుగు అమెరికన్ తన సాధనా సంగతుల్ని పంచుకుందిలా..**





అమ్మ, నాన్న తెలుగు నేల నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడ్డారు. నేను పుట్టి పెరిగింది అమెరికాలో. ప్రస్తుతం హ్యూస్టన్‌లో డిగ్రీ మూడో ఏడాది చదువుతున్నా. నా ఐదారేండ్ల వయసులో.. స్నేహితులు, బంధువుల పిల్లలు భారతీయ నృత్యాలను నేర్చుకోవడం చూసి నేనూ నేర్చుకుంటానని అమ్మను అడిగాను. అప్పటి దాకా నేను చూసిన డ్యాన్సులకు భిన్నంగా ఉండటం వల్ల నన్ను ఆకట్టుకొని ఉండొచ్చు. అలా ఆరేండ్లప్పుడు భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించా. కానీ ఆ మాస్టారు మరో ప్రాంతానికి వెళ్లిపోవడంతో ఏడాదిలోపే సాధన ఆపేయాల్సి వచ్చింది. తర్వాత కూచిపూడి నృత్యాన్ని నేర్చుకునే వీలు కలిగింది.

**గురువు ప్రధానం**

మన ఆసక్తితో పాటు, నాట్యాన్ని ఇష్టంగా నేర్పే గురువు దొరకడమూ అదృష్టమే. అప్పుడే సాధన సక్రమంగా సాగుతుంది. మన నాట్యం నలుగురూ మెచ్చేలా వన్నెలీనుతుంది. అలాంటి గురువు పదేండ్ల క్రితం నాకు దొరికారు. ఆయనే రాఘవ (వేదాంతం వెంకటరామ రాఘవయ్య) మాస్టారు. కూచిపూడి నాట్యానికి పుట్టినిల్లు అయిన కూచిపూడి గ్రామానికి చెందిన వారు. ఉద్యోగ నిమిత్తం అమెరికా వచ్చినా, వంశపారంపర్యంగా అబ్బిన కళను వదిలిపెట్టకుండా.. నలుగురికీ నేర్పుతున్నారు రాఘవ మాస్టారు దంపతులు. తన తండ్రిగారితో పాటు కూచిపూడి నాట్యంలో లబ్ధప్రతిష్ఠులైన పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యంలాంటి దిగ్గజాల దగ్గర మాస్టారు నృత్యసాధన చేశారు. అలా రాఘవ మాస్టారు సారథ్యంలో కూచిపూడి నేర్చుకుంటూ అమెరికాలోని పలు కార్యక్రమాల్లో గజ్జెకట్టి కాలు కదిపాను. హ్యూస్టన్ తెలుగు కల్చరల్ అసోసియేషన్ వారి నాట్య సభల్లో కల్యాణ శ్రీనివాసం, శ్రీరామకథాసారంలాంటి రూపకాల ప్రదర్శనలో భాగమయ్యాను. చిన్నప్పటి నుంచే అమెరికాలోని చిన్మయ మిషన్‌కు వెళ్లేదాన్ని. అక్కడ భారతీయ సంస్కృతి గురించి చెబుతారు. భగవద్గీత బోధిస్తారు. రామాయణాది ఇతిహాసాలు పరిచయం చేస్తారు. అక్కడ నా కింది తరగతుల విద్యార్థులకు నేను రామాయణ కథలు చెబుతాను. అది నాకు చాలా సంతోషంగా అనిపిస్తుంది. పురాణ కథలతో పాటు యోగా, మెడిటేషన్ లాంటివి నన్ను ఆకర్షిస్తాయి. సంగీతమన్నా ఇష్టమే. వయొలిన్ తరహాలో ఉండే వయోలా పరికరాన్ని చక్కగా వాయిస్తా. నా కళా సాధనకు మా అమ్మానాన్నలతో పాటు మా తాతయ్య వనం జ్వాలా నరసింహారావు గారు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తారు. ఆయన శ్రమజీవి. ఈ వయసులోనూ సాహిత్య సంబంధంగా ఏదో ఒక పనిచేస్తూనే ఉంటారు. తాతయ్య నుంచి నేను కష్టపడేతత్వాన్ని అలవరచుకున్నాను. నాట్యం మెడిటేషన్ లాంటిది. ధ్యానం చేస్తున్నప్పుడు పొందే ప్రశాంతతను నృత్యాన్ని సాధన చేసేప్పుడూ అనుభూతిస్తాం. అందుకే, నేను నాట్య సాధనను అమితంగా ఆస్వాదిస్తాను.

**సాధన నిరంతరం**

తెలంగాణ ప్రాంతం కళల్ని ప్రేమిస్తుంది. అందుకే ఈ గడ్డ మీద అభిమానం, నా సొంత వాళ్లున్నారన్న అనురాగంతో హ్యూస్టన్ నుంచి వచ్చి హైదరాబాద్ రవీంద్రభారతిలో అరంగేట్రం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఉషా పరిణయం నృత్య రూపకాన్ని ఇక్కడ ప్రదర్శించాను. 'నేను చివరిదాకా పూర్తిగా చూసిన తొలి అరంగేట్రం నీదే%%%' అంటూ అక్కడికి వచ్చిన వాళ్లలో ఒకరు ఇచ్చిన ప్రశంస ఎంతో సంతోషాన్ని కలిగించింది. నాట్యాన్ని కెరీర్‌గా ఎంచుకుంటానా లేదా అన్నది మరికొంత కాలం గడిస్తే కానీ చెప్పలేను కానీ, ఈ సాధన మాత్రం నిరంతరం కొనసాగిస్తానని మాత్రం చెప్పగలను. ఒకసారి ఆస్వాదించడం మొదలు పెడితే వదిలిపెట్టలేకపోవడమే భారతీయ నృత్యరీతుల్లోని గొప్పతనం!

# కొత్త ఉద్యోగమా?



కొలువుల జాతరలు జోరందుకున్నాయి. క్యాంపస్, ఆఫ్ క్యాంపస్ నియామకాలు వేగంగా జరిగిపోతున్నాయి. అందులో అరవైశాతం అవకాశాలు అమ్మాయిలనే వరిస్తున్నాయి. తొలి ఉద్యోగం కెరీర్‌లో తొలి మలుపు. జాగ్రత్తగా అడుగువేయాలి. ఆఫర్ లెటర్‌కు ఆమోదం తెలిపేముందు గుర్తుంచుకోవాల్సిన కొన్ని విషయాలు..

- కంపెనీ చరిత్ర తెలుసుకోండి.

ప్రస్తుత, పూర్వ ఉద్యోగులతో మాట్లాడండి.జీతభత్యాల వివరాలు తెలుసుకోండి. మొహమాటం లేకుండా సందేహాలన్నీ తీర్చుకోండి.విదేశాలలోని క్లయింట్స్ కోసం పనిచేయాల్సి ఉంటే.. ఆయా దేశాల టైమ్‌జోన్‌ను దృష్టిలో పెట్టుకోండి.కచ్చితంగా ఇన్ని సంవత్సరాలు పనిచేయాల్సిందే.. తరహా నిబంధనలు ఏమైనా ఉన్నాయేమో ఆరాతీయండి.

పనిగంటలు, ఆఫీసు వేళలు, అదనపు భత్యాలు, బోనస్ తదితర విషయాల్లో కంపెనీ పాలసీ ఏమిటో తెలుసుకోండి.

కెరీర్ ప్రారంభంలో మంచి జీతం ఇచ్చే కొలువుల కంటే.. మంచి పని సంస్కృతి నేర్పించే సంస్థలే ఉత్తమం.

# పెట్టుబడుల్లో పెరిగిన మహిళల భాగస్వామ్యం..
# వారు ఎక్కువగా ఇన్వెస్ట్ చేసేది దేనిమీదంటే..?



గతంలో సమాజం ద్వారా అణచివేతకు గురైన మహిళలు.. ప్రస్తుతం పురుషులకు ధీటుగా ఎదుగుతున్నారు. అన్ని రంగాల్లోనూ మగవారిని వెనక్కి నెట్టి ఔరా అనిపిస్తున్నారు. పెట్టుబడుల్లోనూ హవా చాటుతున్నారు. మహిళల ఇన్వెస్ట్‌మెంట్ అనగానే బంగారంపై అని అనుకుంటే పొరపాటే అవుతుంది. తాజా సర్వే నివేదికలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. స్వర్ణం కనీసం టాప్ రెండు స్థానాల్లోనూ లేకపోవడం ఆశ్చర్యపడాల్సిన విషయమే.

పడిపోయిన బంగారం స్థానం: రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ అనరాక్ ఒక సర్వే నిర్వహించింది. మొత్తం 5 వేల 5 వందల మంది ఇందులో పాల్గొనగా.. వారిలో 50 శాతం మహిళలే. పెట్టుబడుల విషయమై వారిని ప్రశ్నించగా.. 65 శాతం మంది రియల్ ఎస్టేట్‌లో, 20 శాతం స్టాక్స్ లో ఇన్వెస్ట్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు వెల్లడైంది. బంగారంపై ఆసక్తి చూపే వారు కేవలం 8 శాతం మాత్రమే ఉన్నట్లు తెలిసింది. మిగిలిన 7 శాతం మంది ఫిక్స్‌డ్ డిపాజిట్ల వైపు మొగ్గుచూపిస్తున్నట్లు సర్వే పేర్కొంది.

దాదాపు అరకోటిపైనే ఆసక్తి: రూ.45 లక్షలకు పైగా ఉన్న ఇళ్లపై 83 శాతం మంది మహిళలు ఆసక్తి చూపిస్తున్నట్లు మరో పరిశోధనలో తేలిందని అనరాక్ వెల్లడించింది. రూ.45-90 లక్షల శ్రేణిని 36 శాతం మంది మహిళలు 'స్వీట్ స్పాట్'గా చూస్తున్నారని, 27 శాతం రూ.90 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఉన్న ప్రీమియం గృహాలను ఇష్టపడతున్నారంది. అయితే దాదాపు 20 శాతం మంది రూ.1.5 కోట్ల కంటే ఎక్కువ ధర కలిగిన లగ్జరీ గృహాల వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపింది. రూ.45 లక్షల లోపున్న సరసమైన గృహాలకు మాత్రం తక్కువ ప్రాధాన్యత ఉన్నట్లు స్పష్టం చేసింది.



స్పష్టమైన అవగాహనతో.. దశాబ్ద కాలంగా రియల్ ఎస్టేట్ సెగ్మెంట్ లో మహిళలు ఎదిగారని అనరాక్ గ్రూప్ వైస్ ఛైర్మన్ సంతోష్ కుమార్ తెలిపారు. పట్టణ ముఖ్య కేంద్రాల్లో నివాసాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు. భారీ గృహాలు, నిర్దిష్ట బడ్జెట్ విషయంలో కొత్త ధోరణులను అనుసరిస్తున్నట్లు తేలిందన్నారు. వారికేమి కావాలో స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నట్లు చెప్పారు.

గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం.. నివాస, పెట్టుబడి అవసరాల కోసం ఇళ్ల కొనుగోళ్ల మధ్య నిష్పత్తి 82:18గా ఉంది. అయితే ఇప్పుడు 77:23 నిష్పత్తితో భారీ వ్యత్యాసం గుర్తించినట్లు నివేదిక వెల్లడించింది. మహిళల యాజమాన్యంతో పలు ప్రయోజనాలు: తమ పేర్లపై ఆస్తుల కొనుగోలు, రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా భారతీయ మహిళలు అనేక ప్రయోజనాలు పొందవచ్చని అనరాక్ పేర్కొంది. వివిధ ప్రభుత్వ పథకాలు సైతం మహిళల ఇంటి యాజమాన్యాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. 2015లో కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహాలను పొందాలంటే.. అవి తప్పనిసరిగా మహిళల పేరుతో లేదా వారు సహ యజమానిగా ఉండాల్సిందేనని గుర్తుచేశారు. పలు రాష్ట్రాల్లో తక్కువ స్టాంప్ డ్యూటీ, గృహ రుణాలపై వడ్డీ తగ్గింపు ప్రయోజనం సైతం పొందవచ్చన్నారు. పన్ను మినహాయింపుల్లోనూ పలు అవకాశాలున్నట్లు చెప్పారు.

# మహిళలకు మాత్రమే



తినడానికి మూడు రొట్టెలు ఉన్నప్పుడు, తినవలసినవారు నలుగురు అయినప్పుడు 'నాకు ఆకలి లేదు' అనే వ్యక్తి మహిళ. ఇంట్లో ఎవరికి అనారోగ్యం కలిగినా.. ముందుండి సేవలు చేస్తుందామె. తన దగ్గరికి వచ్చేసరికి ఎవరికీ బరువు కాకూడదని అనుకుంటుంది. తనను ఇబ్బంది పెడుతున్న రుగ్మతల గురించి కూడా ఓ పట్టాన బయటపెట్టదు. అచితా జాకబ్ ఓ కూతురిగా, చెల్లిగా అలాంటి సంఘటనలు అనేకం చూసింది. అందరికీ అన్నీ తానై నిలిచే స్త్రీ.. తనలోని సహజ త్యాగగుణం కారణంగా ప్రాణాల మీదికి తెచ్చుకునే పరిస్థితి రాకూడదనే.. బెంగళూరు కేంద్రంగా 'ప్రొయాక్టివ్ ఫర్ హర్' అనే స్టార్టప్‌ను స్థాపించింది. మహిళల కోసం, మహిళలే స్థాపించిన మహిళా వైద్యుల బృందం ఇది. మిగతా హాస్పిటల్స్‌లా కాకుండా.. ఇక్కడ రోగి నుంచి సమాచారం రాబట్టడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు!ూ ఎక్కువ సమయం కేటాయిస్తారు. దీంతో ఆ మహిళ మనసు విప్పి మాట్లాడటానికి వీలు ఉంటుంది. ఫెర్టిలిటీ, డెర్మటాలజీ, న్యూట్రిషన్ తదితర అంశాలకు సంబంధించి అవగాహన శిబిరాలు కూడా నిర్వహిస్తుంది.. ప్రొయాక్టివ్ ఫర్ హర్. తన సేవల్ని గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించే ప్రయత్నం ప్రారంభించారు అచిత. ఆ చొరవకు గుర్తింపుగా.. వెంచర్ క్యాపిటల్ సంస్థల నుంచి ఐదున్నర మిలియన్ డాలర్ల పెట్టుబడులూ సమకూరాయి. అచిత స్వతహాగా మార్కెటింగ్ నిపుణురాలు. గతంలో 'డా విటా' అనే ఫార్చ్యూన్ 500 కిడ్నీ కేర్ కంపెనీకి మార్కెటింగ్ లీడ్‌గా పనిచేసింది. సామా జిక స్పృహ, మార్కెటింగ్ నైపుణ్యం, వైద్య పరిజ్ఞానం.. ఈ మూడూ తనలో పుష్కలం. ఆమె విజయ రహస్యం కూడా ఇదే.

# అందంగా కనిపించాలా? ఈ తప్పులు అస్సలే చేయవద్దు, అవేంటంటే..

చర్మ సంరక్షణ పద్ధతులు ఒక్కొక్కరివి ఒక్కోలా ఉంటాయి. అందరి లక్ష్యం అందంగా కనిపించడమే. ముఖ చర్మం అందంగా, కాంతివంతంగా, మెరిసేలా కనిపించాలని, పొడిబారకుండా, మచ్చల్లేని ముఖం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అందుకోసం పాటించే పద్ధతుల్లో తేడాలు ఉండొచ్చు. స్కిన్‌కేర్ రొటీన్ కు సంబంధించి అపోహలు చాలానే ఉన్నాయి. వాటిని చాలా మంది నిజమనే నమ్ముతుంటారు. ఆ అపోహలు ఏంటి, అసలు నిజాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

సెక్స్ సమయంలో వచ్చే సమస్యలివే, వాటిని ఎలా నివారించాలంటే?

యాంటీ ఏజింగ్ ప్రొడక్ట్స్: యాంటీ ఏజింగ్ ప్రొడక్ట్స్ మార్కెట్‌లో చాలానే ఉన్నాయి. వాటి ఉద్దేశం వయస్సు మీద పడుతున్న కొద్దీ చర్మం మారుతూ వస్తుంది. అలా అవ్వకుండా నిత్య యవ్వనంలా ఉంచుతుందని యాడ్స్, ప్రమోషన్స్ చేస్తూ ఆ ఉత్పత్తులను అమ్ముతుంటారు. అయితే ఈ క్రీముల వల్ల పెద్దగా ఫలితం ఉండదని అంటారు నిపుణులు. చర్మ వయస్సును ఏ ప్రొడక్ట్స్ కూడా తగ్గించలేవని చెబుతున్నారు. అయితే చర్మ సమస్యలు తగ్గించడానికి మార్కెట్ లో ఉన్న పలు ప్రొడక్ట్స్ పని చేస్తాయని చెబుతున్నారు. మొటిమలు, చర్మం పొడిబారడం, నల్ల మచ్చలు, కళ్ల కింద డార్క్ సర్కిల్స్ లాంటి వాటి కోసం మార్కెట్ లో చాలానే ఉత్పత్తులు ఉన్నాయి. అవన్నీ బాగానే పని చేస్తాయి. అయితే వయస్సు పెరిగే కొద్దీ చర్మంపై వచ్చే ముడతలు, ఫైన్ లైన్స్, స్మైల్ లైన్స్ ను పూర్తిగా తొలగించడం ఏ ఉత్పత్తుల వల్ల అవ్వదని స్పష్టం చేస్తున్నారు.

లగ్జరీ బ్రాండ్ లు ఉపయోగించే మార్కెటింగ్ జిమ్మిక్ ఇది. మంచి ఫలితాలు రావాలంటే ఖరీదైన ఉత్పత్తులే వాడాలని చెబుతూ వారి ప్రొడక్ట్స్ అమ్ముకుంటారు. ఇక్కడ దాని ఖరీదు, బ్రాండ్ ముఖ్యం కానే కాదు. ఏదైనా చర్మ సంబంధిత ప్రొడక్ట్ లో చూడాల్సింది.. అందులో వాడిన పదార్థాలు, ఎంత మొత్తంలా వాడారు, అవి మన సమస్యను పరిష్కరిస్తాయా అనేది మాత్రమే చూడాలి. అందమైన, మెరిసిపోయే చర్మం కావాలంటే ఖరీదైన ఉత్పత్తులు కొనాల్సిందే అనేది అపోహ మాత్రమే. అన్ని చిట్కాలు అందరికీ పనిచేయవు: సౌందర్య చిట్కాలు చాలా మందే ఇస్తుంటారు. సోషల్ మీడియా ఓపెన్ చేస్తే ఇలాంటి బ్యూటీ టిప్స్ ఇచ్చే ఇన్‌ఫ్లుయెన్సర్లు చాలా మందే ఉంటారు. ఈ చిట్కాలు కొంత వరకు పని చేసినా.. ప్రతి ఒక్కరికీ పని చేస్తాయన్న గ్యారెంటీ ఏమీ లేదు. ఏడాదిలో పొడవైన రోజు జూన్ 21.. ఈ రోజు ఎందుకంత ప్రత్యేకమో తెలుసా? ఒక్కొక్కరి చర్మ తత్వం ఒక్కోలా ఉంటుంది. ప్రతి ఒక్కరి చర్మ రకం భిన్నంగా ఉంటుంది. అందుకే ఒకరి చిట్కాలు మరొకరికి పని చేయకపోవచ్చు. అలాంటప్పుడు సమస్య ఏమిటో తెలుసుకుని ప్రయోగాలు చేసి ఎవరి చర్మానికి సరిపోయే చిట్కాలు వారే తయారు చేసుకోవడం ఉత్తమం.



**మొటిమలను నలిపేయడం:** చాలా మందికి మొటిమలు అంటే చిరాకు. ముఖంపై మొటిమలు వస్తే చాలా ఇబ్బంది పడిపోతుంటారు. కొందరేమో వాటిని నలిపేసి చీము బయటకు తీస్తుంటారు. కానీ ఇలా చేయడం ఏమాత్రం మంచిది కాదని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. మొటిమలు చిదిమేయడం వల్ల ఇన్ఫెక్షన్లకు, మరిన్ని మొటిమలకు దారితీయవచ్చు. ఇలా చేయకుండా వైద్యులు సూచించే క్రీములు, జెల్స్ వాడటం మంచి పద్ధతిల. అలాగే తరచూ మంచి నీటితో ముఖాన్ని కడుగుతూ ఉండటం వల్ల మొటిమలను నియంత్రించవచ్చు. సన్‌స్క్రీన్ పెద్దగా అవసరం లేదు!: చర్మ సంరక్షణ ఉత్పత్తులు కోసం చాలా రకాల క్రీములు, జెల్ లు వాడుతుంటారు. కానీ సన్‌స్క్రీన్ కొనడానికి మాత్రం మనసు రాదు. అయితే ఎండ నుండి, సూర్యకిరణాల నుండి చర్మాన్ని సన్‌స్క్రీన్ రక్షిస్తుంది. సూర్య కిరణాల వల్ల చర్మం అందం కోల్పోతుంది. ఎండ వేడిమికి చర్మం పొడిబారుతుంది. దీని వల్ల ఇతర సమస్యలు కూడా రావొచ్చు. అలాగే ఎక్కువ సేపు ఎండకు బహిర్గతం కావడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే ఇంట్లో నుండి బయటకు వెళ్తే తప్పకుండా సన్‌స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు.

# టెర్రస్ మీద అరటి చెట్టు పెంచుతున్నారా.. వాస్తు శాస్త్రం ఏమి చెబుతుందో తెలుసుకోండి




జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఇంటి వాతావరణం సానుకూలంగా ఉండాలంటే ఇంట్లో ఏర్పాటు చేసుకునే వస్తువులతో పాటు.. ఇంటి ఆవరణలో పెంచే చెట్ల విషయంలోనూ కొన్ని నియమాలను పాటించాలి. అయితే ఇంట్లో ఒక చెట్టు తప్పు దిశలో నాటినట్లయితే అది మీ జీవితంలో ఆనందానికి బదులుగా సమస్యలను కలిగిస్తుంది. వాస్తవానికి కొన్ని రకాల చెట్లను పెంచడానికి వాస్తు నియాలున్నాయి. ముఖ్యంగా తులసి, అరటి వంటి మొక్కలకు సంబంధించి వాస్తులో కొన్ని నియమాలు కూడా ఉన్నాయి.

అరటి చెట్టు శ్రీ మహా విష్ణు స్వరూపంగా భావిస్తారు.. అరటి చెట్టుని పూజించడం చాలా పుణ్యప్రదమని చెబుతారు.

ఇంట్లో అరటి చెట్టును నాటడం ద్వారా బృహస్పతి జాతకంలో బలపడతాడు. ఇంటి ముందు భాగంలో అరటి చెట్టును ఎప్పుడూ పెంచకూడదని అంటారు. ఇది జీవితంలో సమస్యలను కలిగిస్తుంది. అయితే ఇంటి వెనుక భాగంలో అరటి మొక్కను పెంచుకోవచ్చు. ప్రతి గురువారం అరటి చెట్టుకు పూజ చేయండి.. తద్వారా బృహస్పతి , విష్ణువు అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది.

అరటి మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు.. తులసి లేదా అరటి మొక్కను సాధారణంగా ఇళ్లలో నాటుతారు. సనాతన ధర్మంలో మత విశ్వాసాల ప్రకారం ఇంట్లో అరటి మొక్కను నాటడం వలన గురుగ్రహానికి సంబంధించిన సమస్యలు తొలగిపోతాయి. వైవాహిక జీవితంలో సంతోషం ఉంటుంది. ఇంట్లో ఎలాంటి సంక్షోభం వచ్చినా దూరం అవుతుంది. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. రుణాల తీరి ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

పైకప్పుపై అరటి చెట్టును నాటడం వల్ల కలిగే నష్టాలు.. వాస్తు శాస్త్రం ప్రకారం అయితే ప్రస్తుతం టెర్రస్ గార్డెన్ అధికంగా ఉంది. అయితే అన్ని మొక్కలను పెంచినట్లు ఇంటి పైకప్పుపై అరటి చెట్టును నాటితే.. అది మీ జీవితంలో సంతోషం కంటే సమస్యలను తెస్తుంది. ఇంటి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారవచ్చు. కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడవచ్చు. గ్రహాల స్థితి మారుతుంది.. చెడు ప్రభావం పడే అవకాశం ఉంది. ఆకస్మిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉంది.

అరటి చెట్టు ఎక్కడ పెంచాలంటే.. హిందూ మతంలో దేవతలు చెట్లు, మొక్కల్లో నివసిస్తారు. అందువల్ల మీరు ఇంట్లో అరటి చెట్టును పెంచుకోవాలను కుంటే దానిని సరైన దిశలో నాటండి.

ఇంట్లో అరటి చెట్టును నాటడం ద్వారా బృహస్పతి జాతకంలో బలపడతాడు. ఇంటి ముందు భాగంలో అరటి చెట్టును ఎప్పుడూ పెంచకూడదని అంటారు. ఇది జీవితంలో సమస్యలను కలిగిస్తుంది.

అయితే ఇంటి వెనుక భాగంలో అరటి మొక్కను పెంచుకోవచ్చు. ప్రతి గురువారం అరటి చెట్టుకు పూజ చేయండి.. తద్వారా బృహస్పతి , విష్ణువు అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది.

# ఈ ఏడాది వివాహ పంచమి ఎప్పుడో తెలుసా..! ఈ రోజున ఏ తల్లిదండ్రి తన కూతురికి పెళ్లి ఎందుకు చేయరంటే



హిందూ మత విశ్వాసాల ప్రకారం శ్రీరాముడు, తల్లి సీత వివాహ బంధంలో ముడిపడి ఉన్నారు. ఈ రోజును వివాహ పంచమిగా జరుపుకుంటారు. హిందూ మతం ప్రకారం ఈ రోజున రాముడు తల్లి సీతను వివాహం చేసుకున్నాడు. రామయ్య సకలగుణాభిరాముడు. అయినప్పటికీ రామయ్యను వివాహం చేసుకున్న తరువాత సీత తన జీవితంలో చాలా బాధలను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ రోజున ప్రజలు తమ కుమార్తెలకు వివాహం చేయడానికి వెనుకాడటానికి ఇదే కారణం. హిందువులకు ఆరాధ్య దైవం శ్రీరాముడు.. ఆదర్శ దంపతులు సీతారాములు. రామయ్య సీతమ్మను కళ్యాణం జరుపుకున్న రోజున (వివాహ వార్షికోత్సవాన్ని) వివాహ పంచమిగా జరుపుకుంటారు.

రాముడు, సీత వివాహం మార్గశీర్ష మాసంలోని శుక్ల పక్షం ఐదవ రోజున జరిగిందని.. అందుకే ఈ తేదీని వివాహ పంచమి అని కూడా అంటారు. ప్రతి సంవత్సరం వివాహ పంచమి రోజున శ్రీరాముడు సీతదేవిల వివాహ వార్షికోత్సవంగా జరుపుకుంటారు

ఈ సంవత్సరం వివాహ పంచమి డిసెంబర్ 17, 2023 ఆదివారం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా సీతాదేవి మెట్టినిల్లు అయోధ్యలో పుట్టినిల్లు నేపాల్‌లో ప్రత్యేక కార్యక్రమాలను భారీ సంఖ్యలో పూజలను, ఆచారాలు కూడా నిర్వహిస్తారు. ఈ రోజు సీతా రాముల ఆరాధనకు చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. అయితే వివాహం వంటి శుభకార్యాలను నిర్వహించడానికి ఈ రోజు పవిత్రమైనదిగా పరిగణించబడదు.

**వివాహ పంచమి శుభ సమయం**

హిందూ క్యాలెండర్ ప్రకారం మార్గశీర్ష మాసంలోని శుక్ల పక్ష పంచమి తిథి డిసెంబర్ 16వ తేదీ రాత్రి 8 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు డిసెంబర్ 17వ తేదీన సాయంత్రం 5.33 గంటలకు ముగుస్తుంది. ఉదయ తిథి ప్రకారం వివాహ పంచమిని 17 డిసెంబర్ 2023న మాత్రమే జరుపుకుంటారు. ఈ రోజు పూజకు మూడు శుభ ముహూర్తాలు ఉన్నాయి. పూజకు అత్యంత అనుకూలమైన సమయం ఉదయం 8:24 నుండి మధ్యాహ్నం 12:01 వరకు. మధ్యాహ్నం 1:34 నుండి 2:52 వరకు శుభ సమయం. దీని తరువాత, సాయంత్రం 05:02 నుండి 10:34 వరకు శుభ సమయం.

**వివాహ పంచమి నాడు వివాహం ఎందుకు జరుపుకోరంటే**

దేవుత్తని ఏకాదశి ప్రారంభం నుండి శుభ కార్యక్రమాలపై అన్ని ఆంక్షలు ముగుస్తాయి. వివాహ పంచమి అనంతరం ప్రజలు శుభ ముహూర్తాలను చూసి వివాహం చేసుకోవచ్చు. వివాహ పంచమి రోజున వివాహం అశుభమైనదిగా పరిగణించబడుతుంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం వివాహ పంచమి రోజు వివాహం వంటి శుభకార్యాలకు మంచిది కాదు. ఎవరి జాతకంలోనైనా గ్రహాల స్థితి బాగున్నప్పటికీ ఈ రోజున వివాహాలను నిర్వహించారు.

హిందూ మత విశ్వాసాల ప్రకారం శ్రీరాముడు, తల్లి సీత వివాహ బంధంలో ముడిపడి ఉన్నారు. ఈ రోజును వివాహ పంచమిగా జరుపుకుంటారు. హిందూ మతం ప్రకారం ఈ రోజున రాముడు తల్లి సీతను వివాహం చేసుకున్నాడు. రామయ్య సకలగుణాభిరాముడు.

అయినప్పటికీ రామయ్యను వివాహం చేసుకున్న తరువాత సీత తన జీవితంలో చాలా బాధలను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ రోజున ప్రజలు తమ కుమార్తెలకు వివాహం చేయడానికి వెనుకాడటానికి ఇదే కారణం.

**హిందూ మతపరమైన కారణం**

హిందూ మతంలో వివాహ పంచమి చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. సీతను రామయ్య వివాహం చేసుకున్న తర్వాత జీవితంలో చాలా కష్టాలను భరించాల్సి వచ్చింది. 14 సంవత్సరాల వనవాసం వంటి అనేక సంఘటనల తరువాత శ్రీరాముడు కూడా రావణుడిని చంపి అయోధ్యకు తిరిగి వచ్చిన తర్వాత సీతను విడిచిపెట్టవలసి వచ్చింది. అంతేకాదు సీతదేవి అగ్ని పరీక్షకు గురికావలసి వచ్చింది. ఈ కారణాల వల్ల ప్రజలు ఈ రోజున తమ కుమార్తెలకు వివాహం చేయకూడదని తల్లిదండ్రులు భావిస్తారు.

# ఈ గడ్డి పూజాది కార్యక్రమాల్లో అత్యంత పవిత్రమైంది.. ఇంట్లో సుఖసంతోషాలు తెస్తుంది..

దర్భ అనేది ఒక రకమైన గడ్డి మొక్క.. దీనిని కుశదర్భ అని కూడా అంటారు. దర్భ లేని పూజ అసంపూర్ణంగా పరిగణించబడుతుంది. ఈ గడ్డి పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ప్రతి పవిత్రమైన పనిలో దీనిని ఉపయోగిస్తారు. హిందూ మతంలో జరిగే యజ్ఞ, యాగాలలో, పూజ వంటి ఆచారాలలో ఉపయోగిస్తారు. ఈ రోజు మనం దర్భ విశిష్టత గురించి తెలుసుకుందాం.. శ్రాద్ధం, తర్పణం, గ్రహణం సమయంలో కలిగే దుష్ప్రభావాలు దర్భ వినియోగం వలన తగ్గుతాయి.

హిందూ సంప్రదాయంలో వృక్ష, జంతువులకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. వృక్ష సంపదలో ఒకటైన దర్భను కూడా హిందువులు చాలా పవిత్రంగా భావిస్తారు. దర్భ అనేది ఒక రకమైన గడ్డి మొక్క.. దీనిని కుశదర్భ అని కూడా అంటారు. దర్భ లేని పూజ అసంపూర్ణంగా పరిగణించబడుతుంది. ఈ గడ్డి




పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ప్రతి పవిత్రమైన పనిలో దీనిని ఉపయోగిస్తారు. హిందూ మతంలో జరిగే యజ్ఞ, యాగాలలో, పూజ వంటి ఆచారాలలో ఉపయోగిస్తారు. ఈ రోజు మనం దర్భ విశిష్టత గురించి తెలుసుకుందాం..

శ్రాద్ధం, తర్పణం, గ్రహణం సమయంలో కలిగే దుష్ప్రభావాలు దర్భ వినియోగం వలన తగ్గుతాయి. కుశదర్భను ఎర్రటి గుడ్డలో చుట్టి ఉంచడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. అంతేకాకుండా ఇంట్లో సంతోషం, శాంతి వాతావరణం నెలకొంటుంది. అందువల్ల ఈ గడ్డిని పూజకు అత్యంత పవిత్రంగా భావిస్తారు.

**దర్భకు మతపరమైన ప్రాముఖ్యత**

పూజ ఏదైనా సరే దర్భను ఉపయోగిస్తారు. ఏదైనా మతపరమైన పూజలో దర్భతో చేసిన ఆసనాన్ని వినియోగిస్తారు. కుశ గడ్డితో చేసిన ఆసనంపై కూర్చొని మంత్రాలు పఠించడం ద్వారా, మంత్రాలు అత్యంత ఫలవంతం అవుతాయని విశ్వాసం. అంతేకాకుండా కలుషితమైన వాతావరణాన్ని శుద్ధి చేయడానికి కుష్ గడ్డిని కూడా ఉపయోగిస్తారు.

# ఆదివారం ఉపవాసం ఎలా ఉండాలి, పూజా విధానం, ప్రాముఖ్యత ఏమిటంటే



ఎవరి జాతకంలోనైనా సూర్యునికి సంబంధించిన ఏదైనా దోషం ఉన్నట్లయితే సూర్య భగవానుని పూజించడం, ఆదివారం ఉపవాసం ఉండడం వల్ల మేలు జరుగుతుంది. సూర్యభగవానుని ఆరాధించడం వల్ల జీవితంలో సుఖసంతోషాలు, అదృష్టాలు లభిస్తాయి. ఆదివారం పూజ మతపరమైన ప్రాముఖ్యత.. ఉపవాసం చేయడానికి సరైన మార్గం ఏమిటో మనం తెలుసుకుందాం.



హిందూ మతంలో ఆదివారం చేసే ఆరాధనకు చాలా ప్రాముఖ్యత ఉంది. హిందువుల విశ్వాసం ప్రకారం ఆదివారం రోజున సూర్య భగవానుని పూజించాలనే నియమం ఉంది.

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం సూర్య భగవానుడు ఇతర గ్రహాలకు రాజుగా పరిగణిస్తారు. ఎవరి జాతకంలోనైనా సూర్యునికి సంబంధించిన ఏదైనా దోషం ఉన్నట్లయితే సూర్య భగవానుని పూజించడం, ఆదివారం ఉపవాసం ఉండడం వల్ల మేలు జరుగుతుంది.

సూర్యభగవానుని ఆరాధించడం వల్ల జీవితంలో సుఖసంతోషాలు, అదృష్టాలు లభిస్తాయి. ఆదివారం పూజ మతపరమైన ప్రాముఖ్యత.. ఉపవాసం చేయడానికి సరైన మార్గం ఏమిటో మనం తెలుసుకుందాం.

**ఆదివారం ఉపవాసం, పూజా విధానం**

ఆదివారం భాస్కరుని అనుగ్రహం పొందడానికి సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేయాలి. అనంతరం శుభ్రమైన రాగి పాత్రను తీసుకుని అందులో నీటిని తీసుకొని సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించండి. అప్పుడు పూజా స్థలంలో ఎర్రని చాప లేదా ఏదైనా ఎర్రటి దుప్పటిపై కూర్చుని సూర్య భగవానుని పూజించడం ప్రారంభించండి.

సూర్య భగవానుడి బీజ్ మంత్రంతో జపమాలతో ఐదు మార్లు జపించండి. ఆ తర్వాత ఆదివారం ఉపవాసం, ఆదిత్య హృదయ స్తోత్రం పఠించండి. సూర్య నారాయణునికి ధూపం, అక్షత, పాలు, ఎర్రటి పువ్వులు, అర్ఘ్యం సమర్పించడం ఒక ప్రత్యేక ఫలంగా పరిగణించబడుతుంది.

ఆదివారం పూజ సమయంలో సూర్య భగవానుడికి ఎర్రచందనం సమర్పించిన తర్వాత, దానిని ప్రసాదంగా నుదుటిపై ధరించండి. సూర్యదేవుడి నమస్కారం ముందు.. మీరు నిలబడి ఉన్న ప్రదేశం చుట్టూ తిరిగి అర్ఘ్యం సమర్పించి నమస్కరించండి.

**ఉపవాస సమయంలో ఏమి తినాలి.. ఏమి తినకూడదు**

ఆదివారం ఉపవాస సమయంలో గోధుమ రొట్టె లేదా బెల్లం కలిపి తినాలని నియమం ఉంది. ఈ ఉపవాస సమయంలో ఉప్పు అస్సలు తీసుకోరాదు. అటువంటి పరిస్థితిలో ఈ ఆహారం లేదా పానీయానికి ఉప్పు కలపవద్దు. ఉప్పుని ఏ విధంగానూ తినవద్దు. ఆదివారం వ్రత ఉద్యాపన చేసే సమయంలో కనీసం నలుగురు బ్రాహ్మణులకు ఆహారాన్ని అందించండి. ఎర్రటి బట్టలు, పండ్లు, స్వీట్లు, పువ్వులు, కొబ్బరికాయ, దక్షిణ ఇచ్చి వారి ఆశీర్వాదం పొందండి.

**ఆదివారం ఉపవాసం మతపరమైన ప్రాముఖ్యత**

సనాతన సంప్రదాయం ప్రకారం జీవితంలో కీర్తి, ఆనందం, శ్రేయస్సు పొందడానికి సూర్య భగవానుని పూజించడం శుభప్రదంగా పరిగణించబడుతుంది. ఆదివారం ఉపవాసం సూర్యుని అనుగ్రహాన్ని పొందడానికి, సంతోషంగా, ఆరోగ్యంగా , గౌరవప్రదంగా ఉండటానికి ఉత్తమ మార్గంగా పరిగణించబడుతుంది. మత విశ్వాసాల ప్రకారం సూర్యభగవానుని ఆరాధించడం వల్ల జాతక దోషాలు తొలగిపోతాయి. ప్రతికూల శక్తులు దూరంగా ఉంటాయి.

# దీపాలు వెలిగించేప్పుడు ఈ తప్పులు చేస్తున్నారా.? నష్టపోతారు..



ఇంట్లో ఆనందం, శాంతి లభించాలంటే దీపాలు వెలిగించాలని పండితులు సైతం చెబుతుంటారు. అయితే దీపాలు వెలిగించడం వల్ల ఎన్ని లాభాలు ఉంటాయో, సరైన పద్ధతిలో వెలిగించకపోతే నష్టాలు కూడా ఉంటాయని వాస్తు పండితులు చెబుతున్నారు. దీపం వెలిగించే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో కొన్ని తప్పులు చేయకూడదని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల మంచి కంటే దీపాలు వెలిగించేప్పుడు ఈ తప్పులు చేస్తున్నారా.? నష్టపోతారు..

సనాతన ధర్మంలో దీపాలకు ఉన్న ప్రాధాన్యత ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దీపారాధనకు హిందూ మతంలో ప్రాధాన్యత ఉంది. తులసి కోట దగ్గర, పూజగదిలో నిత్యం దీపాలు వెలిగించడం సంప్రదాయంగా వస్తుంది. ఇంట్లో పాజిటివ్ ఎనర్జీ పెంచడంలో దీపాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి.

ఇంట్లో ఆనందం, శాంతి లభించాలంటే దీపాలు వెలిగించాలని పండితులు సైతం చెబుతుంటారు. అయితే దీపాలు వెలిగించడం వల్ల ఎన్ని లాభాలు ఉంటాయో, సరైన పద్ధతిలో వెలిగించకపోతే నష్టాలు కూడా ఉంటాయని వాస్తు పండితులు చెబుతున్నారు. దీపం వెలిగించే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో కొన్ని తప్పులు చేయకూడదని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల మంచి కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందని అంటున్నారు. ఇంతకీ దీపం వెలిగించే సమయంలో ఎలాంటి నియమాలు పాటించాలంటే..

పూజ గదిలో ఎల్లప్పుడూ మంచి దీపాన్నే వెలిగించాలి. విరిగిన దీపాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించకూడదు. అలాగే మురికిగా ఉన్న దీపాలను వాడరాదు. దీపాలను శుభ్రంగా కడగిన తర్వాతే దీపాలను వెలిగించాలి. ఇలాంటి వాటిలో దీపాలను వెలిగిస్తే.. ప్రతికూలత పెరుగుతుంది.

నెయ్యితో వెలిగించే దీపానికి దూది వత్తిని ఉపయోగిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. అదే నూనె దీపానికి మాత్రం ఎర్రటి దారం లేదా కాటన్ వత్తిని ఉపయోగించాలని పండితులు సూచిస్తున్నారు.

ఇక చాలా మంది పూజ గదిలో కేవలం ఉదయం మాత్రమే దీపాన్ని వెలిగిస్తుంటారు. అయితే సాయంత్రం కూడా దీపం వెలిగించడం మంచిదని పండితులు చెబుతున్నారు. అలాగే సాయంత్రం ఇంటి ప్రధాన ద్వారం వద్ద కూడా ఒక దీపాన్ని వెలిగించాలి.

ఇక నెయ్యితో వెలిగించే దీపాన్ని దేవుడికి మీ ఎడమ చేతి వైపు ఉంచాలి, అలాగే నూనె దీపాన్ని మీ కుడి చేతి వైపు ఉంచాలని పండితులు చెబుతున్నారు.

మనలో చాలా మంది ఒక దీపాన్ని వెలిగించిన తర్వాత అదే దీపంతో మరో దీపాన్ని వెలిగిస్తుంటారు. అయితే ఇలా ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేస్తే వ్యక్తి అప్పుల బారిన పడతాడని చెబుతున్నారు.

ప్రతీ రోజూ సాయంత్రం దీపం వెలిగించడం వల్ల ఇంట్లో మానసిక ప్రశాంతత లభించడంతో పాటు, డబ్బు కొరత, ఆరోగ్య సంబంధిత సమస్యలు తొలగిపోతాయి .

# ఫ్లాట్ అవ్వాల్సిందే!





కొన్ని దుస్తులు, ఇంకొన్ని ఆభరణాలు, మరికొన్ని యాక్సెసరీస్.. చూడగానే ఫ్లాట్ అయిపోతాం. మనవే అనిపించుకునేదాకా కుదుటపడదు మనసు. కానీ ఎప్పుడూ మనమే ఫ్లాట్ అవ్వడం కాదు, మనకోసం ఫ్లాట్ అయిపోయే నగలూ ఉన్నాయి. అవే.. 'ఫ్లాట్ చెయిన్ నెక్లెస్'లు. విభిన్న పెండెంట్లు, రకరకాల డిజైన్లతో తయారవుతున్నాయీ కంఠాభరణాలు అందంగా ఉండటం, విభిన్నంగా కనిపించడం%ాా% కొత్త నగకు ఉండాల్సిన ముఖ్య లక్షణాలు. ఈ రెండూ ఉంటేనే మహిళాబోర్డు పరీక్షలో మంచి మార్కులు పడతాయి ఆభరణానికి. అప్పుడే వాటి కరిక్యులమ్ వీటాకి బలం కూడా. మలి రౌండ్‌లో నెగ్గుకొచ్చి మార్కెట్ జోరును అందుకునే అవకాశమూ వాటికే. అచ్చంగా ఆ అర్హతలన్నీ ఉన్నాయి ఫ్లాట్ మెష్ చెయిన్ నెక్లెస్‌లకు. మెడను అలంకరించే గొలుసు పల్చగా, వెడల్పుగా ఉండటం ఇందులోని ప్రత్యేకత. అంటే సాధారణంగా మనం చూసే గొలుసుల్లా గుండ్రం గానో, డిజైన్లతో ఉబ్బెత్తుగానో కాకుండా.. చదరంగా ఉండటం వల్ల ఇవి ఫ్లాట్ నెక్లెస్‌లు అయ్యాయన్నమాట. పై మెడకు పెట్టుకునేలా చోకర్ తరహాతో పాటు, ఇంకాస్త కిందికి ధరించే నెక్లెస్‌లా కూడా రూపొందుతున్నాయి. సాదా చెయిన్‌కు పెద్ద పెండెంట్%ాా% దానికి సరిపోయే జుంకాలతో వచ్చేవి కొన్నయితే, గొలుసు మీద మామిడి పిందెలు, పువ్వుల్లాంటి బంగారు మోటిఫ్స్‌తో వచ్చేవి మరికొన్ని. లాకెట్లలో సంప్రదాయ డిజైన్లలో కనిపించే నెమళ్లు, లక్ష్మీదేవి రూపుల్లాంటివీ ఉంటున్నాయి. బంగారంలో వజ్రాలు, రత్నాలు, ముత్యాలు పొదిగి చూడముచ్చటైన డిజైన్లలో దొరుకుతున్నాయి కూడా. చెయిన్ వెనుక హుక్ పెట్టుకునే భాగంలో డిజైన్లు వచ్చేలా ప్రత్యేకంగానూ తయారు చేస్తున్నారు. ఫ్లాట్ నెక్లెస్ మిమ్మల్నీ ఫ్లాట్ చేసిందా?

## ఆరు గజాల అనుబంధం.. 6 యార్డ్స్ ప్లస్



కంచి పట్టు కట్టుకుంటే, పట్టుపురుగు జన్మ ధన్యం అవుతుంది. పోచంపల్లి చుడితే నూలుపోగుకు ప్రాణం లేచొస్తుంది. చందేరీలో అయితే చంద్రబింబమే. ఉప్పాడ కట్టుబడికి కుర్రకారు గుండెదడ పెరగడం ఖాయం. షిఫాన్‌లో ముస్తాబైతే నచ్చినవాడి ఎదలో పెను తుఫానే.కాకపోతే, ఆ అలంకరణ ఏ పెండ్లికో, పండగకో పరిమితం అవుతున్నది. కొత్తతరం అమ్మాయిలు.. ప్రత్యేక సందర్భాల్లోనూ చీరను దూరం పెడుతున్నారు. ఈ ధోరణి మృణాళిని శాస్త్రిని బాధపెట్టింది. ఆమె స్థాపించిన '6 యార్డ్స్ ప్లస్'.. చీరకట్టును యువతులకు దగ్గర చేస్తున్నది.నార చీర నుంచి పట్టు చీర వరకు దేని అందం దానిదే. ఎన్ని మాడ్రన్ డ్రెస్సులు వచ్చినా చీరకట్టుకు మించిన సోయగం లేదని తేలిపోయింది. కాకపోతే, చీరను సంప్రదాయ వేడుకలకే పరిమితం చేస్తున్నది నేటి తరం. దీంతో ఆ వైభవం మసకబారుతున్నది. చీర పట్ల ఉన్న అపోహలను, చీరకట్టు విషయంలో ఉన్న భయాలను పోగొట్టి.. గత వైభవం తీసుకురావాలన్నది '6 యార్డ్స్ ప్లస్' ఫౌండర్ మృణాళిని శాస్త్రి లక్ష్యం. వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ చీరలను పరిచయం చేస్తూనే.. ఆరు గజాల చీరల సంస్కృతిని ఒక ఫ్యాషన్‌గా ప్రచారం చేస్తున్నారామె. మరోపక్క 'శారీ రివైవల్' ప్రణాళికతో పాతతరం చీరలకు కొత్త సొబగులు అద్ది భవిష్యత్ తరాలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. మృణాళిని ఎంబీఏ



చేశారు. కొంతకాలం ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోల తరఫున పని చేశారు. కానీ ఎక్కడో అసంతృప్తి. తన కల వేరు, చేస్తున్న కొలువు వేరు అనిపించింది. దీంతో తన అభిరుచినే కెరీర్‌గా ఎంచుకున్నారు. ఫ్యాబ్రిక్ రంగం వైపు అడుగులు వేశారు. %చిన్నతనంలో వేడుక ఏదైనా సరే, అమ్మ తనకు చీర చుట్టేసేది. దీంతో చీరతో పరిచయం, స్నేహం, బంధం.. అన్నీ కుదిరేశాయి. పెద్దయ్యాక కూడా ఆ ప్రేమ తగ్గలేదు. ఆఫీసుకు వెళ్లినప్పుడూ చీరలే కట్టేవారామె. ఆ మక్కువ కొద్దీ ఐదేండ్ల క్రితం.. '6 యార్డ్స్ ప్లస్' ప్రారంభించారు. పండుగ పబ్బాల వరకూ ఫర్వాలేదనిపించినా.. మిగతా సమయాల్లో చీరలు కాళ్లకు అడ్డుతగులుతాయని యువతుల భయం. కానీ అలవాటైతే చీరకట్టును మించిన సౌకర్యం లేదని భరోసా ఇస్తున్నారు మృణాళిని. 'కెరీర్ మహిళను హుందాగా చూపడంలో చీరల తర్వాతే.. ఏ దుస్తులైనా' అంటారామె.

**ట్రెండ్‌స్టైలిష్‌గా..**
వైవిధ్యమైన చీరకట్టుతో అందరినీ ఆకట్టుకుంటారు మృణాళిని. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన చీరకట్టు ఉంటుంది. ఎవరి సంస్కృతికి తగినట్టు వారు చీరలు కట్టుకుంటారు. పొలం పనులకు వెళ్లేటప్పుడు ఒకలా, పూజల సమయంలో ఒకలా ధరిస్తారు. ఇవే కాదు, ఇంకా చాలా కట్టుబడులు ఉన్నాయి. వాటన్నిటిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు మృణాళిని. కుచ్చిళ్లు పెట్టుకోవడం తెలియని వారికి ప్రాథమిక పాఠాలు బోధిస్తారామె. క్షణాల్లో ముస్తాబు కావడానికి రెడీమేడ్ చీరలనూ రూపొందిస్తారు.

**'శారీ రివైవల్' ప్రోగ్రామ్**



చీర ఓ మధుర జ్ఞాపకం. బీరువాలో కొలువైన ఒక్కో చీరతో ఓ అనుభూతి ముడిపడి ఉంటుంది. దాని వెనుక ఏదో ఓ కథ ఉంటుంది. అవన్నీ భవిష్యత్ తరాలకు తెలిసేలా 'శారీ రివైవల్' ప్రోగ్రామ్ ప్రారంభించారు. పాత చీరల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు మృణాళిని. బంజారాహిల్స్ కమలాపురి కాలనీలోని '6 యార్డ్స్ ప్లస్' ఆవరణలో పాత చీరలను కొత్త డిజైన్లతో తీర్చిదిద్దుతున్నారు. అంతెందుకు.. గోవా 'కుంది' చీరలు, సిద్ది పేట 'ముత్యంగడి' చీరలు పైకి నిరాడంబరంగా కనిపించినా రాజసాన్ని ప్రదర్శిస్తాయి. మార్కెట్‌లో అరుదుగా దొరికే ఈ చీరలకు కొత్త హంగులు అద్ది అందిస్తారామె. కాబట్టే ఆ చీరలు విదేశాలకూ వెళు తున్నాయి. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ విక్రయిస్తున్నారు. 'చీరకు ప్రాణంపోయడంలో ఎంతో మంది కళాకారుల శ్రమ దాగి ఉంటుంది. ఆ గొప్పతనం పిల్లలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనదే. అప్పుడే వాళ్లు చీరతో అనుబంధాన్ని పెంచుకోగలరు' అంటారు మృణాళిని. ఆమె ఆంత్రప్రెన్యూర్‌షిప్ కలలకు 'వీ హబ్' మద్దతు పలికింది. నెట్ వర్కింగ్ అందించింది. మార్కెటింగ్ మెళకువలు నేర్పింది. వ్యాపార విస్తరణకు దోహదపడింది. విజయానికి సాయపడింది.

చిన్న యసులోనే పెండ్లి. పెద్ద చదువు ఆలోచనకు బ్రేక్ పడింది. ఇల్లు, భర్త, పిల్లలే లోకంగా బతికింది. ఆరేండ్ల తర్వాత ఊపిరి పీల్చుకునే అవకాశం వచ్చింది. తిరిగి చదువు కొనసాగించింది. ప్రైవేటు టీచర్‌గా పిల్లలకు పాఠాలు బోధించింది. ట్యూటర్‌గానూ పనిచేసింది. అయినా, ఎదుగూ బొదుగూ లేని జీవితం. ఆదాయం విషయంలోనూ అంతులేని అసంతృప్తి. వ్యాపారం చేద్దామన్నది ఒకప్పటి కల. కానీ ఆర్థిక పరిస్థితులు అడ్డొచ్చాయి. అన్ని తలుపులూ మూసుకుపోయి, అన్ని ఆశలూ ఆవిరైపోయి.. తన ఉనికే ప్రశ్నార్థకమైందని బాధపడుతున్న సమయంలో 'దళిత బంధు' కాంతిరేఖలా కనిపించింది. 'వీ హబ్' ఆమెను పారిశ్రామిక వేత్తగా నిలబెట్టింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన నీరేటి మౌనిక విజయ ప్రస్థానమిది.%కొన్ని జీవితాల్లో సినిమాలను తలపించే మలుపులు ఉంటాయి. స్ఫూర్తి కథనాలను గుర్తుకుతెచ్చే విజయాలూఉంటాయి. తనకంటూ ఓ రోజు వస్తుందనీ, దర్జాగా వ్యాపారం చేసుకుంటాననీ నీరేటి మౌనిక కలలో కూడా ఊహించి ఉండదు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని సింగాపూర్ తన స్వగ్రామం. చిన్నతనంలోనే పెండ్లయింది. అప్పటికి తను ఇంటర్ చదువుతున్నది. ఆ తర్వాత, డిగ్రీ చేయాలనీ, వీలైతే ఎంబీయే పట్టా అందుకోవాలనీ ఆమె స్వప్నం. కానీ, వివాహంతో ఆమె కలల రెక్కలు తాత్కాలికంగా తెగిపోయాయి.

## కొంగొత్త జీవితం..

కొంతకాలానికి పరిస్థితులు సర్దుకున్నాయి. చిన్నప్పటి నుంచీ చదువుపై ఉన్న ఆసక్తితో తిరిగి చదువు కొనసాగించింది. డిగ్రీ పూర్తి చేసింది. భర్త చిరుద్యోగి. ఇద్దరు పిల్లలు. కుటుంబానికి ఆసరాగా కొంతకాలం ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేసింది. ప్రతినిత్యం గంటల తరబడి నిలుచునే పాఠాలు చెప్పడం వల్ల వెన్నునొప్పి, సయాటికా వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో టీచర్ ఉద్యోగాన్ని వదిలేసింది. ఇంట్లోనే ట్యూషన్స్ చెప్పింది. ఈ ఆదాయమూ అంతంత మాత్రమే. మనసులో ఏదో వెలితి. సొంతంగా ఏదైనా వ్యాపారం చేద్దామంటే పెట్టుబడి పెట్టే స్తోమత లేదు. ఈ పరిస్థితుల్లో 'దళిత బంధు' పథకం మౌనికకు బాసటగా నిలిచింది.

**'వీ హబ్' మార్గనిర్దేశంలో..** ఎంతోమంది గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన 'వీ హబ్' వేదిక.. దళితబంధు లబ్ధిదారులకూ మార్గనిర్దేశం చేసింది. దళితబంధుకు ఎంపికైనవారిలో ఔత్సాహిక మహిళలను గుర్తించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసింది. ఇదే క్రమంలో మౌనికకూ 'వీ హబ్' తోడ్పాటు అందించింది. ఏ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలనే విషయంలో మౌనిక తర్జనభర్జన పడింది. కిడ్స్‌వేర్ దుకాణం నడపాలని తొలుత భావించింది. ఆమె భర్తకు డ్రైవింగ్ తెలుసు. దీంతో ట్యాక్సీ కొనాలనే ఆలోచనా వచ్చింది. ఆ సమయంలోనే వీ హబ్ ఓరియంటేషన్ సెషన్‌కు హాజరైంది. అక్కడే తనకంటూ ఓ స్పష్టత వచ్చింది. వ్యాపారం ద్వారా కుటుంబ ఆదాయం పెరిగి తన కాళ్లమీద తాను నిలబడగలనని భావించింది. వ్యాపారం బాగా నడిస్తే.. ఎప్పుడైనా ట్యాక్సీ కొనుగోలు చేయవచ్చని భర్తకు నచ్చ జెప్పింది. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, స్టేషనరీ షాప్ పెట్టుకోవాలని సంకల్పించింది. కంప్యూటర్ ఎంబ్రాయిడరీలో శిక్షణ కూడా తీసుకుంది. యూనిట్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, యంత్రాల కొనుగోలు, కొటేషన్ల ధ్రువీకరణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆమోదం, మార్కెటింగ్ తదితర అంశాల్లో 'వీ హబ్' ఆమెకు అండగా నిలబడింది. ప్రతిదశలోనూ నడిపించింది.

**నెరవేరిన 'కల'..** మౌనిక వ్యాపార స్వప్నాన్ని 'దళితబంధు' నెరవేర్చింది. ఆమె జీవితంలో కొత్త వెలుగులు తెచ్చింది. ఉపాధి కోసం మౌనిక కుటుంబం ఘట్‌కేసర్ ప్రాంతానికి వలస వచ్చి ఉంటున్నది. దీంతో ఈ ప్రాంతంలోనే కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, స్టేషనరీ షాప్‌ను ఏర్పాటుచేసుకుని ఆత్మగౌరవంతో బతుకుతున్నది. ట్యూటర్‌గా ఉన్నరోజుల్లో కనాకష్టంగా నెలకు నాలుగువేలు సంపాదించిన చేతులతోనే.. వ్యాపారాన్ని ప్రారంభించిన నాటి నుంచే నెలకు రూ.10వేలకు పైగా ఆర్జిస్తున్నది. బతకడానికి గతంలో ఎన్నో కష్టాలు పడ్డామని, జీవితం ఇంత బాగుంటుందని కలలో కూడా అనుకోలేదని మౌనిక సంబురంగా చెబుతున్నది. ఇద్దరు అమ్మాయిలను బాగా చదివిస్తానని వివరించింది. త్వరలోనే వ్యాపారాన్ని మరింతగా విస్తరించుకుంటానని వెల్లడించింది. అవును, ఒక విజయంతోనో, ఒక మలుపు దగ్గరో ఆగిపోవడం ఆంత్రప్రెన్యూర్స్ లక్షణం కాదు. ముమ్ముందుకు సాగుతూనే ఉండాలి.. మౌనికా పరుగెత్తాలిక!



## ఏక్‌దమ్ ఫిట్



ఆరోగ్యంగా ఉండాలంటే.. ఫిట్‌గా ఉండాలి. ఫిట్‌గా ఉండాలంటే.. బరువును అదుపులో ఉంచాలి. అయితే, అదనపు కొవ్వును వదిలించుకోవడం అంత సులభమైన వ్యవహారం కాదు. ఆ ప్రయత్నంలో ఉన్నవారికి శాస్త్రీయమైన మార్గాన్ని చూపుతున్నారు క్లినికల్ న్యూట్రిషనిస్ట్, మైండ్ అండ్ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్.. దీపిక చలసాని. ఆమె నేతృత్వంలోని 'ఫిట్4లైఫ్ ఇండియా'ఊబకాయంపై యుద్ధం ప్రకటించింది. దీపిక చలసాని.. పుణెలో పుట్టి పెరిగారు. తమిళనాడు నీలగిరి జిల్లాలోని కోటగిరి బోర్డింగ్ స్కూల్‌లో చదివారు. సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ఎంబీఏ పట్టా కూడా ఉంది. ఆ తర్వాత కార్పొరేట్ కెరీర్ మొదలైంది. మైక్రోసాఫ్ట్, విప్రో, గూగుల్ తదితర దిగ్గజ సంస్థలకు సేవలందించారు. ఆ సమయంలోనే పెండ్లయింది. ఇద్దరు పిల్లలు. కెరీర్‌లో చాలా పేరు సంపాదించారు. ఖ్యాతి వచ్చినా, డబ్బు పోగైనా.. ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. తరచూ ప్రయాణాలు, తీరిక లేనంత ఒత్తిడి వల్ల రోగాలు చుట్టు ముట్టాయి. నాలుగు పదులు నిండకుండానే బీపీ, షుగర్ దాడి చేశాయి. నిస్సత్తువ ఆవహించింది. బరువు కూడా అధికమైంది. ఒక దశలో 95 కిలోలు దాటింది. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించొచ్చు. ఒంటినిండా రోగాలు ఉన్నప్పుడు, బీరువా నిండా డబ్బున్నా వృథా అని తెలుసుకున్నారు. ఉద్యోగానికి స్వస్తి పలికి.. బరువు తగ్గే మార్గాలు అన్వేషించారు. ఎంతోకొంత తగ్గినా సైడ్ ఎఫెక్ట్స్ వచ్చేవి. ఏం చేయాలో అర్థమయ్యేది కాదు. 'ఇంత చదువు చదివి నా ఆరోగ్యాన్ని నేనే కాపాడుకోలేక పోతున్నానే?' అని బాధపడేవారు.

**సమాధానం కోసం..** దీపిక తండ్రి సుబ్బారావు కూడా ఊబకాయంతో బాధపడేవారు. కానీ పట్టుదలతో పాతిక కిలోలు వదిలించుకున్నారు. 'నేను మాత్రం తగ్గలేనా?' అనుకున్నారు దీపిక. 'బరువు తగ్గాలంటే ఏం చేయాలి?' అనే ప్రశ్నకు జవాబు వెతికారు. ఈ క్రమంలో కొత్త విషయం తెలిసింది. డైట్ కంట్రోల్ కంటే మైండ్ కంట్రోల్ ముఖ్యమని అర్థమైంది. మైండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి వివిధ కోర్సులు చేశారు. 'ఈటింగ్ థెరపీ' ప్రాక్టీస్ చేశారు. పళ్లెంలో పోషకాలకు స్థానం కల్పించారు. ఒక్కసారిగా భారీగా బరువు తగ్గడం కంటే.. మెల్లమెల్లగా తగ్గే పద్ధతినే ఎంచుకున్నారు. రెండు సంవత్సరాల్లో 95 కిలోల నుంచి 68 కిలోలకు వచ్చారు. బరువు తగ్గుతున్నప్పుడు బాడీలో డిటాక్సిఫికేషన్ మొదలవుతుంది. నీరసంగా అనిపిస్తుంది. ఫుడ్ ట్రెండ్‌స్టైల్ మారడం వల్ల తరచూ మూడ్ మారిపోతుంది. చిన్న చిన్న విషయాలకే కోపం వస్తుంది. ఇష్టమైన రుచులకు దూరంగా ఉండటం కష్టంగానే ఉంటుంది. ఇవన్నీ అదుపు చేయడానికే.. మైండ్ కంట్రోల్ థెరపీని పరిచయం చేస్తారు దీపిక. మనసును గెలిస్తే, పొట్టను గెలవడం ఏమంత కష్టం కాదు. అలా మనసు కేంద్రంగా ఊబకాయంపై పోరాటం మొదలుపెట్టారు.

**సన్నిహితులతో మొదలై..** క్రమంగా 23 కిలోల బరువు తగ్గిన దీపికను చూసి బంధువులు, స్నేహితులు ఆశ్చర్యపోయారు. 'ఎలా సాధ్యమైంది?' అని అడిగారు. దీంతో దీపిక తాను అనుసరించిన వెయిట్ మేనేజ్‌మెంట్ సూత్రాలను వారికీ పరిచయం చేశారు.
చాలామందిలో మంచి ఫలితాలు కనిపించాయి. దీంతో బరువు తగ్గాలనుకునే వారికోసం 'ఫిట్4లైఫ్ ఇండియా' పేరుతో ఒక వేదిక ఏర్పాటు చేశారు దీపిక. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ప్రారంభించారు. అంతలోనే కరోనా రావడంతో ఆన్‌లైన్‌కే పరిమితం చేశారు. అక్కడితో ఆగకుండా.. విదేశాలకు వెళ్లి అధునాతన పద్ధతులు అధ్యయనం చేశారు. ఇప్పుడు ఐదు ఖండాల్లో ఫిట్4లైఫ్ ఇండియా సేవలందిస్తున్నది. దేశ మంతటా ఫిట్4లైఫ్‌కు క్లయింట్లు ఉన్నారు. 'బరువు తగ్గడం వల్ల శరీరమే కాదు, మనసూ తేలికపడుతుంది. వృద్ధాప్య లక్షణాలు దూరం అవుతాయి. నా దృష్టిలో ఇదొక సామాజిక వ్యాపారం. ఊబకాయంపై యుద్ధం. అధిక బరువుపై పోరాటం' అంటారు దీపిక.

**తగ్గాలంటే..** ఆహారపు అలవాట్ల విషయంలో క్రమశిక్షణ తప్పితే.. వేగంగా బరువు పెరిగే ప్రమాదం ఉంది.
ఒక్కొక్కరి శరీరతత్వం ఒక్కోలా ఉంటుంది. శరీర వ్యవస్థను, జీర్ణశక్తిని బట్టి డైట్ నిర్ణయించుకోవాలి. మేం ఇచ్చే ఫుడ్ వాళ్ల మైండ్‌సెట్‌కి సూట్ అవుతుందా లేదా అన్నదీ పరిశీలిస్తాం. ఫ్యామిలీ ఫుడ్ హిస్టరీని బట్టి ఆహార అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసి.. బరువుకు, వయసుకు తగినట్టు ప్రొటీన్లు అందిస్తాం.

## రంగుల రాజ్యం!

ప్రకృతి నిండా రంగులే. పరికించి చూస్తే అడుగు అడుగుకో వర్ణం. అణువు అణువులో అద్భుతం. మనం అడిగినవీ, అడగనివీ చాలానే ఇచ్చింది. కానీ, మనమే ప్రకృతికి దూరంగా వచ్చేశాం. వికృతికి అలవాటు పడిపోయాం. కృత్రిమత్వానికి దగ్గరయ్యాం. ప్రకృతి నిండా రంగులే. పరికించి చూస్తే అడుగు అడుగుకో వర్ణం. అణువు అణువులో అద్భుతం. మనం అడిగినవీ, అడగనివీ చాలానే ఇచ్చింది. కానీ, మనమే ప్రకృతికి దూరంగా వచ్చేశాం. వికృతికి అలవాటు పడిపోయాం. కృత్రిమత్వానికి దగ్గరయ్యాం. మళ్లీ ప్రకృతి వైపు, సహజత్వం వైపు అడుగులేస్తే ఎంత బాగుంటుందో వివరిస్తున్నారు మాన్య చేరబుద్ధి. నేచురల్ డైయింగ్ కాన్సెప్ట్‌తో సహజ సిద్ధమైన రంగులను పరిచయం చేస్తున్నారామె.ఇష్టమైన షర్ట్ మీద కాఫీ మరక పడితే మనసు విలవిల్లాడుతుంది. ఖరీదైన పట్టుచీరకు మొండి మరక అంటుకుంటే గుండె జారి గల్లంతైపోతుంది. అదేదో సబ్బుల కంపెనీ



ప్రకటనలో చెప్పినట్టు మరక మంచిదే అంటున్నది మాన్య. కాకపోతే అది సహజంగా తయారు చేసుకున్నది అయితే చాలంటుంది. సహజ పద్ధతుల్లో దుస్తుల మీద రంగుల అద్దకం గురించి అధ్యయనం చేసిందామె. ఎంతో మందికి ఆన్‌లైన్‌లో నేచురల్ డైయింగ్ గురించి అవగాహన కల్పిస్తున్నది మాన్య చేరబుద్ధి.నేచురల్ డైయింగ్ కొత్తగా వచ్చిందేం కాదు. పురాతన కాలం నుంచీ ఉన్నదే. బట్టలు రంగురంగుల్లో ఆకర్షణీయంగా కనిపించేందుకు పూలు, ఆకులు, సుగంధ ద్రవ్యాల నుంచి తీసిన వర్ణాలను వాడేవారు. సింథటిక్ డైయింగ్ పెరిగిన తర్వాత ఈ ప్రక్రియ క్రమంగా కనుమరుగు అవుతున్నది. చాలామంది పిల్లలకు రంగులు ఎక్కడి నుంచి వస్తాయో కూడా తెలియదు. ఎక్కడో పరిశ్రమల్లో తయారు చేస్తారనే అనుకుంటారు. కానీ, 'ప్రకృతి మనకు తీరొక్క రంగులను బహుమతిగా ఇచ్చింది. రంగులు కూడా ఒక రకమైన ఔషధమే' అంటారు మాన్య. ఈ సహజ వర్ణాలను పసుపు, ఉల్లిపొట్టు, దానిమ్మ తొక్కలు, రకరకాల పూలు, మోదుగు ఆకులు, పోకలు, టీ పొడి, కాఫీ పొడి, మంజిష్ట, పత్తిముగం వంటి వాటితో తయారు చేసుకుని.. వస్త్రాలపై




నైపుణ్యంతో అద్దుతుంది మాన్య.సహజ సిద్ధమైన రంగుల తయారీకి ప్రత్యేక పద్ధతులు ఉంటాయి. ముందు మనకు కావాల్సిన రంగు దేని నుంచి వస్తుందో గుర్తించాలి. తర్వాత ఆ పదార్థాన్ని వేడినీళ్లలో 40 నిమిషాల పాటు మరగబెట్టాలి. అప్పుడే, అందులోని రంగు నీటిలోకి దిగుతుంది. డై వేసే ముందు బట్టలను పటిక నీళ్లలో నానబెట్టాలి. తర్వాత నీడలో ఆరేయాలి. అయితే, మనం డై వేయాలనుకున్న ఫ్యాబ్రిక్ కాటన్‌ది అయితేనే రంగు బాగా అంటుకుంటుంది. పసుపు, సుగంధ ద్రవ్యాలు, పూల రంగులు అద్దకం చేసిన వస్త్రాలను నిత్యం ధరించడం వల్ల అందులోని ఔషధ గుణాలు శరీరానికి మేలు చేస్తాయి. చెమట వాసనను అడ్డుకుంటాయి.

**ఆయుర్ వస్త్రం..** ఇప్పటి వరకు మాన్య ఐదువేల మందికి సహజ వర్ణాల తయారీ పద్ధతిని నేర్పింది. అందులో ఓ యాభైమంది నేచురల్ డైయింగ్ బిజినెస్ కూడా స్టార్ట్ చేశారు. నేచురల్ డైయింగ్ పుట్టిందే భారతదేశంలో. మనకు ఆయుర్వేదం మాత్రమే తెలుసు. 'ఆయుర్ వస్త్ర' అనే అంతే ప్రాచీన శాస్త్రం కూడా ఒకటి ఉందన్న సంగతే మరిచిపోయాం. ఈ విషయాలు అందరికీ తెలిసేలా సెమినార్‌లు, వర్క్‌షాప్‌లు, క్లాసులు నిర్వహిస్తున్నది మాన్య. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన మాన్యకు చిన్నప్పటి నుంచీ కళలు, ప్రకృతి అంటే ఇష్టం. ఆ మక్కువతోనే చిన్నప్పటి నుంచీ ఆకులు, పూలను గమనించేది.